


# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 172 ఆదివారం 15 ఫిబ్రవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 25 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్









## కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది

- హస్తం పార్టీపై మోదీ విమర్శలు
- అసోంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- విపక్ష కాంగ్రెస్ పార్టీపై ప్రధాని ఫైర్
- కాంగ్రెస్ పాలనలో అసోం భయం గుప్పిట్లో ఉ ఒడేదని ఎద్దేవా
- 'కాంగ్రెస్ హయాంలోనే 2జీ, 3జీ టెక్నాలజీ- అలాగే 2జీ స్కామ్ కూడా'

2

# 3,32,205

## 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ రూపకల్పన



శాసనసభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

బడ్జెట్: రూ.3,32,205 కోట్లు

రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు


మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు

రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు

ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లు

*శాసనసభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి పయ్యావుల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్, 2 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌లను మంత్రి ప్రవేశ పెట్టారు.*

3



## ప్రజల రాజధాని 'అమరావతి'ని నిర్మించాలనే నిబద్ధతతో ప్రభుత్వం పనిచేస్తోంది

**2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన మంత్రి రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు వెల్లడి 10 ప్రాధాన్యతాంశాలను ప్రకటించిన పయ్యావుల**



**అమరావతి**

ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే నిబద్ధతతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ఆయన శనివారం శాసనసభలో ప్రవేశపెట్టారు. స్వ యం సమృద్ధి నమూనాలో వివిధ ఆర్థిక సంస్థల ద్వారా నిధులను సమీకరించి రాజధాని పనులను వేగంగా ముందుకు తీసుకెళు తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. - మిగతా3లో



## ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

- మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది: అమిత్ షా
- కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదు
- మోదీ ప్రభుత్వం హయాంలో సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పారు- అమిత్ షా కీలక వ్యాఖ్యలు

2

## గ్రూప్-1 నియామకాల్లో

# అక్రమాలు!

- దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఏపీపీఎస్సీలో అక్రమాలపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటుకు ఉత్తర్వులు
- 27/2018 నోటిఫికేషన్ నియామకాల్లో అక్రమాలపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు
- హైకోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 11న రిట్ అప్పీల్, అనుబంధ పిటిషన్లు దాఖలు
- అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు




**అమరావతి**

ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 27/2018 నోటిఫికేషన్ నియామకాల్లో అక్రమాలు జరిగాయని హైకోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 11న రిట్ అప్పీల్, అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు అక్రమాలపై దర్యాప్తునకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. చీఫ్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు. మరో సభ్యుడిగా జ×ణ ఎస్పీ కె.చక్రవర్తి నియమితుల య్యారు. దర్యాప్తునకు సంబంధించి సిట్‌కు అన్ని అధికారాలు అప్పగించారు. సోదాలు చేసేందుకు, ఆధారాల స్వాధీనానికి ఎలాంటి - మిగతా3లో

## 16న అమరావతికి

# బిల్ గేట్స్



- 3సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే: సీఎం చంద్రబాబు
- తొలిసారి హైటెక్ సిటీ, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం వచ్చారు
- ఇప్పుడు సంజీవిని పథకం కోసం వస్తున్నారు
- సంజీవిని పథకానికి ఆర్టీజీఎస్‌లో కార్యక్రమం రూపొందించామన్న సీఎం చంద్రబాబు

**అమరావతి**

సోమవారం(16-2-2026) బిల్ గేట్స్ అమరావతి వస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. బిల్ గేట్స్‌ను 3సార్లు ఏపీ కి తీసుకొచ్చిన ఘనత తనదేనని అన్నారు. ఇదో డెస్టినీ అని చంద్రబాబు తెలిపారు. తొలిసారి హైటెక్ సిటీ, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం వచ్చారని, ఇప్పుడు సంజీవిని పథకం కోసం వస్తున్నారని చెప్పారు. దీనికి సంబంధించి ఆర్టీజీఎస్‌లో కార్యక్రమం రూపొందించామని చంద్రబాబు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఒకప్పుడు జూబ్లీహిల్స్ దాటితే మొత్తం అడవిలా ఉండేదని, 1982లో జూబ్లీహిల్స్‌లో ఇప్పుడు బాలకృష్ణ ఉంటున్న ఇంటి స్థలంలో తనకు ఇల్లు కట్టిస్తానని ఎన్టీఆర్ చెప్పారని గుర్తుచేశారు. అప్పుడు తాను మంత్రిగా ఉండి స్థలం చూసేందుకు వెళ్తే మొత్తం అడవిలా ఉందని తెలిపారు. ఇక్కడికి ఆటోలు కూడా రావని పెద్దాయనతో సున్నితంగా వద్దని చెప్పానన్నారు. ఆ తర్వాత అక్కడ బాలకృష్ణకు ఇల్లు కట్టించి ఇచ్చారని, - మిగతా3లో




## అమెరికా ఒప్పందంపై ప్రధాని, మంత్రులు భ్రమలు కల్పిస్తున్నారు

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై మరోసారి రాహుల్ విమర్శలు
- వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపణ
- ప్రధాని, ఆయన మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని విమర్శ
- ఎక్స్‌లో వీడియో విడుదల చేసిన రాహుల్

2

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు కోబ్రా కమాండోల దుర్మరణం
- ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కోబ్రా కమాండోల మృతి చెందారు
- ధమ్తరి జిల్లాలో ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన కమాండోల కారు
- ఈ ఘటనలో మరో కమాండోకు తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం



## భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువైన హెరాయిన్ జారవిడిచిన డ్రోన్

- శుక్రవారం రాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను గుర్తించిన స్థానికులు
- డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు గుర్తించిన స్థానికులు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



## ఈశాన్యంలో చారిత్రక ఘట్టం

- తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ'
- హైవేపై దిగిన మోదీ విమానం
- ఈశాన్య భారతంలో తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ హైవే ప్రారంభం
- ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130 జే విమానంలో దిగిన ప్రధాని
- చైనా సరిహద్దుల్లో కీలకంగా మారనున్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది



కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ.10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.

**అసోం వృద్ధి ప్రయాణం చాయ్ నుంచి చిప్స్ వరకు : మోదీ**

"కాంగ్రెస్ అసంతృప్తికి అతిపెద్ద కారణం ఓటు బ్యాంకు రాజకీయాలే. హస్తం పార్టీ ఎప్పుడూ అసోంను ఎన్నికల కోణంలోనే చూసింది. ఆ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అసోంకు చేరడానికి సంవత్సరాల కాలం పట్టింది. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అసోం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కొంతకాలం క్రితం దేశంలో మొట్టమొదటి స్లీపర్ వందే భారత్ రైలు అసోం నుంచే ప్రారంభమైంది. సెమీకండక్టర్ రంగంలో అసోం వృద్ధి ఇంజిన్‌గా మారుతోంది. ఇక్కడ తయారయ్యే చిప్‌ల గురించి అసోం టీ లాగా ప్రపంచవ్యాప్తంగా చర్చించుకునే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ రాష్ట్ర వృద్ధి ప్రయాణాన్ని చాయ్ నుంచి చిప్స్ వరకు చూడవచ్చు."

**'కాంగ్రెస్ హయాంలోనే 2జీ, 3జీ టెక్నాలజీ- అలాగే 2జీ స్కామ్ కూడా'**

కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2+ స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అసోంలో హింస, వేర్పాటువాదం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏ సర్కార్ శాంతి, శ్రేయస్సు, వేగవంతమైన అభివృద్ధి అనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన అసోంలో ఇప్పుడు శాంతి నెలకొందన్నారు. "అలాగే అధికారంలో లేకపోవడం వల్ల కాంగ్రెస్ మరింత విషపూరితంగా మారింది. కింది స్థాయి నుంచి అగ్ర నాయకుల వరకు అందరూ విషం చిమ్ముతున్నారు. అసోంను మళ్లీ అశాంతి, గందరగోళంలోకి నెట్టాలని హస్తం పార్టీ ప్రయత్నిస్తోంది. రాష్ట్రాన్ని చొరబాటుదారులకు అప్పగించాలని కోరుకుంటోంది. కాంగ్రెస్ నాయకులందరూ చొరబాటుదారు లను కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. అసోం నిజమైన గుర్తింపును తుడిచిపెట్టాలని కోరుకుంటున్నారు. "

**ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తున్నాం!**

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని మోదీ మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తుందని అన్నారు. అసోంలో మౌలిక సదుపాయాల పెంపుదలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ భారత్‌ను ఒక దేశంగా పరిగణించడానికి కూడా నిరాకరిస్తుందని, భారతమాత పట్ల కనీస గౌరవం కూడా చూపదని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తగా ఉండటం తన జీవితంలోని గొప్ప గౌరవం అన్నారు.

రాబోయే ఐదేళ్లు అసోంకు కీలకం : ప్రధాని మోదీ

"2014 నాటికి దేశంలో కేవలం 6 ఎయిమ్స్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ ఏడాదే దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో ఎయిమ్స్‌ల సంఖ్య భారీగా పెరిగింది. బీజేపీ సర్కార్ గువాహటిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది. నిన్ననే 'పీఎం-రాహత్' పథకానికి ఆమోదం తెలిపాం. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, ఎవరైనా ప్రమాదంలో గాయపడితే కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్సను అందిస్తుంది. గత 11 ఏళ్లలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అసోంకు కేంద్ర ప్రభుత్వం రూ.5.5 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించింది. ఈశాన్య ప్రాంతాల కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాం. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇటీవల గువాహటిలో పరీక్ష పే చర్చ కార్యక్రమం జరిగింది. బ్రహ్మపుత్ర నదిపై క్రూయిజ్‌లో విద్యార్థులతో నేను చర్చించాను. రాబోయే ఐదేళ్లు అసోంకు చాలా కీలకం." అని మోదీ పేర్కొన్నారు.

అసోం అభివృద్ధిలో, ప్రజల జీవితాల్లో బ్రహ్మపుత్ర నదిది ప్రముఖ పాత్ర అని మోదీ పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో బ్రహ్మపుత్ర నదిని దాటడం ఎల్లప్పుడూ పెద్ద సవాలుగా ఉండేదని ఆరోపించారు. దాదాపు 7 దశాబ్దాల పాలనలో ఆ పార్టీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం 3 వంతెనలను మాత్రమే నిర్మించాయన్నారు. గత 10-11 ఏళ్లలో బీజేపీ సర్కార్ బ్రహ్మపుత్ర నదిపై ఐదు పెద్ద వంతెనలను పూర్తి చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అసోంకు సమస్యలను మాత్రమే ఇచ్చిందని, బీజేపీ మాత్రం వాటికి పరిష్కారాలను చూపిందన్నారు.

# ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు



కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడు లకు సరైన సమాధానం దొరకలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పిందని వ్యాఖ్యానించారు. 2019 ఫిబ్రవరి 14 జరిగిన పుల్వామా ఉగ్రదాడిని ఉటంకిస్తూ, ప్రతీకారం తీర్చుకునే కొత్త సంప్రదాయానికి మోదీ శ్రీకారం చుట్టారని షా పేర్కొన్నారు. యూపీఏ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు, భారత సైనికులపై తీవ్ర స్థాయిలో దాడులు జరిపారని ఆరోపించారు. కానీ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన సైనికులు, శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదులను అంతమొందించారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని కారైకల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళులర్పించారు. "పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. కాంగ్రెస్ పాలనలో, పాకిస్థాన్ ఉగ్రవాదులు ప్రతిరోజూ మన సైనికులపై దాడి చేసేవారు. దీనిపై దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రక్షణ మంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండేది కాదు. కానీ పుల్వామా దాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం వైమానిక దాడులు చేసింది. పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించి, ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించింది. ప్రధాని మోదీ హయాంలో మొదట సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చింది"

**మీ ముందు రావడానికి రెండు కారణాలు ఉన్నాయి: అమిత్ షా**

మరోవైపు, పుదుచ్చేరిలోని బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న అమిత్ షా ఆ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రావడానికి రెండు లక్ష్యాలు ఉన్నాయని షా పేర్కొన్నారు. అందులో మొదటిది మోదీ, రంగ స్వామి నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచడానికని, రెండోది అవినీతి శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖూూ - ×చీణ× కూటమిల ముసుగును బయటపెట్టడానికని షా వ్యాఖ్యానించారు. "ఐదు సంవత్సరాల క్రితం, పుదుచ్చేరి ప్రజలు ప్రధాని మోదీ, రంగస్వామి నాయకత్వంలో ఇక్కడ ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. భారత్‌ను సుసంపన్నంగా, సురక్షితంగా మార్చడానికి ప్రధాని మోదీ కృషి చేశారు. పుదుచ్చేరి ప్రజలు ఎన్‌డీఏ, బీజేపీ, రంగస్వామి, ప్రధాని మోదీపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, పుదుచ్చేరి ప్రజలు 44% ఓట్లను గెలుచుకుంది. కానీ ఈసారి బీజేపీ, ఎఐఎన్‌ఆర్‌సీ, ఎఐఎడీఎంకే కూటమి 60% ఓట్లతో సీట్లను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పుదుచ్చేరిలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానంగా మూడు పనులు చేసింది. అందులో మొదటిది అవినీతిని అంతం చేయడం, రెండోది పుదుచ్చేరిని స్వయంప్రతిపత్తి కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం, మూడోది పుదుచ్చేరికి రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం వంటి పనులు చేసింది." అని అమిత్ షా పేర్కొన్నారు.

**జవాన్ల ప్రాణ త్యాగాలను భారత్ ఎన్నటికీ మరచిపోదు!**

ఇదిలా ఉండగా, 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. జవాన్ల ప్రాణ త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు.

# అమెరికా ఒప్పందంపై ప్రధాని, మంత్రులు భ్రమలు కల్పిస్తున్నారు




అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.

"భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడు.

**మోదీ ప్రభుత్వం పత్తి, వస్త్ర రంగాలకు నష్టం కలిగించింది!**

ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.

**భారత్- అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం!**

గత వారం భారత్-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్ పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశు గ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

## ఈశాన్యంలో చారిత్రక ఘట్టం




ఈశాన్య రాష్ట్రం అసోం చారిత్రక ఘట్టానికి సాక్షిగా నిలిచింది. అసోంలో ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీని శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. దిబ్రూగఢ్‌లోని మొరాన్ బైపాస్ వద్ద తీర్చిదిద్దిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130జే విమానంలో మోదీ ల్యాండయ్యారు. తొలుత చబువా ఎయిర్‌ఫీల్డ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ సీ 130 జే విమానం ఎక్కి మొరాన్ బైపాస్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిలో దిగారు. అదే ఈఎల్ఎఫ్‌పై ఆధునిక యుద్ధ విమానాలైన రఫేల్, సుఖోయ్-30, హెలికాప్టర్ల విన్యాసాలను ఆయన తిలకించారు. దాదాపు 40 నిమిషాలు పాటు ఈ విన్యాసాలు జరిగాయి. అంతకుముందే ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ గురించి ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు.

**ఈఎల్ఎఫ్ ప్రత్యేకత ఇదే**

చైనా సరిహద్దులకు సమీపంలో దేశ రక్షణకు ఈ ఈఎల్ఎఫ్ కీలకం కానుంది. 4.2 కిలోమీటర్ల పొడవైన ఈ హైవే కోసం దాదాపు 100 కోట్లు ఖర్చు చేశారు. అత్యవసర సమయాల్లో సైనిక, పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్ కోసం భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సమన్వయంతో ఈ ఈఎల్ఎఫ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. దీని వల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు జరిగినప్పుడు భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు అవకాశం ఉంటుంది. 40 టన్నుల వరకు యుద్ధ విమానాలను, 74 టన్నుల గరిష్ఠ టేకాఫ్ బరువు గల రవాణా విమానాలను నిర్వహించగలదు. టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా దీనిని రూపొందించారు. ఇప్పటికే పశ్చిమ, ఉత్తర, మధ్య భారత్‌లో ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి. రూ. 5,450 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇవి ఈశాన్య ప్రాంతంలో కనెక్టివిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉన్న విద్య వంటి అంశాలను బలోపేతం చేసే లక్ష్యంగా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం బ్రహ్మపుత్ర నదిపై వంతెనను, ఈశాన్య ప్రాంతానికి డేటా సెంటర్ సహా అసోంలోని పలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్నారు. బ్రహ్మపుత్రపై దాదాపు రూ.3,030 కోట్ల వ్యయంతో నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును ప్రధాని ప్రారంభిస్తారు. 2019 ఫిబ్రవరి 9న ఈ వంతెనకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే పీఎం-ఈబస్సు సేవా కింద 225 ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రారంభించనున్నారు.

**మోదీ మణిపుర్ వెళ్లాలని టికెట్ బుక్ చేసిన కాంగ్రెస్**

మరోవైపు ప్రధాని మోదీ అసోం పర్యటనపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఉద్రిక్తతలు జరుగుతున్న మణిపుర్‌లో కాకుండా మోదీ అసోం పర్యటించడాన్ని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. అసోం నుంచి మణిపుర్‌కు కేవలం గంటలో వెళ్లొచ్చని అన్నారు. మణిపుర్‌కు వెళ్లాలని, ప్రధాని హామీ ఇస్తే ప్రజలు నిర్భయంగా ఉంటారని తెలిపారు. తాము ప్రధానికి విమానం టికెట్ కూడా బుక్ చేశామని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '2023 నుంచి మణిపుర్‌లో అల్లర్లు జరుగుతూనే ఉన్నాయి. ఆదివారం జరిగిన దాడులతో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. మీరు ఈ రోజు అసోంలోనే ఉన్నారు. మణిపుర్ వెళ్లడానికి వీలుగా గువాహటి విమానాశ్రయం నుంచి ఇంఫాల్‌కు విమానం టికెట్ బుక్ చేశాం. మీ ఫోన్ నంబర్ నా దగ్గర లేకపోవడం వల్ల విమాన టికెట్‌ను సోషల్ మీడియా షేర్ చేస్తున్నా. దయచేసి దానిని ఉపయోగించుకుని మణిపుర్ వెళ్లండి' అని పవన్ ఖేడా టికెట్‌ను పోస్ట్ చేశారు. దీనిపై బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారు.

## భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువైన హెరాయిన్ జారవిడిచిన డ్రోన్

భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఆర్ఎస్ పురా సెక్టార్ ప్రాంతంలో రూ.40 కోట్లకు పైగా విలువైన 6.5 కిలోల హెరాయిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అనుమానిస్తున్నారు. శుక్రవారం రాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు స్థానికులు వారికి తెలిపారు. దీంతో పోలీసులు బీఎస్ఎఫ్ దళాలతో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. స్థానిక పొలాల్లో పెద్ద ఎత్తున హెరాయిన్‌ను గుర్తించారు. దాని మొత్తం విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, కథువా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పాక్ నుంచి హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన జతిన్, కథువాలోని జఖ్‌బార్‌కు చెందిన డానిష్ డోగ్రాలుగా గుర్తించారు. వీరికి పాకిస్థాన్ స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 201వ కోబ్రా బెటాలియన్‌కు చెందిన నలుగురు కమాండోలు ప్రాణాలు కోల్పోయారు. మరో కమాండో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ధమ్తరి జిల్లాలోని ఖ్రపి బైపాస్‌పై శనివారం ఆగి ఉన్న ఒక ట్రక్కును కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నక్సలిజంపై పోరాటంలో అంకితభావంతో పనిచేస్తున్న కమాండోలు మరణించడంపై రాష్ట్రవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. అర్జుని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కమాండోలు జగదల్‌పూర్ నుంచి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం ట్రక్కు కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని, గ్యాస్ కట్టర్ల సహాయంతో కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు కమాండోలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన మరో కమాండోను ధమ్తరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి 'ఎక్స్' వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కోబ్రా బెటాలియన్ వీర జవాన్లు అకాల మరణం చెందారన్న వార్త హృదయ విదారకంగా ఉంది. దేశ సేవలో అంకితమైన ఆ అమర జవాన్లకు నా వినమ్ర నివాళులు" అని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ కూడా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రాథమికంగా అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నప్పటికీ, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్ల కోసం సీఆర్‌పీఎఫ్ కింద పనిచేసే ప్రత్యేక దళమే కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్).

# 3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

శాసనసభలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి పయ్యావుల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్, 2 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌లను మంత్రి ప్రవేశ పెట్టారు. అనంతరం ప్రసంగాన్ని ప్రారంభించారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగుల పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పేర్కొన్నారు.

**బడ్జెట్ కేటాయింపులు:** 2026–27 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0 – రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుకి రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ – రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు, ఉపకారవేతనాలు రూ.3,836 కోట్లు, రూ.సమగ్ర శిక్ష 2,946 కోట్లు, రూ.ఉన్నత విద్య 2,566 కోట్లు కేటాయించారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.654 కోట్లు, యువత, క్రీడలకు రూ.438 కోట్లు, వీబీజీ రామ్‌జీకి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణం రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ రూ.4,000 కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, ఆయుష్మాన్ భారత్ రూ.838 కోట్లు కేటాయించారు.

**వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపులు:** 2026–27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం–నీటి భద్రత కేటాయింపులు చేశారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, రూ.పోలవరం 6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు.

**మూలధన వ్యయం పెంపు:** మూలధన వ్యయాన్ని గత బడ్జెట్ కంటే ప్రభుత్వం పెంచింది. 2025–26 రివైజ్డ్ అంచనాల్లో మూలధన వ్యయం 39,497.56 కోట్లు ఉండగా, 2026–27 బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం రూ.53,915.38 కోట్లు పెంచింది. గత ఏడాది కంటే మూలధన వ్యయాన్ని రూ.14,417.82 కోట్ల మేర ప్రభుత్వం పెంచింది. మూలధన వ్యయం పెంచడం ద్వారా ఆస్తుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. మూలధన వ్యయానికి ఎక్కువ కేటాయింపులు జరపలేదని గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయని మూలధన వ్యయం కేటాయింపుల విషయంలో నాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధానాన్ని వివిధ సందర్భాల్లో కాగ్ తప్పు పట్టిందని పయ్యావుల వెల్లడించారు.

**పన్నుల ద్వారా ఆదాయం:** 2026–27 రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి రాక పన్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం – 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు – 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా – 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ – 10 శాతం ఉంది. రూపాయి పోక సంక్షేమం – 17 శాతం, విద్య – 11 శాతం, ఆర్థికం – 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి – 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం – 6 శా తం, జలవనరులు – 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ – 4 శాతం, విద్యుత్ రంగం – 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు – 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) – 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు – 18 శాతంగా పేర్కొన్నారు.

**రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు:** రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది. 2025–26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.41,118.36 కోట్లు ఉండగా, 2026–27 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.22,002.50 కోట్లు ఉండనుంది. 2025–26 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.80,567.47 కోట్లు ఉంటే, 2026–27 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.75,868.09 కోట్లు ఉండనుంది. న్నుల ద్వారా ఆదాయం – 38 శాతం, పన్నేతర ఆదాయం – 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు – 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా – 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ – 10 శాతం రానుంది. సంక్షేమం ద్వారా 17 శాతం, విద్య – 11 శాతం, ఆర్థికం – 8 శాతం, పంచయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి – 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం – 6 శాతం, జలవనరులు – 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ – 4 శాతం, విద్యుత్ రంగం – 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు – 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) – 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు – 18 శాతం జరుగనున్నాయి.

**ప్రజలకు తెలియాలనే ప్రస్తావించాం:** ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్‌లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని సంప్రదింపులు జరిపామన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నా మన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ.37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయ తీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు.

**స్కీంల పునరుద్దరణకు రూ.18,701 కోట్లు ఖర్చు:** గత ప్రభుత్వం నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 స్కీంల పునరుద్దరణకు రూ.18,701 కోట్లు ఖర్చు పెట్టామని దీని ఫలితంగా కేంద్రం నుంచి నిధుల విడుదల మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్దరించడానికి తెచ్చిన వివిధ సంస్కరణలను బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. సాస్కీ కింద ఇప్పటి వరకు రూ.6,544 కోట్ల మేర నిధులను వినియోగించుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో రూ.1,438 కోట్లు సాస్కీ నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు. సంపద సృష్టిలో భాగంగా ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటును మంత్రి పయ్యావుల ప్రతిపాదించారు. రూ.100 కోట్ల కార్పస్‌తో ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ వెల్త్ ఫండ్ ద్వారా దేశంలోని వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులను ప్రభుత్వం పెట్టనుంది. ఈ మేరకు ఏపీ వెల్త్ ఫండ్‌లో భాగస్వాములు కావాల్సిందిగా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం చేకూర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.

# ప్రజల రాజధాని 'అమరావతి'ని నిర్మించాలనే నిబద్ధతతో ప్రభుత్వం పనిచేస్తోంది



-మొదటిపేజీ తరువాయి

రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే తమ ప్రభుత్వ నిబద్ధతకు ఇది స్పష్టమైన నిదర్శనమని పయ్యావుల అన్నారు. ఇతర పట్టణాల్లోనూ ప్రాజెక్టులు: ప్రజల రాజధాని అమరావతి అభివృద్ధికి మద్దతు అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా కల్పించే ప్రక్రియను ప్రారంభించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలను మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. అమృత్ 2.0 పథకం కింద 117 పట్టణ, స్థానిక సంస్థలలో మొత్తం 506 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని అన్నారు. అదనంగా యూఐడీఎఫ్, ఏఐఐబీ సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులు కూడా పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పయ్యావుల కేశవ్ అన్నారు.

**25 లక్షల గృహాలు అందించడమే లక్ష్యం**

ఈ 2 ఏళ్ల వ్యవధిలో యూఐడీఎఫ్ కింద ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా రూ.4 వేల కోట్లను మంజూరు చేసిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఆధునిక మెట్రో రైలు వ్యవస్థలో ప్రయాణించే కల త్వరలో సాకారం అవుతుందన్నారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ), ఎన్టీఆర్ నగర్స్ కింద ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు 25 లక్షల గృహ పట్టాలు లేదా ఇళ్లను అందించి, సొంత ఇంటి కలను నెరవేర్చడమే మా ప్రభుత్వ లక్ష్యమని పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

**బడ్జెట్ కేటాయింపులు**

2026–27 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ శాఖలకు నిధులు కేటాయించారు. విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, అమరావతికి రూ.6,000 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు, పాఠశాల విద్యాశాఖకి రూ.32,308 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకి రూ.22,942 కోట్లు, పర్యావరణ అటవీ శాఖకి రూ.714 కోట్లు కేటాయించారు. మున్సిపల్ శాఖకి రూ.14,539 కోట్లు, హోంశాఖకి రూ.9,165 కోట్లు, ఎక్సైజ్ శాఖకి రూ.500 కోట్లు, మౌలిక సదుపాయాల, పెట్టుబడుల శాఖకి రూ.1,283 కోట్లు, సమాచార సాంకేతిక శాఖకి రూ.536 కోట్లు, పౌరసరఫరాల శాఖకి రూ.3,821 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, ఎస్సీ సంక్షేమం రూ.20,644 కోట్లు, ఎస్టీ సంక్షేమం రూ.9,190 కోట్లు, బీసీ సంక్షేమం రూ.51,021 కోట్లు, మైనారిటీ సంక్షేమం రూ.6,090 కోట్లు, మహిళాశిశు సంక్షేమం రూ.4,582 కోట్లు, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ రూ.19,306 కోట్లు, కార్మిక శాఖకి రూ.735 కోట్లు కేటాయించారు.

**బడ్జెట్‌లో పది ప్రాధాన్యత అంశాలు**

రాయసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్, నగర ఆర్థిక వ్యవస్థలు, వీబీ జీ రామ్ జీ, రాష్ట్ర సంపద నిధి, నేతలన్నలకు ఉచిత విద్యుత్, స్కూళ్లు, హాస్టళ్ల మౌలిక సదుపాయాలు, టీఆర్ఈడీఎస్ అమలు, క్వాంటమ్ కంప్యూటింగ్, దివ్యాంగులకు ఉచిత బస్సు సర్వీస్, 3 వేల కొత్త పోలీస్ వాహనాలను పది ప్రాధాన్యత అంశాలుగా పయ్యావుల కేశవ్ ప్రకటించారు.

# సామాజిక వర్గాన్ని నమ్ముకున్న వైసీపీ...

**విశాఖపట్టణం :** ఏదైనా ఒక్కసారి చేస్తేనే వర్క్ అవుట్ అవుతుంది. పదే పదే అదే మాట అంటే ప్రజలు వినరు. తెలంగాణలో కెసిఆర్ ని తీసుకుందాం. రెండుసార్లు తెలంగాణ సెంటిమెంట్తో ఎన్నికలకు వెళ్లి గెలిచారు. కానీ మూడోసారి మాత్రం సెంటిమెంట్ తగ్గించి.. జాతీయ భావాలతో వెళ్లారు. అయినా సరే అక్కడి ప్రజలు గుర్తించలేదు. ఏపీలో కూడా అటువంటి సీన్ ఉంది. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఎన్నో రకాల ప్రయోగాలు చేశారు. అందులో కులప్రయోగం ఒకటి. 2014లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని ప్రకటించారు చంద్రబాబు. ఆ ఒక్క అంశాన్ని పట్టుకొని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేశారు. అది అంతిమంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చింది. కానీ అదే ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాన్ని వదిలేశారు. అదే ముద్రగడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినా మొన్నటి ఎన్నికల్లో కాపులు ఇటువైపు చూడలేదు. కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు ముద్రగడ పద్మనాభం. 2016 జనవరి 31న తుని కేంద్రంగా ముద్రగడ నేతృత్వంలో కాపు గర్జన సభ ఏర్పాటు చేశారు. చివరకు ఆ ఉద్యమం రైలు తగలబెట్టే వరకు వచ్చింది. ముద్రగడపై కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా తీసుకున్న కొన్ని రకాల నిర్ణయాలు కాపులను ఆకర్షించాయి. నాడు ముద్రగడపై తెలుగుదేశం ప్రభుత్వం పెట్టిన కేసులను కాపు కులం పై జరిగిన దాడిగా చిత్రీకరించడంలో జగన్మోహన్ రెడ్డి సక్సెస్ అయ్యారు. తద్వారా అప్పట్లో టిడిపి పొలిటికల్ గా భారీ డ్యామేజ్ కు గురైంది. అయితే తాజాగా అంబటి రాంబాబు అరెస్టు ఎపిసోడ్ ను కాపులపై జరుగుతున్న దాడిగా చిత్రీకరించేందుకు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

## 16న అమరావతికి బిల్ గేట్స్

-మొదటిపేజీ తరువాయి

నాలుగేళ్లలోనే అక్కడి పరిస్థితులు చాలా మారిపోయాయని చంద్రబాబు వివరించారు. సినీ హీరోగా బిజీగా ఉంటూ బాలకృష్ణ చెన్నైలో ఉంటే తాను 4ఏళ్లు అదే ఇంటిలో ఉన్నానని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో అక్కడికి సమీపంలో తన ఇల్లు పూర్తయ్యాక అప్పుడు అక్కడికి మారానన్నారు. అమరావతి అభివృద్ధిలోనూ ఇలాంటి గణనీయ మార్పులే ఉంటాయని స్పష్టం చేశారు.

**సీఎం చంద్రబాబుతో కీలక భేటీ!**

బిల్ గేట్స్ ఫిబ్రవరి 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. మొదట ఈ పర్యటన ఈనెల 18వ తేదీన ఉంటుందని అందరు భావించినా 2రోజుల ముందుగానే ఆయన రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ పర్యటన రాష్ట్రంలో ఒక్క రోజే ఉంటుందా? లేక రెండు రోజులు? ఉంటారా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనలో భాగంగా పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమీక్షలో పాల్గొంటారని సమాచారం. రాష్ట్రంలో విద్య, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలకు ాా× పరిజ్ఞానాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే ఓ ఒప్పందాన్ని సైతం కుదుర్చుకుంది. అదేవిధంగా అత్యుత్తమ సాంకేతికత ద్వారా ప్రజల ఆరోగ్య అంశాలను పర్యవేక్షించేలా ప్రాజెక్టును కూడా చేపట్టింది. అంతేగాక బిల్ గేట్స్ ఫౌండేషన్ చేయూతతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేయనుంది.

ఇప్పటికే చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇలాంటి విషయాలతో పాటు మరికొన్నివాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమావేశంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చర్చిస్తారని సమాచారం. అలాగే రాజధాని అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టే పెట్టుబడులపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనంతరం ఫిబ్రవరి 19వ తేదీన దిల్లీలో జరిగేాా× సమిట్‌లో బిల్ గేట్స్ పాల్గొంటారు. సీఎం చంద్రబాబు సైతం ఈ సదస్సుకు హాజరవుతారు.

**అమరావతిలో భారీ క్వాంటమ్ కంప్యూటర్**

ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి టెక్నాలజీలో సరికొత్త గుర్తింపుని తీసుకొచ్చేందుకు క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ రాష్ట్రంలో రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిట్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో అధికారులు జరిపిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. మైక్రోసాఫ్ట్ కోసం క్వాంటమ్ వ్యాలీలో 4 వేల చ.అ. విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

## గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు!

-మొదటిపేజీ తరువాయి

ఆంక్షలు లేకుండా పూర్తి అధికారం ఇచ్చారు. దర్యాప్తు అవసరాలకు ఏ ప్రభుత్వ శాఖ నుంచైనా అధికారుల నియామకానికి వెసులుబాటు కల్పించారు. ఖ్యాూజలో జరిగిన అక్రమాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి ఈ ఏడాది మార్చి 16లోగా సిట్ తన నివేదికను హైకోర్టుకు సమర్పించాలని ప్రభుత్వం సూచనలు చేసింది.

**కీలక ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు**

ఏపీపీఎస్సీ గ్రూప్–1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై కొద్దిరోజులు కిందట ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మూల్యాంకనంలో అక్రమాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అదనపు డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సిట్ బృందం ఏర్పాటు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు జరిపేటప్పుడు రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. విజయవాడలో జరిగిన మూల్యాంకనం సమయంలో వినియోగించిన బార్ కోడ్‌లు, అసలు ఓఎంఆర్ షీట్లు, వాటి వివరాలు ఒకదానితో ఒకటి సరిపోలుతున్నాయో? లేదో అనే విషయాన్ని విశ్లేషించాలని స్పష్టం చేసింది.

ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున వారందరినీ ప్రాధాన్యం లేని పోస్టులకు బదిలీ చేయాలని సీఎస్‌ను ఆదేశించింది. ఈ వ్యవ–ారంలో తీసుకున్న చర్యలపై నివేదికను కోర్టుకు సమర్పించాలని సీఎస్‌కు స్పష్టం చేసింది. మార్చి 16 లోపు గ్రూప్–1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై సిట్ నివేదికను కోర్టుకు సమర్పించాలని సూచించింది.

**169 గ్రూప్–1 పోస్టులకు 2018లో నోటిఫికేషన్**

2018లో అప్పటి ప్రభుత్వం 169 గ్రూప్–1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 2019లో పరీక్షలను నిర్వహించారు. 2021లో పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. జవాబుపత్రాలను డిజిటల్ వాల్యూయేషన్ చేశారని నోటిఫికేషన్ ప్రకారం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు 2021లో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్‌పై విచారించిన న్యాయస్థానం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో ఏపీపీఎస్సీ 2022లో మాన్యువల్‌గా మూల్యాంకనం జరిపిన తర్వాత ఫలితాలను విడుదల చేసింది. గ్రూప్–1 ప్రధాన పరీక్షా జవాబు పత్రాలను హ్యాయ్ ల్యాండ్‌లో ఒకసారి, వేరే ప్రాంతంలో మరోసారి మూల్యాంకనం జరిపారని దీనివల్ల తాము అనర్హులు అయ్యామని పలువురు అభ్యర్థులు 2022లో హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

**అభ్యర్థులు కోర్టు తుది తీర్పుకులోబడే**

ఈ వ్యాజ్యాలపై హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపింది. ఈ దశలో ఇంటర్వ్యూలను నిలువరించలేమన్న న్యాయస్థానం ఇంటర్వ్యూ నిర్వహించేందుకు అనుమతినిచ్చింది. ఇంట ర్వ్యూలో సెలక్ట్ అయిన వారిని ఉద్యోగాల్లో నియమించాలని కోర్టు సూచించింది. నియా మకా లు జరిపే సమయంలో అభ్యర్థులు కోర్టు తుది తీర్పుకులోబడే ఉండాలంటూ అండర్ టేకింగ్ లెటర్ తీసుకోవాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మాన్యువల్ మూల్యాకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న కీలక తీర్పు ఇచ్చారు.

**అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు**

ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన వారు, పొందని వారు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. అప్పీళ్లలో ఉద్యోగాలకు ఎంపికన అభ్యర్థులు కొందరు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. మాన్యువల్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

## కొరకరాని కొయ్యగా విష్ణుకుమార్ రాజు

**విశాఖపట్టణం :** కూటమి ప్రభుత్వంలో విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కొరకరాని కొయ్యగా మారారు. ఆయన వ్యాఖ్యలు ప్రభుత్వంతో పాటు కూటమిని కూడా ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. వరసగా ఆయన ప్రభుత్వానికి, కూటమికి వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లోకి బలంగా వెళుతున్నాయి. విష్ణుకుమార్ రాజు రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో బీజేపీ నుంచి గెలిచిన విష్ణుకుమార్ రాజు 2024 అంటే పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికయ్యారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆయన రూటు మారింది. గతంలో వైసీపీ ప్రభుత్వం పై విరుచుకుపడిన విష్ణుకుమార్ రాజు ఇప్పుడు అధికార పక్షంలో ఉంటూ కూడా తాను ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. విష్ణుకుమార్ రాజు కొంత ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉన్నందున ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారన్నకామెంట్స్ కూడా ఎక్కువగా వినపడుతున్నాయి. ఇటీవల రుషికొండ ప్యాలెస్ పై మంత్రి వర్గ ఉప సంఘం తీసుకున్న నిర్ణయాన్ని విష్ణుకుమార్ రాజు తప్పు పట్టారు. దానిని స్టార్ హోటల్ కు ఇస్తే సామాన్యులకు ఎలా ప్రవేశం దొరకుతుందని ఆయన సూటిగానే ప్రశ్నించి ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టారు. తర్వాత భోగాపురం ఎయిర్ పోర్టు లో ట్రయల్ రన్ పూర్తయిన సందర్భంగా కూడా విష్ణుకుమార్ రాజు వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే కంటే విశాఖ నుంచి విజయవాడకు వందేభార్ రైలులో వెళితే సమయం ఆదాఅవుతుందని చెప్పి ఇబ్బందిలోకి నెట్టారు. రైల్వే మంత్రికి విశాఖ నుంచి విజయవాడకు వందే భారత్ రైళ్లు వేయాలని తాను కోరతానని విష్ణుకుమార్ రాజు చెప్పారు. ఇక గూగుల్ డేటా సెంటర్ పై కూడా ఆయన వ్యాఖ్యలు కూటమి పార్టీలో కలకలం రేపాయి. గూగుల్ డేటా సెంటర్ వస్తే విశాఖ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని, పర్యావరణం దెబ్బతింటుందన్న ఆందోళలనను విష్ణుకుమార్



సంపాదకీయం

# తొలిదశ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగింపు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలిదశ శనివారం ముగిసింది. రాజ్యాంగపరమైన ప్రక్రియలైన రాష్ట్రపతి ప్రసంగం, కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటి కార్యక్రమాలు పూర్తయ్యాయి. అయితే దేశవ్యాప్తంగా ప్రాధాన్యం గల అనేక అంశాలపై సార్ధకమైన చర్చలు జరగకపోవడం పట్ల రాజకీయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సమావేశాల్లో స్పీకర్ ఓం బిర్లా తీరుపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షం తమకు సరైన అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించగా, అధికార పక్షం మాత్రం నియమావళి ప్రకారమే సభను నడిపిస్తున్నామని స్పష్టం చేసింది. పార్లమెంట్ చరిత్రలో స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టడం అరుదైన పరిణామమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బడ్జెట్ కేటాయింపుల విషయంలో కూడా ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. కొత్త సంక్షేమ కార్యక్రమాల కంటే పాత పథకాలకే ప్రాధాన్యం ఇచ్చారని, ఉపాధి, వ్యవసాయం, ధరల పెరుగుదల, యువత నిరుద్యోగం వంటి కీలక సమస్యలపై స్పష్టమైన చర్యలు కనిపించలేదని ఆరోపించారు. ప్రభుత్వం మాత్రం ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా బడ్జెట్ రూపొందించామని వెల్లడించింది.



**రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అనేక జాతీయ అంశాలు ప్రస్తావనకు రావాల్సి ఉన్నప్పటికీ, విస్తృత స్థాయిలో చర్చ జరగలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యసభలో సమాధానం ఇచ్చినప్పటికీ, లోక్‌సభలో మరింత సమగ్ర సమాధానం అవసరమని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం పరిమితమైందని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. మరోవైపు, ఆయనపై అనర్హత ప్రతిపాదన తెరపైకి రావడం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. దీనిని ప్రతిపక్షాలు కక్షసాధింపు చర్యగా అభివర్ణించగా, అధికార పక్షం మాత్రం సభా నియమాల ప్రకారమే వ్యవహరిస్తున్నామని తెలిపింది.**

అమెరికాతో వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్‌తో జరుగుతున్న చర్చలు, అంతర్జాతీయ వాణిజ్య విధానాల మార్పులు వంటి అంశాలపై పార్లమెంట్‌లో సవివర చర్చ అవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం కారణంగా దేశ రైతాంగం, చిన్న వ్యాపారులు ప్రభావితమవుతారన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దిగుమతులపై సుంకాలు తగ్గించే ప్రతిపాదనల వల్ల దేశీయ ఉత్పత్తిదారులకు నష్టం వాటిల్లవచ్చని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే నిర్ణయాలే తీసుకుంటున్నామని స్పష్టం చేస్తోంది. దేశాన్ని ప్రభావితం చేసే కీలక విధాన నిర్ణయాల్లో పార్లమెంట్‌ను విశ్వాసంలోకి తీసుకోవడం ప్రజాస్వామ్య పరిపాలనలో ముఖ్యమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరుపక్షాలు పరస్పర ఆరోపణలకు పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపై సార్థక చర్చలకు వేదికగా పార్లమెంట్‌ను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. మొత్తంగా, బడ్జెట్ సమావేశాల తొలిదశ రాజ్యాంగపరమైన ప్రక్రియలతో ముగిసినప్పటికీ, దేశ ప్రజలు ఆశించిన స్థాయిలో విధాన చర్చలు జరగలేదన్న భావన వ్యక్తమవుతోంది. రెండో దశ సమావేశాల్లో అయినా ముఖ్యమైన జాతీయ, ఆర్థిక, విదేశాంగ అంశాలపై సమగ్ర చర్చలు జరిగేలా ప్రభుత్వంఉప్రతిపక్షాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.



**కంచర్ల అచ్యుత్ రావు**
**ఎడిటర్**

# దేశాభివృద్ధికి క్యాబినెట్ 'మెగా' బూస్ట్

- రూ. 1.60 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఓకే!
- పీఎంఓ ఇకపై 'సేవతీర్థ్'.. బ్రహ్మపుత్ర నది కింద భారీ అండర్ వాటర్ టన్నెల్
- తెలంగాణలో కొత్తగా 4 లైన్ల రహదారి..
- రైల్వే లైన్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్



**ఢిల్లీ, ఫిబ్రవరి 14:** ప్రధానమంత్రి నరేందర్‌మోదీ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర క్యాబినెట్‌సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ. 1,60,504 కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రజల సేవకు అంకితభావాన్ని ప్రతిబింబించేలా ఈ మార్పు చేపట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈశాన్య భారత అభివృద్ధికి దోహదపడే కీలక నిర్ణయంగా అస్సాం రాష్ట్రంలో గోహుపూర్‌ఉనుమాలిఘర్ మధ్య బ్రహ్మపుత్ర నది కింద 34 కిలోమీటర్ల అండర్‌వాటర్ రోడ్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రైల్వే లైన్, నేషనల్ హైవే అవసరాలకు అనుగుణంగా నిర్మించనున్న ఈ టన్నెల్ ద్వారా సుమారు 250 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు, ప్రస్తుతం ఆరు గంటలు పట్టే ప్రయాణాన్ని కేవలం 20 నిమిషాల్లో పూర్తి చేసే వీలుంటుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా కసారాఉమన్మాడ్ మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఢిల్లీఉఅంబాల మధ్య అదనపు రైల్వే లైన్ల నిర్మాణానికి కూడా ఆమోదం లభించింది. బళ్లారిఉ హోస్పేట మధ్య రూ. 2,372 కోట్లతో మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. తెలంగాణఉకర్ణాటక రాష్ట్రాల మధ్య రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచే దిశగా గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ వరకు రూ. 3,175 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం లభించింది. హైదరాబాద్‌ఉపనాజీ కారిడార్‌లో భాగంగా 80 కిలోమీటర్ల మేర కొత్త నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. దమాసియాఉబిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్‌లో నాలుగు లైన్ల నిర్మాణానికి రూ. 4,584 కోట్లు, గోతిఉట్రిమ్బక్‌ఉపాల్ఘర్ సెక్షన్ అభివృద్ధికి రూ. 3,320 కోట్లు కేటాయించారు. కేంద్ర క్యాబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలతో దేశవ్యాప్తంగా రవాణా, రైల్వే, రహదారి మౌలిక సదుపాయాల రంగాలకు కొత్త ఊతం లభించనుందని కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి.

# 'అది నకిలీ సమావేశం'

## రైతులతో రాహుల్ భేటీపై బీజేపీ విమర్శలు



**ఢిల్లీ, ఫిబ్రవరి14:** శుక్రవారం లోక్‌సభ ఆవరణలో రైతు సంఘాల నేతలతో కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సమావేశమైన సంగతి తెలిసిందే. పార్లమెంట్ భవన సముదాయంలో జరిగిన ఈ భేటీలో భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, రైతులు, రైతు కూలీల జీవనోపాధిని కాపాడడంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో రైతులతో రాహుల్ భేటీ.. నకిలీ సమావేశం అంటూ బీజేపీ నేతలు విమర్శించారు. రాహుల్ నిర్వహించిన మీటింగ్ కృత్రిమమైనది, అలానే ఆధారం లేనిదంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శనివారం 'ఎక్స్' వేదికగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వీడియోను రిలీజ్ చేశారు. 'రాహుల్ గాంధీ మరోసారి రంగస్థలం నిర్వహించాడు. ఆయన నిర్వహించిన సమావేశం అత్యంత కృత్రిమమైనదిగా ఉంది. అలాగే దీని ద్వారా నకిలీ కథనాన్ని బయటపెట్టారు. ఈ సమావేశంలో కొందరు కాంగ్రెస్ నేతలు రైతులుగా నటించారు. వారితో రాహుల్ గాంధీ నకిలీ సంభాషణ నిర్వహించారు. రైతుల ప్రయోజనాలను ప్రధాని మోదీ పూర్తిగా రక్షించినా కూడా.. అమాయకపు రైతులను తప్పు దోవ పట్టించేందుకు రాహుల్ గాంధీ, ఆయన స్నేహితులు ఇలాంటి నకిలీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరి నిజ స్వరూపాన్ని బయటపెడతాను' అని గోయల్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అబద్ధాలని, నిజమైన రైతులను ఆందోళనకు గురి చేస్తుందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శుక్రవారం రాహుల్‌తో జరిగిన సమావేశంలో అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని రైతు సంఘాల నేతలు వ్యతిరేకించారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పండ్లు, పప్పు ధాన్యాల రైతుల బతుకుదెరువు.. ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ ఒప్పందంతో దేశంలోకి వ్యవసాయ దిగుమతులకు తలుపులు తెరుచుకుంటాయని.. ఇతర పంటలు కూడా భారత్‌లోకి ప్రవేశిస్తాయని రాహుల్ వారికి చెప్పారని కాంగ్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది.




# హైవేపై దిగిన మోదీ విమానం

## చైనా సరిహద్దులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈశాన్య భారతంలో ఏర్పాటైన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్ఎఫ్)పై ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ (పీ–130జీ) ల్యాండ్ అయింది. ఈ ఫెసిలిటీ చైనా సరిహద్దుకు 300 కి.మీ దూరంలో ఉంది. ప్రధాని మోదీ దీన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాయుసేన ప్రత్యేక విన్యాసాలు ప్రదర్శించింది. ఈ ఫెసిలిటీ గురించి మోదీ ఇప్పటికే ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ ఎయిర్‌పోర్ట్, చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లలో కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితి ఉంటే.. ఈ ఈఎల్ఎఫ్‌ను ఒక ప్రత్యామ్నాయంగా వాడతారు. దాంతో సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు వీలవుతుంది. టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా దీనిని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి. చైనాతో సరిహద్దు వివాదాల వేళ దీన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం

## కొనసాగుతున్న గాలింపు చర్యలు

**బెంగళూరు, ఫిబ్రవరి 14:** అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు. కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# సుప్రీంకోర్టులో 'డాక్టర్' వాదన

## 19 ఏళ్ల యువకుడికి ఎంబీబీఎస్ సీటు ఖరారు!

**తన కేసును తానే వాదించి నెగ్గిన అథర్వ్..**
**'పది నిమిషాల' గడువుతో అద్భుతం**
**ఈడబ్ల్యూఎస్ కోటా అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** అత్యున్నత న్యాయస్థానంలో ఉద్దండ పిండాల వంటి న్యాయవాదులు వాదనలు వినిపించే చోట, 19 ఏళ్ల ఓ యువకుడు అడుగుపెట్టాడు. ఎటువంటి న్యాయవాద అనుభవం లేకపోయినా, రాజ్యాంగ నిబంధనలను ఉటంకిస్తూ తన వాదనలతో ధర్మాసనాన్ని ముగ్ధులను చేశాడు. పది నిమిషాల పాటు తను కోరిన అదనపు సమయమే అతని జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ యువకుడే మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన అథర్వ్ చతుర్వేది.

### నీట్‌లో మెరిసినా దక్కని సీటు

లాయర్ మనోజ్ చతుర్వేది కుమారుడైన అథర్వ్‌కు డాక్టర్ కావాలనేది కల. నీట్ పరీక్షలో ఒకసారి కాదు, రెండుసార్లు ఉత్తీర్ణత సాధించాడు. 2025–26 సెషన్‌లో 530 మార్కులు సాధించినప్పటికీ, అతనికి ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీటు దక్కలేదు. దీనికి కారణం మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోటాను అమలు చేయకపోవడమే. అర్హత ఉన్నా అడ్మిషన్ దక్కకపోవడంతో అథర్వ్ న్యాయపోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు. మొదట జబల్‌పూర్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఏమాత్రం వెనకడుగు వేయకుండా స్వయంగా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశాడు.

### సమయస్ఫూర్తి

విచారణ సమయంలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు అథర్వ్ తన వాదనలు వినిపిస్తూ.. మరింత స్పష్టత కోసం "పది నిమిషాలు అదనంగా కావాలి" అని కోరాడు. అథర్వ్ వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు, ఆర్టికల్ 142 కింద తన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి అతనికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ విద్యాసంవత్సరంలోనే (2025–26) అథర్వ్‌కు ఎంబీబీఎస్ సీటు కేటాయించాలని నేషనల్ మెడికల్ కమిషన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, అథర్వ్‌పై న్యాయమూర్తులు ప్రశంసలు కురిపించారు. "నీవు డాక్టర్ కావాలనుకుంటున్నావా! లేక లాయరా?" అని జబల్‌పూర్ హైకోర్టు న్యాయమూర్తి గతంలో జోక్ చేసేంతగా అథర్వ్ వాదనలు ఆకట్టుకున్నాయి. సుప్రీంకోర్టు సైతం అతని ధైర్యాన్ని, చట్టంపై ఉన్న అవగాహనను అభినందించింది.



మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

| | | |
|---|---|---|
| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

ఆదివారం 15 ఫిబ్రవరి 2026



# మాటల్లో గొప్ప చేతల్లో శూన్యం-చంద్రబాబు మాయల గారడీ బడ్జెట్టు

- బడ్జెట్‌లో రైతులకు 'మొండిచేయి'
- మరోసారి నిరోద్యోగులకు టోకరా
- కొత్త జిల్లాల సమగ్రాభివృద్ధి ఊసేలేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14 :** రాష్ట్ర బడ్జెట్టు (2026 -2027) మాటల్లో గొప్ప.. చేతల్లో శూన్యంగా కనబడుతోందని, అంతే కాకుండా చంద్రబాబు మాటల గారడీగా ఉందని..ఇది తిరోగమన బడ్జెట్ అని, సామాన్య ప్రజలకు ఈ బడ్జెట్ బహు దూరంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్టు పై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేదని, కనీసం నిరుద్యోగుల ఊసే ఎత్తలేదని ఆయన పేర్కొన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత చాలా జిల్లాల్లో జిల్లా కలెక్టరేట్లు అద్దె భవనాల్లో ఉంటున్నాయని, జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లా కలెక్టర్ల నిర్మాణానికి బడ్జెట్లో ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తయిందని ఇప్పటి దాకా చెప్పిన సందర్భంగా.. ఇప్పుడు 60 శాతం మాత్రమే పూర్తయిందని చెప్పడం ఆయన పచ్చి అబద్ధాల మాటలకు నిదర్శనం అన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల గురించి ప్రస్తావనే లేదని మధు ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్టు రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర నిరాశ కలిగిందని మధు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మూడవ బడ్జెట్‌లో కూడా సాగు రంగానికి వెన్నెముకగా ఉన్న రైతులను విస్మరించడం దుర్మార్గమని మధు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కౌలు రైతులను కూటమి సర్కార్ దగా చేసిందని మండిపడ్డారు. బడ్జెట్లో రైతుల సంక్షేమం గురించి ఎటువంటి రక్షణ చర్యలూ తీసుకోకపోవడం ఆక్షేపణీయమన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద 46.86 లక్షల మంది రైతులకు రూ. 6,650 కోట్లు ప్రతిపాదించిన ప్రభుత్వం, అందులో భూమిలేని కౌలురైతులకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం వారి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. రాష్ట్రంలో సాగవుతున్న భూమిలో 80 శాతం పంటలు పండిస్తున్నది కౌలురైతులే. 35 లక్షల మంది కౌలురైతుల్లో సుమారు 10 లక్షల మందికి పైగా భూమిలేని నిరుపేదలు ఉన్నారని, వారికి పెట్టుబడి సాయం అందించకపోవడం అన్యాయమని మధు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బడ్జెట్లో గ్రామీణ అభివృద్ధికి 23 వేల కోట్లు కేటాయించడం పట్ల హర్షం

- బడ్జెట్లో గ్రామీణ అభివృద్ధికి 23 వేల కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గిడ్డి




**అమలాపురం(మనసులో మాట) ఫిబ్రవరి 14 :** గ్రామీణ అభివృద్ధి కోసం ఏపీ అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో గ్రామీణ అభివృద్ధి కోసం 22 వేల 942 కోట్ల రూపాయలు కేటాయించిన పట్ల మంత్రి దుర్గేష్ పీ గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు హర్షం వ్యక్తం చేసారు. అసెంబ్లీలో బడ్జెట్ సమావేశం ముగిసిన తర్వాత మీడియా క్యాంప్ వద్ద వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ శాఖ మాత్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా 80 శాతం రోడ్లు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గిరిజన ప్రాంతాలు ఆదివాసి తెగలు వద్దకు పవన్ కళ్యాణ్ స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే వారికి త్రాగనీరు రోడ్లు రహదారులు సదు-పాయం కల్పించారని ఏ ప్రభుత్వం చేయని సాహసం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేయడం పట్ల రాష్ట్ర ప్రజలు ఆయనను అభినందనలతో ముంచెత్తిన విషయం అందరికీ తెలిసిందే. అలాగే ప్రస్తుతం బడ్జెట్లో 22,942 కోట్ల రూపాయల కేటాయించిన పట్ల పూర్తిస్థాయిలో గ్రామాలు అభివృద్ధి జరుగుతుందన్నారు. పీ గన్నవరం నియోజకవర్గంలో 80 శాతం అభివృద్ధి జరిగిందని ఈ బడ్జెట్ కేటాయింపులపై తో మిగిలిన పనులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారా చేయడానికి మాకు అవకాశం రావడం మాఅదృష్టమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు.

# నవ్వుల రేడు..రాజబాబు 43వ వర్థంతి-రాజమహేంద్రవరంలో ఘన నివాళులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14:** ప్రఖ్యాత హాస్య నటుడు, నవ్వుల రేడు రాజబాబు 43వ వర్థంతిని పురస్కరించుకుని శనివారం రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న ఆయన విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, మిత్ర బృందం మునిసి వెంకటేశ్వరరావు (బాబులు), కే లక్ష్మీనారాయణ (బాబి), గోబేరు గణేష్, పట్నాయక్, కట్టా చంద్రరావు, కణితి సుందరం, మల్లు శ్రీనివాసరావు తదితరులు రాజబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. 1936వ సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో పుణ్యమూర్తుల ఉమామహేశ్వర రావు, వెంకట రవణమ్మ దంపతులకు రాజబాబు జన్మించారు. రాజబాబు పూర్తి పేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. ఆయన చదువుకునే సమయంలో బుర్రకథ నేర్చుకుంటూ ఇంటర్మీడియేట్ పూర్తయిన తరువాత ఉపాధ్యాయ శిక్షణ కోర్సు పూర్తిచేసి కొద్ది కాలం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ నాటకాల్లో పాలు పంచుకునేవారు. ఒకసారి నాటకంలో రాజబాబును చూసిన గరికిపాటి రాజారావు సినిమాల్లో చేరమని ఉత్సాహపరిచారు. దాంతో చెప్పా పెట్టకుండా 1960లో మద్రాసు చేరుకున్నారు. అప్పుడు పూట గడపడం కష్టంగా ఉన్న సమయంలో అడ్డాల నారాయణరావు పిల్లలకు ట్యూషన్లు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్న సమయలో హాస్య నటుడు రేలంగి సమాజం చిత్రంలో అవకాశం వచ్చింది. ఆ తరువాత చిత్రాల్లో నటిస్తూనే నాటకాలు కూడా వేసేవారు. జగపతి ఫిలింస్ వీబీ రాజేంద్ర ప్రసాద్ 'అంతస్తులు' చిత్రంలో నటించినందుకు మొట్ట మొదటి సారిగా 1300 రూపాయల పెద్ద మొత్తం పారితోషికంగా పొందారు. ఆ తరువాత వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా వరుసగా ప్రముఖ నిర్మాణ సంస్థలు నిర్మించిన పెద్ద చిత్రాల్లో నటించి హీరోలతో సమానంగా పారితోషికం అడిగే స్థాయికి వెళ్ళారు. తన చిత్రాల్లో నటనతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించే రాజబాబు నిజ జీవితంలో గొప్ప తాత్విక ఆలోచన గలవారు. తన పుట్టిన రోజు సందర్భంగా పాతతరం నటులను, నటీమణులను సత్కరించేవారు. రాజబాబు ఏడుసార్లు ఫిలింఫేర్ అవార్డులు పొందిన మొట్ట మొదటి హాస్య నటుడు. ఆయన జీవితంలో మొత్తం తొమ్మిది ఫిలింఫేర్ అవార్డులు, మూడు నంది బహుమతులు అందుకున్నారు. రాజబాబు ఎంతో మంది విద్యార్థులను డిగ్రీ చదివించి విద్యావంతులుగా తయారు చేశారు. చాలా మంది పేద కుటుంబాలకు వివాహాలు చేశారు. రాజమండ్రిలో పారిశుద్ధ్య కార్మికులకు స్కావెంజర్స్ కాలనీ, కోరుకొండలో జూనియర్ కాలజీ కట్టించారు. రాజబాబు చిన్న వయ-సులో అంటే 47 సంవత్సరాలకే తెలుగు సినీ అభిమానులను శోక సంద్రంలో ముంచి స్వర్గస్తులయ్యారని ఆయన సోదరుడు బాబి చెప్పారు. ఈ రోజు తమ్ముడు బాబీ ఆధ్వర్యంలో ఆయన మిత్ర బృందం బాబులు, అభిమానులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం వాహన చోదకులకు పండ్లు పంపిణీ చేశారు.

# మహాశివరాత్రి సందడి: కాజులూరు మండలంలో ఏర్పాట్లు పూర్తి



**కాజులూరు మనసులో మాట ఫిబ్రవరి 14 :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తుల రాకకు సిద్ధమయ్యాయి. శైవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ఈ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మండలంలోని కోలంక, పల్లిపాలెం, కుయ్యేరు, దుగ్గుదుర్రు, కాజులూరు, శీల, గొల్లపాలెం, జగన్నాథగిరి, పెనుమళ్ళ, అంద్రంగి తదితర గ్రామాల ఆలయాల్లో శుభ్రతా కార్యక్రమాలు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులు సౌకర్యంగా స్వామివారి దర్శనం చేసుకునేలా క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. శివరాత్రి రోజు రాత్రి జాగరణ, లింగాభిషేకాలు, రుద్రాభిషేకాలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా పోలీసు సిబ్బంది సహకారంతో తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ-స్థులు, యువకులు, మహిళా సంఘాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండటం విశేషం. ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, శివనామ స్మరణతో మండలం మొత్తం భక్తిరసంలో మునిగిపోయింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, రాత్రంతా జాగరణ చేసి, "ఓం నమః శివాయ" నామస్మరణతో పరమేశ్వరుని కృపాకటాక్షాలు పొందాలని కోరుకుంటున్నారు.

# పంచరామ క్షేత్రంలో భారీ భద్రత; జిల్లా ఎస్పి బిందు మాధవ



**సామర్లకోట (మనసులో మాట) ఫిబ్రవరి 14;** సామర్లకోట పంచారామ క్షేత్రం భీమేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భారీ భద్రత ఏర్పాటు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పంచరామ క్షేత్రాన్ని భీమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను గూర్చి ఈవో బల్ల నీలకంఠం, నావ్రెండెంట్ ఈశ్వరరావు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కు వివరించారు. స్వామి దర్శనాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, విఐపి ల పేరుతో హడావుడి చేయరాదని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. ఆలయ ప్రాంగణం, ఆలయంలోపల తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎస్పీ బిందు మాధవ్ సూచనలు సలహాలు అందించారు. కోనేటితో సహా అన్ని ప్రాంతాల్లోనూ పూర్తి భద్రత ఏర్పాట్లు, తనిఖీలు నిర్వహిస్తూ, సాంకేతిక పద్ధతుల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులను ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. సామర్లకోట పట్టణం, ఏడిబి రహదారిలో ట్రాఫిక్ ఏర్పాట్లు, ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను గూర్చి పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ జిల్లా ఎస్పీకి వివరించారు. క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అంకబాబు, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, పోలీసులు పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు చేస్తున్న అన్నదాన శిబిరాన్ని కూడా ఎస్పీ పరిశీలించి, ఆ ప్రాంతంలో భద్రత ఏర్పాట్లు చేపట్టాలని పోలీసులను, దేవాదాయ అధికారులను ఎస్పీ ఆదేశించారు.


# మహా కాళేశ్వర అష్టోత్తర శత నామావళి ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14 :** మరో ఉజ్జయినిగా పేరుగాంచిన స్థానిక ఇన్నీసుపేటలోని శ్రీ మహా కాళేశ్వర ఆలయంలో శనివారం ఉదయం మహా కాళేశ్వర అష్టోత్తర శత నామావళి పుస్తకాన్ని రొటేరియన్ పట్టపగలు వెంకటరావు ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) సంస్థ పక్షాన మోహన్ పబ్లికేషన్స్ ప్రచురించడం అభినందనీయమన్నారు. మోహన్ పబ్లికేషన్స్ ఆకుల రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పూజా మందిరంలో ఉంచుకుని ప్రతి రోజూ చదువుకోవడానికి వీలుగా మహా కాళేశ్వర అష్టోత్తర శత నామావళి, శివాష్టకం, బిల్వాష్టకం, గాయత్రీ మంత్రం, నూజిళ్ల శ్రీనివాస్ రాసిన పాట, గండ్లూరి నారాయణరావు సంక్రాంతి పాట ఇందులో పొందుపరిచినట్లు వివరించారు. రాకా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ పాకెట్ సైజులో సర్వాంగ సుందరంగా ఈ పుస్తకాన్ని రూపొందించి అందించినట్లు తెలిపారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఎం జితేంద్ర, మున్సిపల్ ఈఈ మదర్సా అలీ, సూరపురెడ్డి తాతారావు, గౌరీ శంకర్, యేరుకొండ వెంకటేష్, నూజిళ్ల శ్రీనివాస్, భమిడిపాటి రామకృష్ణమూర్తి, మారిశెట్టి రాజారావు, బొబ్బిలి శ్రీనివాసరావు, పీ నవీన్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# గద్దె మారుతికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం

## జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా....



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** జగంపేట మండలం మల్లిపాక గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సూపర్వైజర్ గద్దె మారుతి తలలో బ్లడ్ గడ్డకట్టడంతో గత నెల రోజులుగా కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి పరామర్శించి ఆరోగ్య విషయాలు యోగక్షేమాలు తెలుసుకుని జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ నుండి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చెక్కును ఆయన కు అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల మణి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఫౌండేషన్ సంబంధించిన అన్ని పనులు చూసుకుంటూ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కు ఎన్నో సేవలందించిన గద్దె మారుతి నెల రోజుల నుండి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని అన్నారు.

# పుల్వామా ఉగ్ర దాడిలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళి



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** బ్లాక్ డే సందర్భంగా ఈరోజు జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో పుల్వామా లో జరిగిన ఉగ్రవాదుల బాంబు దాడిలో అమ-రులైన 40 మంది వీర జవాన్లకు నివాళులు అర్పించి స్థానిక జే.వి.యర్ కాంప్లెక్స్ వద్ద విద్యార్థులు జవాన్లు వేషధారణలు, జాతీయ జెండాలతో ర్యాలీ, మానవహారం నిర్వహించడం జరిగింది. దేశ రక్షణలో ప్రాణాలు అర్పిస్తున్న జవాన్లు కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని,విద్యార్థులకు దేశ భక్తి భావాన్ని పెంపొందించాలని చైర్మన్ నాగబాబు కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత,కాలేజ్ ప్రిన్సిపాల్ కె అభి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ తోట నాగలక్ష్మి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, బాలిన అరుణ దేవి, శ్రావణి,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# భక్తులతో పోటెత్తిన వాడపల్లి ఆలయం



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 14:** ఏడువారాల వెంకన్నగా పేరుపొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం రెండవ శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువ జాము నుండి బారులు తీరిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పాదయాత్రగా, వివిధ ప్రైవేటువాహనాలు, ఆర్టీసీ బస్సులలో, వివిధ జిల్లాల నుండే కాక రాష్ట్రాల నుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, పాలకమండలి సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రదక్షిణలు చేసి అనంతరం స్వామివారి దర్శించుకున్నారు. ఆలయ ఉచిత వాహనాలలో వృద్ధులు చిన్నారులను తరలించారు. క్యూలైన్లో ఉన్న భక్తులకు త్రాగునీరు ఏర్పాటు చేసి,పిల్లలకు పాలు పంపిణీ చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## ఆకట్టుకుంటున్న శివపార్వతుల సైకత శిల్పం




**రంగంపేట (మనసులో మాట), ఫిబ్రవరి 14:** నేడు (ఆదివారం) మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముందు రోజు అంటే శనివారం రంగంపేటలో ఆదిదంపతులు కొలువు దీరారు. 'ఆది దంపతుల అన్యోన్యం ఆదర్శనీయం, సేవ్ అవర్ కల్చర్'..అనే నినాదాలతో శివపార్వతుల సైకత శిల్పాన్ని రంగంపేటకు చెందిన దేవిన శ్రీనివాస్ అత్యద్భుతంగా రూపొందించారు. ఈ సైకత శిల్పాన్ని 3 యూనిట్ల ఇసుకతో 18 గంటల పాటు అతి మనోహరంగా.. చూపరులను కట్టిపడేసేటట్టు రూపొందించారు. 15 అడుగుల వెడల్పుతో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ చెక్కిన ఈ శిల్పం.. సాక్షాత్తూ ఆ ఆది దంపతులే భక్తుల కోసం కైకాసం నుంచి దిగివచ్చారా అన్నట్టు ఉంది. కైలాసగిరి, నాగేంద్రుడు, చంద్రుడు, శివ పార్వతుల ఆభరణాలు..ఇలా ప్రతీ విషయంలో ఎంతో శ్రద్ధగా చెక్కి సైకత శిల్పాల శిల్పిగా తనకున్న ప్రతిభను దేవిన శ్రీనివాస్ ప్రదర్శించారు. సైకత శిల్పి శ్రీనివాస్ కుమార్తెలు కూడా సైకత శిల్పాలు రూపొందించడంలో మంచి పేరు సంపాదించారు. ప్రత్యేక పర్వదినాలు, జాతీయ పండుగులు, మహాత్ముల జయంతి, వర్ధంతి రోజుల్లోనూ, అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే అనేక ప్రత్యేక కార్యక్రమాల సమయాలలో దేవిన శ్రీనివాస్, ఆయన కుమార్తెలు 'దేవిన సిస్టర్స్' సమాజ చైతన్యంలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రముఖులు, ప్రజల అభినందనలు అందుకుంటున్నారు.

## రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో సత్తా చాటిన జగ్గంపేట భవిష్య స్కూల్ విద్యార్థులు




**జగ్గంపేట,(మనసులో మాట) ఫిబ్రవరి 14 :**విజయవాడలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో జగ్గంపేటలోని భవిష్య స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, పాఠశాల కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో భవిష్య స్కూల్ విద్యార్థులు మొత్తం మూడు బహుమతులను కైవసం చేసుకున్నారు.పలు విభాగాల్లో తమ మేధస్సుకు పదును పెట్టి విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎ. గౌతమ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 3వ బహుమతి సాధించి సత్తా చాటారు.ఓ.ధర్మ తేజ అశ్విన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 'బెస్ట్ పెర్ఫార్మర్'అవార్డును అందుకున్నారు.బి. తేజస్విని తన నైపుణ్యంతో 'బెస్ట్ పెర్ఫార్మర్'అవార్డును సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శేషు కుమార్ మరియు లక్ష్మి ప్రసన్న విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ.. "చిన్నారుల మేధో వికాసానికి, ఏకాగ్రతను పెంపొందించడానికి అబాకస్ ఎంతో దోహదపడుతుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో మా విద్యార్థులు రాణించడం గర్వకారణం," అని కొనియాడారు.విద్యార్థుల విజయానికి కృషి చేసిన అబాకస్ ఫ్యాకల్టీ సభ్యులు ఎస్. రాజు, ఎం. నాగలక్ష్మి లను ఈ సందర్భంగా వారు అభినందించారు. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థులకు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



**అయినవిల్లి( మనసులో మాట) ఫిబ్రవరి 14 :** మహాశివరాత్రి మహోత్స వాన్ని పురస్కరించుకుని అయినవిల్లి మండలం క్షణ ముక్తేశ్వరవస్వామి వారి ఆలయం వద్ద భక్తులు స్వామి వారిని దర్శచుకోడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పక్కనే ఉన్న తొగరపాయ రేవు వద్ద భక్తులు స్నానమాచరించడానికి రేవు వద్ద పూర్తి స్థాయిలో నీటిని నింపారు. మహిళలు స్నానమాచరించడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఆదివారం వేకువ జాము నుండి దూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ముక్తేశ్వరం చేరుకొని పుణ్య స్థానాల ఆచరించి అనంతరం స్వామివారిని దర్శించుకొడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. తొగరపాయ రేవు వద్ద భక్తులు స్నానమా చరించడానికి రెండు రోజులనుండి తొత్తర మూడి గ్రామ సర్పంచ్ వార జయ సావిత్రి సెక్రటరీ అన్వార్ ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే వివిధ సత్రాల్లో భక్తులకు ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాలను వచ్చే భక్తులు స్వామివారి దర్శనం అనంతరం ఈ సత్రాల్లో భోజనాలు చేసి వెళ్లే ఆనవాయితీ గత నలభైఏళ్ళుగా వస్తుంది.

## ముగ్గురు దొంగలు అరెస్టు



**కాజులూరు మనసులో మాట ఫిబ్రవరి 14:** పలు దొంగతన కేసుల్లో ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి ఎస్ కృష్ణ చైతన్య తెలిపారు. శనివారం మండలంలోని గొల్లపాలెం పోలీస్ స్టేషన్ వద్ద కాకినాడ రూరల్ సిఐ డి ఎస్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇటీవల చైన్ స్నాచింగ్ , మోటార్ సైకిల్ దొంగతనాలు అధికంగా జరుగుతుండడంతో జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ డి.ఎస్.పి జూ మనీష్ పాటిల్ ఆదేశాలు మేరకు కరప ఎస్సై సునీత గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ ఆధ్వర్యంలో రెండు టీములు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు గొల్లపాలెం శివారు శలపాక రైస్ మిల్లు వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.కాకినాడకు చెందిన ముగ్గురు పలు చోరీ కేసుల్లో నిందితులైన పిల్లి సింహాచలం , ద్రాక్షారాపు ఉమా శంకర్, దార నాని లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు వీరు ఇంటికి సంబంధించి రెండు దొంగతనాలు, ఒక కారు చోరీ కేసు , ఏడు మోటర్ సైకిల్ లు ఒక చైన్ స్నాచింగ్ కేసులో నిందితులన్నారు. వీరి వద్ద నుండి హుందాయి వెన్యూ కారు , ఒకటి డెల్ లాప్టాప్ ఒకటి , ఏడు మోటర్ సైకిల్ లు, 186 గ్రాముల వెండి వస్తువులు మూడు మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. వీరిపై గొల్లపాలెం పోలీస్ స్టేషన్ లో ఐదు కేసులు కరప పోలీస్ స్టేషన్ లో నాలుగు కేసులు తిమ్మాపురం పోలీస్ స్టేషన్ లో ఒక కేసు నమోదు అయిందన్నారు. నిందితులను కాకినాడ మూడవ ఏపీ ఏ జే ఎఫ్ సీ ఎం కోర్టు లో హాజరుపరచడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కాకినాడ రూరల్ సిఐ కృష్ణచైతన్యను గొల్లపాలెం, కరప ఎస్సైలు మోహన్ కుమార్ ,సునీత ,సిబ్బందిని కాకినాడ డి.ఎస్.పి మనీష్ పాటిల్ అభినందించారు.

## దామోదరం సంజీవయ్య కు ఘన నివాళి

### కలెక్టరేట్ లో 105 వ జయంతి వేడుక

- మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి ఆశయాల భవిష్యత్తు తరాలకు అందించగలం..
- ఇంచార్జి డీఆర్వో ఎస్ భాస్కర్ రెడ్డి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14:** మహనీయుల త్యాగాలు, సేవలను భావితరాలకు చేరవేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా రాష్ట్ర వేడుకలుగా నిర్వహిస్తోందని ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ భాస్కర్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుక సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బొమ్మూరు గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాసేవ వంటి విలువలను సమాజంలో నెలకొల్పిన మహనీయుల జీవితం యువతకు దిశానిర్దేశం చేయాలనే ఉద్దేశ్యం అన్నారు . భారత రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహానుభావుడు దామోదరం సంజీవయ్యని స్మరించుకోవడం గర్వకారణమన్నారు. 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లాలో సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన తన ప్రతిభా, పట్టుదలతో ఉన్నత స్థానాలను అధిరోహించారని తెలిపారు. 1960లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడని కొనియాడారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యా అవకాశాల విస్తరణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన దూరదృష్టి నాయకుడన్నారు.పారదర్శక పరిపాలన, ప్రజల సమస్యల పట్ల సానుభూతి, సాధారణ జీవనం--ఉన్నత ఆలోచనలు ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకలని తెలిపారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా సేవలందించి ప్రజాహితాన్ని కాంక్షించిన ఆదర్శనీయ రాజకీయ నాయకుడని అన్నారు. విశాఖపట్నంలోని లా కాలేజీకి, హైదరాబాద్‌లోని సంజీ వయ్య పార్కుకు ఆయన పేరు పెట్టినప్పటికీ, ఆయన జీవిత విశేషాలు చాలా మందికి తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలను ఆచరిస్తూ సమాజ అభ్యున్నతికి కట్టుబడి పనిచేయడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎండీ ఘయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, ఏఎస్‌వో ఎస్ సత్యనారాయణ, స్థానిక నాయకులు జార్జి అందోని, ఠాగూర్, గిరిజన సంక్షేమ వసతి గృహ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాట్రావులపల్లి లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

- నిర్వహించిన జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్
- జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 14 :**జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామం లో గ్రామ టీడీపీ అధ్యక్షుడు మునిరెడ్డి నాగేశ్వరావు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న పలు సిమెంట్ రోడ్లు ప్రారంభోత్సవం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంజూరు చేసిన రెండు కోట్లు రూపాయలునిధులుతో జ్యోతుల నవీన్ కుమార్ గ్రామంలో సిసి రోడ్లుకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా జగనన్న కోలని లో అమ్మవారి గుడికి 180000/- వ్యయశీతో స్టీల్ కటకటాలు ఏర్పాటు చేయడం జరిగింది. వెన్నలక్ష్మి కి మూత్రపిండాలు మార్పిడి చేయడం జరిగింది. ఆమెకు సుమారు నెలకి 30 వేల రూపాయలు మందులు అవసరం అవడంతో ఆ విషయాన్ని జ్యోతుల నవీన్ గ్రహించి ఒక రెండు నెలల సరిపడా మందులు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా జెనిటిక్ ప్రాబ్లం వల్ల కుండల వీరబాబు కుమార్తెకు రెండు సంవత్సరాలు పాపకు డైలీ 900 రూపాయలు టాబ్లెట్ వాడవలసి వస్తుంది. ఆ పాపకు కూడా ఒక 15 రోజులకు సరిపడా మందు లు ఇవ్వడం జరిగిం ది. అదేవిధంగా అక్కిరెడ్డి శివ తనయుడు వయసు 8 సంవత్సరాలు మూడో తరగతి చదువుతున్నాడు ఆ అబ్బాయికి రెండు చెవులు కూడా వినిపించవు సర్జరీ చేయడానికి వయస్సు సరిపోవని పరిస్థితి బాబు స్కూల్ కి వెళ్తున్నాడు కానీ అబ్బాయి కి వినపడని లోపం వల్ల ఆ అబ్బాయికి 60 వేల రూపాయలు పెట్టి ట్రస్ట్ ద్వారా వినికిడి యంత్రాలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలోఏఎంసీ చైర్మన్ అడపా భరత్ కుమార్,ఎస్వీఎస్ అప్పలరాజు జీను మణి బాబు, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, కోర్పు సాయి తేజ, బుర్రి సత్తిబాబు, దాసరి తమ్మన్న దొర, పాలూరి బోసు బాబు, అనుకూల శ్రీకాంత్, నీలం శ్రీను, చదరశీ చంటి బాబు, సుంకర సీతారామయ్య,కంటే రామారావు పోలినాటి ధర్మానంద కుమారి శాస్త్రి, రాయుడు శీను,రాయుడు శివ పప్పు గణేష్, ద మరుసింగ్ మధు, గుండుపల్లి సుజాత , సూరిమిల్లి సత్తిబాబు, కాకరపల్లి కామేశ్వరరావు, బిక్కిన బాబి, లంక సత్తి రాజు, మింగి చంద్ర రావు,చావ్వాకుల రాంబాబు, పోతుల త్రిమూర్తులు, పంపన లోవరాజు, మొగలవల్లి, రాయపాటి బాబురావు, కంటే వీర వెంకట రావు, గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు జనసేన కార్యకర్తలు పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహోన్నత వ్యక్తి దామోదర సంజీవయ్య



**అమలాపురం( మనసులోమాట) ఫిబ్రవరి 14:** భారత ప్రజాస్వామ్య చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహోన్నత వ్యక్తి దామోదరం సంజీవ య్య ఆని ఆర్డిఓ కే మాధవి పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య 105వ జన్మదిన వేడుకలను అధికారికంగా నిర్వహిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల లు అలంకరించి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ సామా జిక అణిచివేతకు గురైన తరగతుల నుండి వచ్చిన వ్యక్తులు అనేక కష్టాలను అధిగమించి ఉన్నత వ్యక్తిత్వంతో సమాజమే గౌరవించే స్థితికి ఎదిగిన వారిలో దామోదరం సంజీవయ్య ముందు వరుసలో ఉన్నారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమం త్రిగా, కేంద్రమంత్రిగా, ఏఐసీసీ జాతీయ ఉపాధ్య క్షులుగా, సేవా స్తంబ్ వ్యవస్థాపకులుగా అనేక రకాల సేవలను సమాజానికి అందించారన్నారు. అయితే ప్రస్తుత సమాజం లో వారి జయంతులు నిర్వహించడం అంటే దండవేయడం, దండం పెట్టడం, సూక్తులు వల్లించ డంతో సరిపోతోందని, ఏ నీతివంతమైన, అసమాన తలు లేని, సమస్యలు లేని సమాజాన్ని వారు కోరుకున్నారో ఆ వైపుగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంజీవయ్య స్ఫూర్తితో సమర్థ వంతంగా పని చేసేలాఅడుగులు వేయాలన్నారు. దేశవ్యాప్తంగా కీర్తించబడుతున్న సంజీవయ్య పుట్టిన గ్రామం నేటికీ స మస్యలకు నిలయంగానే ఉ ందని.సంజీవయ్య విద్యార్థిగా ఉన్న రోజుల్లో రాజకీయాలపై, స్వాతం త్ర్యోద్యమంపై ఏ మాత్రం ఆసక్తి చూపలేదన్నారు. కానీ లా అప్రెంటీస్ చేస్తున్న సమయంలో వివిధ రాజకీయ నాయకుల పరిచయం, సాంగత్యం వలన రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆసక్తి ఆయనకు కలిగిందన్నారు. సంజీవయ్య మంచి వక్త. తెలుగులో ఇంగ్లీషులో ధారాళంగా, మనోరంజకంగా మాట్లాడే వారన్నారు. సంజీవయ్య సామాన్య కుటుంబంలో జన్మించి, అచంచల సంకల్పంతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆదర్శ నాయకుడన్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలం దిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం, పేదల సంక్షే మం వంటి విలువలను పరిరక్షించారన్నారు ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.ఆయన జీవితం మనకు ఒక స్ఫూర్తి. కృషి, నిబద్ధత, నైతికత ఉంటే ఎవరైనా ఉన్నత స్థానాలకు చేరు కోవచ్చని ఆయన నిరూపించారన్నారు.ప్రజాసేవ ను పరమావధిగా భావించిన ఆయన సిద్ధాంతాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు మనందరం ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజం లో సమానత్వం మరియు సౌభ్రాతృత్వం పెంపొంది చేందుకు కృషి చేయాల న్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకతతో కూడిన పరిపాలన అందించడానికి మనమందరం సంకల్పిం చాలన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ తాసిల్దార్ వెంకటలక్ష్మి, క్యాంపు క్లర్కు దుర్గాప్రసాద్ టెక్నికల్ సూ పర్వైజర్ రమేష్ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ దోపిడీ అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు




**తణుకు మనసులో మాట ఫిబ్రవరి 14 :**మెడికల్ అండ్ ఫార్మా మాఫియా అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాపిత పిలుపు మేరకు శనివారం తణుకు నరేంద్ర సెంటర్ లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి భీమారావు మాట్లాడుతూ కార్పోరేట్,ప్రైవేట్ హాస్పిటల్స్ లో దోపిడీ తీవ్రంగా వుందన్నారు.ఈ హాస్పటల్స్ పై దాడులు నిర్వహించి అధిక బిల్లుల వసూలు నియంత్రించాలన్నారు. ఫార్మా కంపెనీలు ధనార్జనే లక్ష్యంగా నకిలీ, చవక బారు మందులు తయారీతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిరంతర తనిఖీలు నిర్వహించి మెడికల్, ఫార్మా మాఫియాపై ఉక్కుపాదం మోపాలని భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షణలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్యం, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు.నకిలీ మందులు తయారు చేస్తున్న ఫార్మా కంపెనీల బాధ్యులపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలన్నారు. సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ నాసిరకం మందులు, జనరిక్ అధిక ధరల ఫార్మా మాఫియా ఆగడాలు అరికట్టాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, పిపిపి విధానం రద్దు చేయాలన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు నామాన వెంకటేశ్వరరావు, బొద్దాని కృష్ణ కిషోర్, పెదపోలు వెంకట్రావు,సీపీఐ నాయకులు డివిఎన్ హనుమంతరావు, పులపర్తి సత్యనారాయణ, వీరన్న,పుట్టా అమ్మిరాజు, మందుల ముత్తయ్య,బొద్దాని మురళీ కృష్ణ,కొంబత్తుల రవికుమార్,అట్రు వెంకట్రావు నమ్మి రాజు, గూడెల్లి వెంకటేశ్వరరావు, పతివాడ రాంబాబు తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# శ్రీ తారకపురి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



**తణుకు మనసులో మాట ఫిబ్రవరి 14 :** శ్రీ తారకపురి లైన్స్ క్లబ్ సభ్యులు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం మరియు తిరుపతి కాణిపాకం వంటి యాత్ర సందర్శనాలు అదేవిధంగా పలు సేవ కార్యక్రమాలు చేయడం జరిగింది. ప్రెసిడెంట్ వావిలాలపవన్ కుమార్ ఆధ్వర్యంలో ఎంతో ఆహ్లాదకరంగా జరిగిన ఈ యాత్ర లో తిరుపతిలో కూడా శ్రీ పద్మావతి అన్న సత్రం నందు అన్నదానము, వస్త్రధానము,పళ్ళు పంపిణీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్. వి. పాపారావు నాయుడు, అన్నపూర్ణా దేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సభ్యులం దరూ ఆహ్లాదకరంగా యాత్రలో పాల్గొని అటు భగవంతుని ఆశీర్వాదం పొందుతూ ఇటు చక్కని సేవ కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. దంపతులు సారథ్యం వహించిన వావిలాల వెంకట రమేష్ సరళా దేవి దంపతులను, శ్రీ తారకాపురి లైన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా గేట్ మెంబర్ అయిన వావిలాల సరళా దేవి మాట్లాడుతూ లైనిజంలో ఒక భాగం అయిన మెంటల్ హెల్త్ బీవింగ్ కార్యక్రమం గా తిరుపతి యాత్ర, యాత్రికులకు ఆహారం పంపిణీ, కళ్యాణ మండపంలో వర్క్ చేసే 50 మంది వర్కర్స్ కి వస్త్రాలు పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలు చేయడానికి కారణం భగవంతుని ఆశీర్వాదం లైన్స్ క్లబ్ సభ్యుల సహాయ సహకారం అని అన్నారు. ఈ తరహా కార్యక్రమాల వల్ల మనుషుల మధ్య చక్కని అనుబంధాలు ఏర్పడతాయి అటు భక్తి ముక్తి ప్రశాంతత అని తెలిపారు. దాదాపు 40 మంది సభ్యులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రాంకుమార్, డిస్ట్రిక్ట్ ఫాస్ట్ సెక్రెటరీ శ్రీహరి,శ్రీ తారకాపురి క్లబ్ డైరెక్టర్స్ వావిలాల వెంకట రమేష్,ఆకురాతి శ్రీనివాస్,బెజవాడ సూరి,వింజమూరు సుబ్రహ్మణ్యం,వైస్ ప్రెసిడెంట్ కే. శ్యామల,లైన్స్ సభ్యులు పాలరాజు,రమేష్ గుప్తా,సంజయ్, గిద్ద ధనరాజు,డాక్టర్ బాలసుబ్రమణ్యం,వానపల్లి సుబ్రహ్మణ్యం,వి. నాగలక్ష్మి, జి. విజయలక్ష్మి,బి. సత్యశ్రీ,ఏ. అన్నపూర్ణ, వి ప్రసన్న,ఎన్ అనూష,పి హేమ,వి గంగా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు జి. ఓబుళపతి తీర్థం శేషయ్య వి. సుబ్బయ్య వంటి పెద్దలు గవర్నర్ పాపారానాయుడు దంపతులను వావిలాల వెంకట రమేష్ సరళా దేవి దంపతులను పూలమాలతో మెమొంటోలతో సత్కరించారు.

# నిబంధనల ఉల్లంఘనపై రెండు ఇసుక లారీలు సీజ్

- సీతానగరం ములకల్లంకలో అర్ధ రాత్రి ఆకస్మిక తనిఖీలు
- శాండ్ సప్లై పాయింట్ ఐడీ బ్లాక్
- జిల్లా మైన్స్ అధికారి డీ ఫణి భూషణ్ రెడ్డి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14 :** తూర్పు గోదావరి జిల్లాలో ఇసుక త్రవ్వకాలు, రవాణాపై నిబంధనల అమలు పర్యవేక్షణలో భాగంగా గనులు - భూగర్భ శాఖ అధికారులు అర్ధ రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా మైన్స్ అండ్ జియాలజి అధికారి డీ ఫణి భూషణ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 13వ తేదీ శనివారం అర్ధ రాత్రి సమయంలో సీతానగరం మండలం ములకల్లంక గ్రామ పరిధిలో జిల్లా గనులు- భూగర్భ శాఖ అధికారి డీ ఫణి భూషణ్ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టామన్నారు. తనిఖీ సందర్భంగా గారపాటి వీరబ్రహ్మం తదితరులకు చెందిన 4.71 హెక్టార్ల పట్టా భూమ-ల్లో అనుమతులున్న రీచ్‌లో ఇసుక తరలిస్తున్న రెండు వాహనాలను గుర్తిం చామన్నారు. పర్యావరణ అనుమతులు, ఎన్.జి.టి. ఆదేశాల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక త్రవ్వకాలు జరపాల్సి ఉండగా, రాత్రి 10 గంటల సమయంలో ఇసుకను లారీలలో లోడ్ చేసి డిస్పాచ్ పర్మిట్ జారీ చేసినట్లు తనిఖీ లో వెల్లడైందన్నారు. ఈ నేపథ్యంలో (ఏపీ 39 డబ్ల్యూఎల్ 9159, ఏపీ 39 డబ్ల్యూఎల్ 9159) రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. అధిక లోడుతో రవాణా చేసినందుకు సంబంధిత వాహన యజమానులపై చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికారికి సిఫార్సు చేసినట్లు



తెలియజేశారు. అదే విధంగా సంబంధిత పట్టా భూముల రీచ్‌కు కేటాయించిన శాండ్ సప్లై పాయింట్ ఐడీని బ్లాక్ చేశారు. పట్టా భూముల యజమానులకు నోటీసులు జారీ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సర్వేయర్ పట్నాల శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్తలకు బీమా భరోసా

**బొమ్మూరు గ్రామ నాయకుల సమావేశంలో చెల్లుబోయిన**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14 :** వైసీపీ పటిష్టత కోసం అహరహం శ్రమించే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం బొమ్మూరు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం రాష్ట్ర కార్యదర్శి గొందేశి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ హాజరై మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాద బీమ కింద ఏ కార్యకర్తకైనా నష్టం జరిగితే వారి కుటుంబాశీ రోడ్డున పడకుండా పార్టీ తరపున రూ.5 లక్షలు ప్రమాద బీమా పాలసీని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా పార్టీ ఉంటుందని భరోసా కల్పించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు ప్రతి కార్యకర్తకు అండగా ఉండే విధంగా మన నాయకుడు అడుగులు వేస్తున్నారని, పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటామని హామీ ఇస్తున్నామని చెల్లుబోయిన వేణు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎనుముల త్యాగరాజు, దాకే శ్రీను, ముద్దాల అను, సద్గుణ రామా రెడ్డి, కంభం సుబ్బారెడ్డి, తోడేటీ రాజా, బిల్డర్ రాజా, మారడాపు శేఖర్, రాయుడు ప్రసాద్, పరిమళ నాని, తోడేటీ రాహుల్, వైఎస్ కుమార్, షేక్ సమీరా, పరిమళ రాజీవ్ కుమార్, సోమన శ్రీను, జిమ్మీ, యాళ్ల కృష్ణంరాజు, రమేష్ యాదవ్, చేర్లి వెంకటరావు, కోటిపల్లి రవి, గులిమి నాగేశ్వరరావు, సూరంపూడి ప్రకాష్, ఏ1 శేఖర్, జీపీఆర్ నాయుడు, కాకులపాటి కుమార్, పిట్టా కన్నా, చరణ్, మురళి, గోపి, గిరి తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో పేరుకుపోయిన కార్మికుల సమస్యలు - సిఐటియు

- కార్మికులంటే బానిసలా ?
- అన్నవరం దేవస్థానంలో 50 ఏళ్లకే కార్మికుల తొలగింపు అన్యాయం

**కాకినాడ ( మనసులో మాట) ఫిబ్రవరి14 :** దేశవ్యాప్త సమ్మె ఫిబ్రవరి 12తేది సందర్భంగా కార్మికుల సమస్యలపై సిఐటియు చేసిన సర్వేలోని అంశాలపై కచేరిపేట సిఐటియు కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలకా రమణ మాట్లాడుతూ జాతీయ సమ్మె సందర్భంగా జిల్లా అంతటా ఈ సర్వే నిర్వహించామని, అనేక దిగ్భ్రాంతి కరమైన అంశాలు మా దృష్టికొచ్చేయాన్ని తెలియజేశారు. అన్నవరం దేవస్థానంలో గత 20 ఏళ్ల నుండి పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులను నూతనంగా వచ్చిన కాంట్రాక్టర్ 50 ఏళ్లు వయసు దాటిన వారిలో ఇప్పటికే 40 మందిని తొలగించారని, మరో 30 మందిని నెల రోజుల నుండి డ్యూటీ నిలుపుదల చేసినా జిల్లా యంత్రాంగం గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడంలేదని, పైగా తమవారిని పెట్టుకోవాలని సిఫారసులు చేయడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. రాక్ సిరామిక్స్, పట్టాభి ఆగ్రో, కాకినాడ సీపోర్టు నందు స్థానికులను తొలగించి మైగ్రేషన్ వర్కర్లతో పనులు చేయించుకోవడం పెరిగిందన్నారు. వలస వచ్చిన కార్మికుల పరిస్థితులు కూడా దుర్భరంగా ఉన్నాయని, ఒకే రూమ్ లో 20 మంది కార్మికులను ఉంచి పని చేయించుకుంటున్నారని, వలస కార్మికుల చట్టప్రకారం కనీస మౌలిక సదుపాయాలు కూడా అందించడం లేదన్నారు. కాకినాడ సిపోర్టులో పనిచేసే కార్మికులకు కనీసం మంచినీటి సౌకర్యాలు, భోజన వసతికి, వాహనాల పార్కింగు లేవన్నారు. కార్మికులతో పని చేయించుకుని



వేతనాలు ఇవ్వకుండా తిప్పించుకుంటున్న విషయం బయటపడిందన్నారు. కాకినాడ మెయిన్ రోడ్ షాపింగ్ మాల్స్ లో పనిచేసే కార్మికులకు కూర్చునేందుకు లేదని, 12 గంటలు పని చేయించుకుంటూ, ఎనిమిది గంటల వేతనాన్ని కూడా చెల్లించడం లేదని తెలిపారు. జిల్లాలో అనేక పరిశ్రమలు మూసివేయడం పెరిగిందని కేరళ యాజమాన్యంలో జీడిపిక్కల పరిశ్రమలు మొత్తం మూతపడ్డాయని, సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ, చిన్నంపేట జీడిపెక్కల పరిశ్రమలు ప్రత్యామ్నయం చూపకుండా మూసివేయడంతో వేలాది మంది కార్మికులకు ఉన్న ఉపాధి పోయిందన్నారు. కాకినాడ పారిశ్రామిక వాడలో ప్యారి షుగర్స్ యాజమాన్యం మారుతున్న సందర్భంగా అందులో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొందని తెలిపారు. ఉచిత బస్సు వల్ల జిల్లా వ్యాప్తంగా ఆటోలపై ఆధారపడిన డ్రైవర్లకు ఆదాయం పడిపోయిందని, దీంతో కిస్తీలు కట్టలేక ఫైనాసర్ల వేధింపులు పెరిగాయని, తక్షణం ప్రభుత్వమే రుణాలు మంజూరు చేయడం వల్ల ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గిగ్గు వర్కర్లు జొమోటో, స్విగ్గి, బ్లాంకెట్ ఆన్లైన్లో యాపులపై పనిచేసే కార్మికుల సంఖ్య పెరిగిందని, రోజంతా కష్టపడిన 500 దాటి ఆదాయం రావడంలేదని, తక్షణమే ప్రభుత్వమే ఆన్లైన్ యాప్ ని ఏర్పాటు చేయడం ద్వారా గిగ్ వర్కర్లకు ఆదాయాన్ని పెంచాలని కోరారు. అసంఘటితరంగ భవననిర్మాణ కార్మికులకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకు పరిహారం చెల్లించాల్సిన సంక్షేమ నిధిలో 3వేల కోట్లు మూలుగుతున్నా ఒక్క కుటుంబాన్ని కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక సహకారం అందలేదని విమర్శించారు. ప్రభుత్వం, అధికారులు కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం వల్లే ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెలో కాకినాడ కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొని తమ అసంతృప్తిని తెలిపారన్నారు. ఈ సర్వేలో గుర్తించిన అంశాలపై దశాలవారి ఉద్యమాలు నిర్వహిస్తామని, ప్రభుత్వ యంత్రాంగం వీటిపై దృష్టిపెట్టి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకట రమణ పాల్గొన్నారు.

# మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవాలు



**ముమ్మిడివరం. ( మనసులో మాట) ఫిబ్రవరి 14.** ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలకు అత్యంత ప్రతిష్టాత్మ కంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు .ఫిబ్రవరి 15 నుండి 19 వతేది వరకు ఐదు రోజులు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరపనున్నారు. ఈ శివరాత్రి మహోత్సవాలు సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని అధికారులు అంచనా,అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు ,చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ విశేష పచ్చి పూల తో ఆలయాన్ని అలంకరించారు. చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు, శ్రీ వీరేశ్వర జలప్రసాదం, ఉచిత ప్రసాదం ఏర్పాటు చేశారు. మెడిల్ క్యాంప్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు,సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ దర్శన విధానం ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారికి విశేషంగా ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం,ఐదు రోజులు విశేషంగా దర్శనాలు, పంచామృతాభిషేకాలు, నిత్య అభిషేకాలు జరపనున్నారు. ప్రత్యేక ఆకర్షణగా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శూలాల సంబరం, అఖండ దీపారాదన, లింగార్చన, నిత్య కల్యాణం జరగనున్నాయి. ఐదు రోజులు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు. ఆఖరు రోజు 19 వతేది పవిత్ర వృద్ధ గౌతమి నది వద్ద పంచహారతులు, హంస వాహనం పై తెప్పోత్సవ మహోత్సవం వైభవంగా నిర్వహించుతారు. ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ, ముమ్మిడివరం సీఐ మోహన్ కుమార్, ఐ పోలవరం ఎస్సై రవీంద్రబాబు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

# అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం

**ఎమ్మెల్యే బండారు.**



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 14 :** కొత్తపేట నియోజకవర్గం లోని కొత్తపేట, ఆత్రేయపురం, రావుల పాలెం ఆలమూరు, మండలాల అభివృద్ధి పనుల పురోగతిపై వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విస్తృత స్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సంబంధిత నాలుగు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఏపీఓలు, ఇంజినీరింగ్ సిబ్బంది హాజరయ్యారు. సమావేశంలో ప్రస్తుతం నియోజకవర్గంలో కొనసాగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలు, గ్రామీణ తార్ రోడ్లు, హెల్త్ క్లినిక్ భవనాలు, పంచాయతీ , నీటి సరఫరా పథకాల పనులపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అలాగే త్వరలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో ప్రణాళికలు రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులను ముందుగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి మండలంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ పారదర్శకంగా పనులు నిర్వహించాలని, అధికారుల మధ్య సమన్వయం ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

# మహాశివరాత్రి ఉత్సవాలపై ఎస్పీ జి. బిందు మాధవ్ సమీక్ష



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ముఖ్య శైవక్షేత్రాలలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశ ముిన్నందున, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి. బిందు మాధవ్ శనివారం సామర్లకోట మరియు పిఠాపురం ప్రాంతాలలో బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయం మరియు పిఠాపురంలోని శ్రీ కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లు, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ డైవర్షన్లు, అత్యవసర సేవల సమన్వయం, ఫైర్ సేఫ్టీ చర్యలు మరియు అనుమానాస్పద వ్యక్తులపై కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మహిళలు, వృద్ధులు మరియు చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రజలు మరియు భక్తులు పోలీసు శాఖకు సహకరించి, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, అనుమానాస్పద విషయాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ కోరారు.

# శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14:** రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న "హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి" సభ్యులు, దుర్గాశక్తి మహిళా సభ్యులు శనివారం స్థానిక గోదావరి గట్టుపై గల జోడుగుళ్ల శివాలయంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. తమ సమితి ఉద్దేశ్యాన్ని తెలియజేస్తూ ఆలయ ప్రధాన అర్చకుడు మౌళిని కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అదే విధంగా శివరాత్రికి తమ సమితి ద్వారా ఆలయానికి ఎటువంటి సేవలు కావాలన్నా అందుబాటులో ఉంటామని తెలియజేశారు. సమితి గౌరవ అధ్యక్షుడు, అన్నవరం దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకుడు ఇంద్రగంటి గోపాల కృష్ణ అక్కడికి విచ్చేసిన 2 వ పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్ ను దుశ్శాలువాతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు వెలుగూరి రవికుమార్, మరో అతిథి '7 ఐడియాస్' ఫౌండర్ అండ్ చైర్మన్ ఉదయ్ భాస్కర్ ను పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి పోతుల వెంకటేష్, మీడియా కో ఆర్డినేటర్ కిషోర్, ఉపాధ్యక్షులు మురళి, సాయి కృష్ణ, పవన్, దుర్గాశక్తి టీమ్ మహిళలు పాల్గొన్నారు.

# వీర జవాన్లకు పిఠాపురంలో ఘన నివాళి



**పిఠాపురం (మనసులో మాట) ఫిబ్రవరి 14:** పుల్వామా ఉగ్రదాడిలో వీరమరణం పొందిన 40 మంది భారతీయ వీరజవానుల సంస్మరణ సభ పిఠాపురంలోని స్థానిక 'బంగారమ్మ రావిచెట్టు' వద్ద విశ్వ హైందవ పరిషత్ ఆధ్వర్యంలో జరిగింది. ఆత్మహుతి దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు సంఘ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులు తెలుపుతూ అశ్రు నివాళులర్పించారు.ఈ సందర్భంగా విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 14 భారతదేశ చరిత్రలో అత్యంత విషాదకరమైన రోజని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల మోసపూరిత చర్య కారణంగా 40 మంది వీరజవానులు ప్రాణాలు కోల్పోవడం దేశానికే తీరని లోటని, ఈ వార్త విన్న రోజున యావత్ భారతదేశం శోకసముద్రంలో మునిగిపో యిందని ఆయన గుర్తు చేశారు.రాష్ట్ర కార్యదర్శి మణికుమార్ మాట్లాడుతూ.. ఎముకలు కొరికే చలిలో, ప్రాణాలకు తెగించి జవానులు సరిహద్దుల్లో కాపలా ఉండటం వల్లే మనమంతా దేశంలో సురక్షితంగా, ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని కొనియాడారు. జవానుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి కనీస బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం జవానుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హైందవ పరిషత్ నాయకులు శేఖర్, కొండేపూడి శివ, సురేంద్ర, సాయి, ప్రసాద్ పలువురు మహిళలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగల నుండి 51 మోటార్ సైకిళ్ల రికవరీ

**అన్నవరం (మనసులో మాట) ఫిబ్రవరి 14:** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు, పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డి. శ్రీహరిరాజు పర్యవేక్షణలో, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు ఆధ్వర్యంలో అన్నవరం పోలీసు సిబ్బంది అంతర్ జిల్లా మోటార్ సైకిల్ దొంగలను అరెస్టు చేసి, వారి వద్ద



నుండి 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగిలించబడిన 51 మోటార్ సైకిళ్లను రికవరీ చేయటం జరిగింది.అరెస్టు చేసిన ముద్దాయిలు దాసరి దుర్గాప్రసాద్ సోమేశ్వరం గ్రామం, రాయవరం మండలం అని తెలిపారు. (ఏ2.శాఖా ప్రసాద్ సోమేశ్వరం గ్రామం, రాయవరం మండలం. (ఏ 2) రిసీవర్ నల్లమిల్లి దొరస్వామి రెడ్డి సోమేశ్వరం గ్రామం, రాయవరం మండలం గా చెప్పారు.ఏ 1 పై 41 పాత కేసులు, ఏ 2 పై 5 పాత కేసులు నమోదై ఉన్నవన్నారు.రికవరీ చేసిన 51 మోటార్ సైకిళ్ల అంచనా విలువ సుమారు రూ. 24.33 లక్షలు ఉంటాయన్నారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన హెచ్సి 2595 ఎస్.వి. రమణ, పిసి-1372 ఎం. నాగేశ్వరరావు, పిసి-3630 ఎన్. శ్రీను, హెచ్జి-816 కె. నాగేశ్వరరావు, హెచ్జి-711 పి. అచ్యుతరామ్, హెచ్జి-1021 పి. సత్తిబాబు లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.దొంగిలించబడిన తమ వాహనాలు రికవరీ చేసి అప్పగించినందుకు బాధితులు పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్

**జిల్లా, డివిజన్, మండల స్థాయిలో రెవెన్యూ క్లినిక్ నిర్వహణ-**
**జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14 :** జిల్లా కలెక్టరేట్లో ఈ నెల 16వ తేదీ సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే విధంగా జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమాలు కొనసాగనున్నట్లు తెలిపారు. అదే సమయంలో జిల్లా, డివిజన్, మండల పరిధిలో రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు 1100 టోల్ ఫ్రీ నంబర్కు ఫోన్ చేసి తమ అర్జీలను నమోదు చేయవచ్చని తెలిపారు. గతంలో అందజేసిన అర్జీల పరిష్కార స్థితిని కూడా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.

# ఇది తిరోగమన బడ్జెట్

**సీపీఎం జిల్లా కార్యదర్శి కన్నడం ప్రసాదరావు విమర్శ**

**కాకినాడ( మనసులో మాట) ఫిబ్రవరి 14:** 2026-27 రాష్ట్ర బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తోడ్పడే విధంగా లేదని సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అన్నారు. బడ్జెట్ పైన ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు చెబుతున్న వికసిత ఆంధ్రప్రదేశ్ మాటల్లో గొప్ప- చేతల్లో శూన్యంలా ఉందన్నారు.సూపర్ సిక్స్ పథకాలు అమల్లో మిగిలి పోయిన మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్ పట్టించుకోలేదని. 75 వేల కోట్లు లోటు పూడ్చుకోడానికి ప్రజలపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని కరణం ప్రసాదరావు పేర్కొన్నారు. మొత్తం మీద ఈ బడ్జెట్ తిరోగమనం దిశలో ఉందని అన్నారు ఈ రెండేళ్లలో క్రమంగా ఆదాయం పడిపోతున్నదని, అభివృద్ధి ఉంటే ఆదాయం పెరగాలి కానీ రాష్ట్ర స్వంత పన్ను ఆదాయం తగ్గిందంటే అర్థం ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయని అయన తెలిపారు. పెట్టుబడి వ్యయం బాగా తగ్గింది. అంటే అభివృద్ధి తిరోగమనంలో ఉందనే అర్థమన్నారు.పెట్టుబడి పద్దు క్రింద 98 వేల కోట్లు చూపించగా ఇందులో 76 వేల కోట్లు బహిరంగ మార్కెట్లో తెచ్చే అప్పులు కాగా స్థూల జాతీయోత్పత్తిలో 36% అప్పులేఉన్నాయన్నారు. బడ్జెట్లో 18 శాతం వడ్డీలకే సరిపోతున్నది. ఈ భారం మొత్తం ప్రజలమీదే పడుతుందని కానీ పెట్టుబడి వ్యయం 48,697 కోట్లు కేటాయించి నట్లు చెప్పారు. అంటే మిగతా అప్పు మొత్తం ఎక్కడకు పోతున్నదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అయన డిమాండ్ చేసారు. బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయానికి 4% కేటాయించి రైతులకు అన్యాయం చేసిందని, విద్యారంగానికి పెద్ద పీట వేస్తామని ఘనంగా ప్రకటించినా మొత్తం బడ్జెట్లో విద్యకు 10.8 శాతం నుండి 10.5శాతానికి తగ్గిందని, ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్కు నిధుల కేటాయింపు లేదని, ఇలా ప్రజలకు, రాష్ట్రాభివ ద్ధికి తోడ్పడే అనేక పద్దుల్లో కోత విధించడం రాష్ట్రాభివ ద్ధిని నిరాశలో ముంచిందని సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు విమర్శించారు.

# కోడి రూపంలో కొలువైన సాంబశివుడు.. కోటి పుణ్యాల కుక్కుటేశ్వర క్షేత్రం!

- **మహాశివరాత్రి సందర్భంగా పీఠికాపుర క్షేత్ర విశిష్టతను తెలిపే ప్రత్యేక కథనం.**

**పిఠాపురం, ( మనసులో మాట) ఫిబ్రవరి 14:** కాకినాడ జిల్లాలోని పిఠాపురం పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వైభవానికి నిలయం. అష్టాదశ శక్తి పీఠాలలో పదవ శక్తి పీఠంగా, సాక్షాత్తు పరమశివుడు కుక్కుటేశ్వర స్వామిగా వెలసిన ఈ క్షేత్రం 'పాదగయ'గా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. భక్తుల పాలిట కల్పవల్లిగా పురుహూతిక అమ్మవారు, స్వయంభూ దత్తాత్రేయుడు, శ్రీపాద శ్రీవల్లభుల దివ్య సన్నిధిగా ఈ క్షేత్రం విరాజిల్లుతోంది.

## ప్రధాన ఆలయము

శ్రీ రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి వారు స్వయంభు లింగ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. స్వయంభు లింగం వెనుక భాగంలో ఎడమవైపు శ్రీహుంకారిణి మాత కొలువై ఉన్నారు. మహాశివుని ఆలయం పక్కన గల ఉపాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు కొలువై ఉన్నారు.

## సకల దేవతలు నిలయం

పాదగయ క్షేత్రం సకల దేవతామూర్తుల నిలయంగా భాసిల్లుతోంది. ప్రధాన ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టగానే తొలుత గుహ వంటి ఉపాలయంలో సాక్షాత్తు మహావిష్ణువు పాదాలు భక్తులకు దర్శనమిస్తాయి. అనంతరం విఘ్ననాశకుడైన చింతామణి గణపతి, సీతారామ లక్ష్మణ సమేత శ్రీ రామాలయం, అద్వైత గురువు ఆది శంకరాచార్యుల సన్నిధులు ఆధ్యాత్మిక కాంతిని పంచుతాయి. కాశీ క్షేత్రాన్ని తలపిస్తూ కాశీ విశ్వేశ్వరుడు - అన్నపూర్ణాదేవి, శబరిమల వాసుడు అయ్యప్ప స్వామి, భక్తుల ఇష్టదైవం దుర్గామాత, జ్ఞానప్రదాయిని సరస్వతీ దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉపాలయాలు భక్తులను పులకింపజేస్తాయి. వీటితో పాటు అవధూత చింతనను రేకెత్తించే దత్త బృందావనం, ఈ పుణ్యక్షేత్రానికి రక్షణగా నిలిచే క్షేత్రపాలకుడు కాలభైరవ స్వామి ఆలయం భక్తులకు సమగ్ర దైవ దర్శన భాగ్యాన్ని కలిగిస్తున్నాయి."

## పురాణ గాథ -- గయాసురుని త్యాగం

పురాణాల ప్రకారం గయాసురుడు అనే మహాత్ముడు తన శరీరం పుణ్యక్షేత్రంగా మారాలని ఘోర తపస్సు చేసి వరం పొందాడు. లోక కళ్యాణం కోసం త్రిమూర్తులు గయాసురుని శరీరంపై యజ్ఞం చేయాలని నిశ్చయించారు. యజ్ఞం పూర్తయ్యే వరకు శరీరాన్ని కదల్చకూడదని షరతు విధించారు. అయితే, యజ్ఞ సమయం ముగియక ముందే పరమశివుడు కోడి (కుక్కుటం) రూపం ధరించి కూత పెట్టడంతో, తెల్లవారిందని భావించిన గయాసురుడు శరీరాన్ని



కదిలించాడు.

యజ్ఞ భంగం జరిగినందుకు మరణశిక్షకు సిద్ధపడిన గయాసురుని త్రిమూర్తులు కడసారి కోరిక కోరమనగా.. తన శరీరంలోని మూడు ప్రధాన భాగాలు దివ్య క్షేత్రాలుగా విరాజిల్లాలని కోరుకున్నాడు. మహావిష్ణువు గయాసురుడిని మూడు సమాన భాగాలుగా సంహరించారు.మూడు ప్రాంతాలు ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి.

## త్రిగయ క్షేత్రాల విశిష్టత

గయాసురుని కోరిక మేరకు ఆయన శరీరం మూడు భాగాలుగా మూడు క్షేత్రాలయ్యాయి శిరో గయ: శిరస్సు భాగం (బీహార్లోని గయ) - ఇక్కడ మహావిష్ణువు వెలిశారు. నాభి గయ: నాభి భాగం (ఒడిశాలోని జాజ్పూర్) - ఇక్కడ బ్రహ్మదేవుడు కొలువై ఉన్నారు. పాద గయ: పాదాల భాగం (ఆంధ్రప్రదేశ్లోని పిఠాపురం) - ఇక్కడ కోడి రూపంలో కుక్కుటేశ్వర స్వామిగా పరమశివుడు వెలిశారు.

## పితృ తర్పణాలకు మోక్షమార్గం- పాదగయ క్షేత్రం

కాశీ, గయలో పిండ ప్రదానాలు చేస్తే ఎంతటి పుణ్యం లభిస్తుందో, పిఠాపురం పాదగయ క్షేత్రంలో తర్పణాలు వదిలినా అంతే ఫలితం ఉంటుందని భక్తుల నమ్మకం. ఇక్కడ పిండ ప్రదానం చేయడం వల్ల పితృదేవతలు నూరు తరాల వరకు తరిస్తారని త్రిమూర్తుల వరప్రసాదం. శక్తి స్వరూపిణి పురుహూతిక అమ్మవారు, శ్రీపాద వల్లభుల దివ్య ఆశీస్సులు మెండుగా ఉన్న ఈ పాదగయ క్షేత్రం, ఆధ్యాత్మిక చింతనతో పాటు పితృభక్తిని చాటిచెప్పే దివ్యధామంగా నేటికీ అలరారుతోంది.

## అష్టాదశ శక్తిపీఠం - పురుహూతిక అమ్మవారు

పాదగయ క్షేత్రం అష్టాదశ శక్తిపీఠాలలో పదవ శక్తిపీఠంగా విరాజిల్లుతోంది. దక్షయజ్ఞం సమయంలో సతీదేవి ఆత్మాహుతి చేసుకున్న తర్వాత, ఆమె శరీర భాగాలు పడిన చోట శక్తిపీఠాలు వెలిశాయి. ఇక్కడ సతీదేవి 'పీఠం' (కూర్చునే భాగం) పడినట్లు పురాణాలు చెబుతున్నాయి, అందుకే ఈ ఊరికి పీఠికాపురం అనే పేరు వచ్చింది. ఇంద్రుడు (పురుహూతుడు) ఇక్కడ అమ్మవారిని పూజించి తన శాపం నుండి విముక్తి పొందాడని, అందుకే ఈ తల్లికి 'పురుహూతిక దేవి' అనే పేరు వచ్చిందని ప్రతీతి. అత్యంత శక్తివంతమైన ఈ అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

## స్వయంభూ దత్తాత్రేయ స్వామి - శ్రీపాద వల్లభులు

ఈ క్షేత్రం దత్తాత్రేయ స్వామి భక్తులకు అత్యంత పవిత్రమైనది. కుక్కుటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోనే స్వయంభూ దత్తాత్రేయ స్వామి వారు కొలువై ఉన్నారు. కలియుగంలో దత్తాత్రేయుని మొదటి అవతారంగా భావించే శ్రీపాద శ్రీవల్లభులు పిఠాపురంలోనే జన్మించారు. ఆయన పాదముద్రలు, ఆయన నివసించిన పవిత్ర ప్రదేశం నేటికీ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తాయి. దత్తాత్రేయుని సాక్షాత్కారం పొందేందుకు, గురు చరిత్ర పారాయణం చేసేందుకు దేశం నలుమూలల నుండి భక్తులు ఇక్కడికి తరలివస్తుంటారు.

## పాదగయ కోనేటి స్నానాలు - శివరాత్రి జాగరణ

మహాశివరాత్రి పర్వదినాన పాదగయ క్షేత్రం భక్తజన సంద్రంగా మారుతుంది. ఈ రోజున క్షేత్రంలోని 'పాదగయ' అనే పవిత్ర కోనేరులో లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. తెల్లవారుజాము నుండే భక్తులు చేసే ఈ 'చలిగంగ స్నానం' పాప ప్రక్షాళన చేస్తుందని భక్తుల నమ్మకం. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలో భక్తులు అఖండ దానాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా స్వయంపాక దానం, వస్త్రదానం వంటి కార్యక్రమాలతో క్షేత్రం కళకళలాడుతుంది. శివరాత్రి రోజున భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, రాత్రంతా శివనామ స్మరణతో జాగరణ చేస్తూ, లింగోద్భవ కాలంలో స్వామివారిని దర్శించుకుని తరిస్తారు.లక్షలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు . భక్తి ముక్తిదాయకం పితృతర్పణ క్షేత్రంగా దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వర స్వామి వారి (పాదగయ) క్షేత్రాన్ని మహాశివరాత్రి రోజున దర్శించడం కోటి జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు..

# కోటప్పకొండ తిరునాళ్లలో బందోబస్తు నిధులు అప్రమత్తంగా నిర్వహించాలి



**పల్నాడు,ఫిబ్రవరి 14,( మనసులో మాట) :** మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ తిరుణాలకు హాజరైన పోలీసులు సిబ్బంది బందోబస్తు విధులు అప్రమత్తంగా నిర్వహించాలని పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు పేర్కొన్నారు. కోటప్పకొండ తిరునాళ్ల బందోబస్తును గురించి శనివారం ఎస్పి పోలీస్ అధికారులకు సిబ్బందికి బ్రీఫింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందోబస్తు విధులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అత్యంత అప్రమత్తతో నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో దృఢంగా వ్యవహరించడమే కాకుండా తిరునాళ్లకు హాజరయ్యే భక్తులతో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి సెక్టార్కు కేటాయించిన పోలీసు అధికారులు తమ విధులపై విధి నిర్వహణ ప్రదేశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తమకు కేటాయించిన సిబ్బందితో పాటు పక్క సెక్టార్ల అధికారులతో సమన్వయంతో విధులు నిర్వహిం చాలని ఆదేశించారు. ఏదైనా సెక్టార్లు ఆకస్మిక ఘటన చోటు చేసుకున్నప్పుడు పక్క సెక్టార్లకు చెందిన పోలీసు అధికారులు సిబ్బంది వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సహకరించాలని తెలిపారు. భక్తులకు ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్త కుండా చర్యలు తీసుకోవాలని రోడ్లపై అక్రమ పార్కింగ్ లేకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహిం చాలన్నారు, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా బృంధాలతో ముందస్తు విద్వాంస నిరోధక తనిఖీలు నిర్వహించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన ముందస్తు భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో పోలీసుల అప్రమత్తంగా ఉండి వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని అవసరమైన చోట్ల నిర్దేశిక చిహ్నాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందోబస్తు విధులకు హాజరయ్యే పోలీస్ అధికారులు సిబ్బంది తప్పనిసరిగా ఐడి కార్డులు కలిగి ఉండాలని విజిల్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ పై నిరంతరం దృష్టి సారించి విధి ప్రదేశంలో ఏదైనా అసాధారణ ఘటన సంభవించి నట్లయితే వెంటనే కమ్యూనికేషన్ కంట్రోల్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు అడ్మిన్ ఎస్పీ జేవి సంతోష్, ట్రైన్ ఎస్పి నిరంజన్, అదనపు ఏ ఆర్ ఎస్పి వి. సత్తిరాజు, అదనపు క్రైమ్ ఎస్పీ లక్ష్మీపతి ఇతర డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగ్గురు దొంగలు అరెస్టు-15 లక్షల విలువగల చోరీ సొత్తు స్వాధీనం

- **ఒక కారు, ఏడు మోటార్ సైకిళ్ళతో పాటు మొత్తం 15 లక్షల విలువగల చోరీ సొత్తు స్వాధీనం**

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** కాకినాడ డివిజనుకు చెందిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్టు చేయడమే కాకుండా వారి నుండి ఒక కారు, ఏడు మోటార్ సైకిళ్ళతో పాటు 186 గ్రాముల వెండి వస్తువులు వెరసి మొత్తం సుమారు 15 లక్షల విలువ గల చోరీ సొత్తును రికవరీ చేశారు.పై కేసులకు సంబంధించిన వివరాలను కాకినాడ రూరల్ సిఐ డివిస్ చైతన్య కృష్ణ శనివారం కాకినాడలోని డిఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. ఈ సందర్భంగా చైతన్యకృష్ణ మాట్లాడుతూ గత రెండేళ్లుగా కాకినాడ జిల్లాలోని కాజులూరు, కరప, కాకినాడ రూరల్ తిమ్మాపురం ఇంకా తొండంగి మండలాల్లో రాత్రిపూటలలో నేరాలు, మోటార్ సైకిల్ దొంగతనాలు, బంగారు, వెండి గొలుసుల దొంగతనాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రణ పై కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ప్రత్యేక బృందాలను కాకినాడ డిఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో తనను ఇన్ఛార్జిగా నియమించి కరప ఎస్సై, గొల్లపాలెం ఎస్సైలతో రెండు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ



ప్రత్యేక బృందాల ప్రయత్నాలు చేయడంలో భాగంగా గత కొంతకాలంగా కాకినాడ జిల్లాలోని గొల్లపాలెం, కరప, తిమ్మాపురం, తొండంగి పోలీస్ స్టేషన్లలో బంగారు గొలుసులు దొంగతనం చేస్తూ పట్టు పడకుండా తిరుగుతూ ఉన్న కాకినాడ గైగోలు పాడు ప్రాంతానికి చెందిన పిల్లి సింహాచలం, కాకినాడ మధురానగర్ ప్రాంతానికి చెందిన ద్రాక్షారపు ఉమా శంకర్, కాకినాడ సర్పవరం పూల మార్కెట్ ఎదురు నివాసి దారా నానీలు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గొల్లపాలెం ఎస్సై ఎం మోహన్ కుమార్, సిబ్బందికి సమాచారం రావడంతో వారిని గొల్లపాలెం గ్రామంలోని శలపాక రోడ్డు వద్ద రైస్ మిల్లు వద్ద శుక్రవారం సాయంత్రం వారిని అదుపులో తీసుకుని అరెస్టు చేసామన్నారు. ముద్దాయి పిల్లి సింహాచలం 49 నేరాలు, ద్రాక్షారపు ఉమా శంకర్ రెండు నేరాలు, దారా నాని మూడు నేరాలకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. వీరిని కోర్టులో ఆధారపడగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. వీరిని పట్టుకోవడంలోనూ చో రీ సొత్తు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కరప ఎస్సై టి సునీత, గొల్లపాలెం ఎస్సై ఎం మోహన్ కుమార్, హెచ్సీలు జి నరసింగ రావు, పీసీలు ఏ చంద్రశేఖర్, ఎం శివప్రసాద్, ఎన్ శ్రీనివాసరావు, జివి రమణ, వైజియస్సాన్ మూర్తి, హోంగార్డ్ వి రాంబాబుని సీఐ డివిస్ చైతన్య కృష్ణ అభినందించారు. అపార్ట్మెంట్తో పాటు ఆయా ప్రాంతాల వాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలను గుర్తుపట్టవచ్చని చైతన్య కృష్ణ చెప్పారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# విద్యుత్తు ఉద్యోగులకు పాత జీపీఎఫ్ పెన్షన్ విధానం అమలు చెయ్యాలి

- జీపీఎఫ్ పెన్షన్ అమలు చేయకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది విద్యుత్తు ఉద్యోగులకు నష్టం
- చాలీచాలని పెన్షన్ తో జీవిస్తున్న విద్యుత్తు ఉద్యోగులు
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న పెన్షన్ విధానాన్ని విద్యుత్తు ఉద్యోగులకు కల్పించాలి
- విద్యుత్తు ఉద్యోగుల జీపీఎఫ్ సాధన సమితి జేపీసీ డిమాండు




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14:** విద్యుత్తు ఉద్యోగులకు పాత జీపీఎఫ్ పెన్షన్ విధానం అమలు చెయ్యాలని విద్యుత్తు ఉద్యోగుల జీపీఎఫ్ సాధన సమితి జేపీసీ చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు డిమాండు చేశారు. శనివారం స్థానిక మోరంపూడి సెంటర్లో గల విద్యుత్తు ఇంజనీర్స్ అసోసియేషన్ హాలులో విద్యుత్తు ఉద్యోగుల జిపిఎఫ్ సాధన సమితి జేపీసీ ఆధ్వర్యంలో విద్యుత్తు ఉద్యోగుల జీపీఎఫ్ పెన్షన్ ఆశావాహుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు, సెక్రెటరీ బీఎస్ఎస్ వెంకటేశ్వరరావు లు మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలలో 1ˇ21999 నుండి 31 .82004 మధ్య నియమితులైన ఉద్యోగులకు పాత జీపీఎఫ్ పెన్షన్ విధానం అమలు చెయ్యాలని డిమాండు చేశారు. గత 25 సంవత్సరాలుగా పాత జీపీఎఫ్ పెన్షన్ విధానం అమలు చెయ్యాలని విద్యుత్తు సంఘాలు డిమండ్ చేస్తున్నాయని తెలిపారు. జీపీఎఫ్ పెన్షన్ విధానం అమలు చేయకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది విద్యుత్తు ఉద్యోగులకు నష్టపోతున్నారని అన్నారు. ఏపీఎస్ఈబీని 1999 లో కంపెనీలుగా విడదీసినప్పుడు ఒక తప్పు జరిగిందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అప్పటివరకు జీపీఎఫ్ ఉన్నా కూడా 2004 తరువాత ప్రభుత్వంలో సీపీఎస్ కు వెళ్లారని తెలిపారు. 1999 ఫిబ్రవరి 1 నుండి 2004 ఆగస్టు 31 మధ్య నియమితులైన విద్యుత్తు ఎంప్లాయిస్ కు పాత పెన్షన్ కల్పించాలని, అనేక సంవత్సరలుగా విద్యుత్తు జేపీసీ పోరాడుతోందని వివరించారు. ఈ నేపథ్యములో ప్రభుత్వం ఇటీవల ఒక కమిటీని వేశారని అన్నారు. విద్యుత్తు ఉద్యోగులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించడం వల్ల ప్రభుత్వానికి భారంగా మారుతుందనే ఉద్దేశంతో తమ డిమాండును ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి భారం కాకుండా ఇప్పటి వరకు ఉన్న పాస్ట్ లయబిలిటీ ని ఎంప్లాయిస్ కట్టుకునే విధంగాను, భవిష్యత్తులో కట్టవలసిన లయబిలిటీ ని యజమాన్యం కట్టేలా గత అక్టోబరులో సమ్మె విరమించే సమయంలో రెండు నెలలలో చేస్తామని లిఖిత పూర్వక హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగు నెలలు దాటినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికే చాలా మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారని, వెంటనే విద్యుత్తు సంస్థలలో 1ˇ21999 నుండి 31 .082004 మధ్య నియమితులైన ఉద్యోగులకు పాత జీపీఎఫ్ పెన్షన్ అమలు చెయ్యాలని డిమాండు చేశారు. విద్యుత్తు శాఖలో సంస్కరణలు చేసిన అప్పటి, ఇప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని అప్పుడు జరిగిన తప్పును సరిచేసి విద్యుత్తు సంస్థలలో 1ˇ21999 నుండి 31 .082004 మధ్య నియమితులైన ఉద్యోగులకు పాత జీపీఎఫ్ పెన్షన్ విధానంను అమలు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు ఉద్యోగుల జీపీఎఫ్ సాధన సమితి జేపీసీ నాయకులు రమణబాబు, ఐ నాగేశ్వరరావు, మురళి, శివప్రసాద్, వివిద జిల్లాల నుండి అధిక సంఖ్యలో జీపీఎఫ్ పెన్షన్ ఆశావహులు హాజరయ్యారు.

# న్యాయం చేయాలంటూ ఇంటి ముందు బైఠాయించిన కోడలు



**పిఠాపురం, ( మనసులో మాట) ఫిబ్రవరి 14:** పిఠాపురం పట్టణంలో ఓ మహిళకు తన అత్తమామల నుండి ఎదు-రవుతున్న వేధింపులు, ఆస్తి వివాదంపై జనసేన పార్టీ వీర మహిళలు గళమెత్తారు. బాధితురాలు లలితకు న్యాయం చేయాలంటూ ఆమె అత్తమామలైన చెల్లయ్య, దుర్గమ్మ దంపతుల మంగాయమ్మారావుపేట ప్రాంతంలో గల ఇంటి ముందు ధర్నా నిర్వహించారు. తిరుమల గ్రామానికి చెందిన చిత్తుల సూర్య గని వరలక్ష్మి (లలిత) కథనం ప్రకారం, భర్త చంద్రశేఖర్ నాలుగేళ్ల క్రితం కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. భర్త మరణం తర్వాత ఒంటరిగా మారిన తనను చిన్న బిడ్డను ఆదుకోవాల్సిన అత్తమామలు.. ఇంటికి రానివ్వకుండా గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. ఆస్తిలో వాటా ఇస్తామని మొదట్లో నమ్మబలికిన అత్తమామలు, ఇప్పుడు మాత్రం ఏమీ ఇవ్వమని, "మీకు దిక్కున్న చోట చెప్పుకోండని" నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆరోపించారు. అంతేకా కుండా, మామ చెల్లయ్య తనకు చెందిన ఆస్తిని రహస్యంగా మరో కుమారుడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. భర్తను కోల్పోయి వీధిన పడ్డ తనకు న్యాయబద్ధంగా రావాల్సిన ఆస్తి వాటా పరిహారం ఇప్పించాలని ఆమె కోరుతున్నారు. బాధితు రాలికి జరుగుతున్న అన్యాయంపై సమాచారం అందుకున్న జనసేన పార్టీ వీర మహిళలు రంగంలోకి దిగారు. వీర మహిళల ఆధ్వర్యంలో బాధితురాలికి మద్దతుగా పిఠాపురం లో నిరసన చేపట్టారు. మహిళను వేధించడం ఆపాలని, తక్షణమే ఆమెకు ఆస్తిలో వాటా,పరిహారం ఇచ్చి చిన్న కుమారుడు కలిగిన ఆమెను ఆదుకోవాలని డిమాండ్ చేశారు బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని జనసేన నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజమండ్రి జనసేన నాయకురాలు గంటా స్వరూప దేవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ జనసేన వీర మహిళ లు చల్లా లక్ష్మి, వీర మహిళలు కోలా దుర్గ, పిల్ల రమ్య జ్యోతి, ముత్తింటి శిరీష, ముప్పిడి రత్నం తదితర జనసైనికులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి ఏర్పాట్లపై ఎస్పీ క్షేత్ర స్థాయి పరిశీలన

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14 :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరి నదిలో భక్తులు పుణ్య స్థానాలు ఆచరించే నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ శనివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా ఉన్న గోదావరి ఘాట్ లను, శివాలయాలను సందర్శించి, క్షేత్ర స్థాయిలో భద్రతా ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ రానున్న శివరాత్రి సందర్భంగా గోదావరి ఘాట్లు, శివాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాలు, సోలార్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్యూలైన్ల వద్ద, ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని, అవసరమైన చోట తాత్కాలిక ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. భక్తులు నదీ స్నానాలు చేసేటప్పుడు పోలీసు వారు సూచించిన జాగ్రత్తలు తప్పక పాటించాలని, అధికారులు సూచించిన ఘాట్ల వద్ద మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని, నది లోతు, ప్రవాహ వేగం తెలియకుండా ఎక్కడబడితే అక్కడ దిగి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల కదలికలను గమనిస్తూ సిబ్బంది ప్రజలకు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం



ద్వారా సూచనలు జారీ చేస్తామన్నారు. బందోబస్తు లో భాగంగా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల సేవలను కూడా పూర్తి స్థాయిలో వినియోగిస్తున్నామని, మహిళా భక్తులకు, చిన్నారులకు వారు అండగా ఉంటారని ఎస్పీ తెలిపారు. మహాశివరాత్రి బందోబస్తు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు ఇచ్చారు. మహాశివరాత్రి తిరునాళ్ల బందోబస్తును అప్రమత్తంగా, ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్కు సమాచారం అందించాలని సూచించారు. సెక్టార్ అధికారులు తమ పరిధిపై పూర్తి అవగాహనతో పక్క సెక్టార్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుని, రాంగ్ పార్కింగ్పై నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సున్నిత ప్రాంతాల్లో స్పెషల్ సెక్యూరిటీ టీమ్స్ ద్వారా ముందస్తు భద్రత తనిఖీలు నిర్వహించాలని, పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల సక్రమ నిర్వహణ, దిశా నిర్దేశక బోర్డుల ఏర్పాటు చేయాలన్నారు. విధులకు హాజరయ్యే సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డులు, విజిల్స్, లాఠీ కలిగి ఉండాలని ఎస్పీ డీ నరసింహ కిశోర్ సూచించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాటల్లో గొప్ప చేతల్లో శూన్యం..బడ్జెట్‌లో రైతులకు మొండిచేయి

- చంద్రబాబు మాయల గారడీ బడ్జెట్...
- మరోసారి నిరోద్యోగులకు టోకరా....
- కొత్త జిల్లాల సమగ్రాభివృద్ధి ఊసేలేదు...
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు

**కాకినాడ( మనసులో మాట) ఫిబ్రవరి 14:** 2026 -2027 రాష్ట్ర బడ్జెట్ మాటల్లో గొప్ప చేతల్లో శూన్యశీ గా కనబడుతుందని అంతేకాకుండా చంద్రబాబు మాటల గారడీగా ఉందని ఇది తిరోగమన బడ్జెట్ అని సామాన్య ప్రజలకు ఈ బడ్జెట్ బహు దూరంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు ఈ సందర్భంగా బడ్జెట్ పై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు గత ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేదని కనీసం నిరుద్యోగుల ఊచే ఎత్తలేదని ఆయన పేర్కొన్నారు కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత చాలా జిల్లాల్లో జిల్లా కలెక్టరేట్లు అద్దె భవనాల్లో ఉంటున్నాయని జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ల నిర్మాణానికి బడ్జెట్లో ఎటువంటి కేటాయింపులు లేవన్నారు పోలవరం ప్రాజెక్టు 72% పూర్తయిందని ఇప్పుడు దాకా చెప్పిన సందర్భంగా ఇప్పుడు 60 శాతం మాత్రమే పూ-ర్తయింది చెప్పడం ఆయన పచ్చి అబద్ధల మాటలకు నిదర్శనం అన్నారు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల గురించి ప్రస్తావలేదని మధు తెలిపారు ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర నిరాశ కలిగిందని మధు తెలిపారు ఈ మూడవ బడ్జెట్‌లో కూడా సాగు రంగానికి వెన్నెముకగా ఉన్న రైతులను విస్మరించడం దుర్మార్గమని మధు ఖండించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కౌలురైతులను కూటమి సర్కార్ దగా చేసిందని వారు మండిపడ్డారు. బడ్జెట్లో రైతుల సంక్షేమం గురించి ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం ఆక్షేపణీయమన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద 46.86 లక్షల మంది రైతులకు రూ. 6,650 కోట్లు ప్రతిపాదించిన ప్రభుత్వం, అందులో భూమిలేని కౌలురైతులకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం వారి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. రాష్ట్రంలో సాగు అవుతున్న భూమిలో 80 శాతం పంటలు పండిస్తున్నది



కౌలురైతులే. 35 లక్షల మంది కౌలురైతుల్లో సుమారు 10 లక్షల మందికి పైగా భూమిలేని నిరుపేదలు ఉన్నారని, వారికి పెట్టుబడి సాయం అందించకపోవడం అన్యాయమని మధు పేర్కొన్నారు.

# మెడికల్ మాఫీయా పై యుద్ధం

## రెడ్ బుక్కులో మెడికల్ మాఫియాను చేర్చాలని డిమాండ్..



**పిఠాపురం, (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ )రాష్ట్ర కార్యవర్గం పిలుపు లో భాగం శనివారం మెడికల్ మాఫీయా పై పిఠాపురం స్థానిక ఉప్పాడ బస్టాండ్ వద్ద ప్రజాసంఘాలు సిపిఐ కార్యకర్తలతో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ ప్రజాసంఘాలు నాయకులు జాన్ పెట్రిక్ పాల్గొని మాట్లాడారు..ఈరోజున రాష్ట్రంలో మెడికల్ మాఫీయా అనేది ప్రజల ఆరోగ్యం మీద దాడి చేస్తుందని ప్రజా ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత అని అన్నారు. ప్రజల ఆరోగ్యం రాజ్యాంగం హక్కు ఆ హక్కును పాలక వర్గాలు ఫార్మా కంపెనీలు కలసి మొత్తం మెడికల్ మాఫీయా ఏర్పాడి ప్రజలపై దాడిచేస్తున్నాయ న్నారు. ప్రజలను ఆర్థికంగా మెడికల్ మాఫియా దోచుకు తింటున్నారని ప్రభుత్వాలు తక్షణమే మెడికల్ మాఫియా పై దృష్టి సారించి మాఫియాని అరికట్టాలని డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్ రాజస్థాన్ రాష్ట్రంలో లక్షరూపాయలకు కొన్న మెడిసిన్ మన రాష్ట్రంలో 20లక్షలు అమ్ముకున్నారని డ్రగ్స్ కంట్రోల్ కమీషనర్ చెబుతుంది. అదే కమిషన్ 1000 కోట్లు లంచం తీసుకుని మౌనం వస్తుందని ప్రభుత్వ ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ అవినీతి ఎక్కువైందని అద్దె సర్టిఫికెట్లతో ఫార్మా సీస్టులు లేకుండా అమ్మకాలు ఆస్పత్రి ఆవరణలోనే జరుపుతూ రోగుల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రవేటికరణ ఆపాలని మెడికల్ మాఫియా జరుగుతున్న ఆరోగ్య శాఖ మంత్రి ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవటం లేదని నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మిరియాలు ఏసు. ఏడిద సత్తిబాబు. మాత నాని బాబు. వేపకాయలు ప్రసాద్. వి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

# అండర్- 12 క్రికెట్ జట్టుకు విశ్వ పనేంద్ర రెడ్డి ఎంపిక



**అమలాపురం(మనసులో మాట) ఫిబ్రవరి 14 :** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ -12 క్రికెట్ టోర్నమెంట్ కు అమలాపురం చెందిన విశ్వ పనేంద్రరెడ్డి అభినందించారు. అమలాపురంలో సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్నాడు. తండ్రి సాయికుమార్ కమర్షియల్ డిపార్ట్మెంట్లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. తన కుమారుడుకి క్రికెట్ పై ఆసక్తి ఉందని గ్రహించి ప్రతిరోజు కోచింగ్ పంపిస్తున్నానన్నారు. తన కుమారుడు ని ఉత్తమ క్రికెటర్ గా చూడాలనేదే తన ఆశయమని సాయికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు ప్రిన్సిపల్ సురేష్ కుమార్ ఇతర ఉపాధ్యాయులు పనేంద్ర రెడ్డిని అభినందించారు.

# ఆదిత్య యూనివర్సిటీ లో మెగా వైద్య శిబిరం




**గండేపల్లి.(మనసులో మాట) ఫిబ్రవరి 14 :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో, మెడికోవర్ హాస్పిటల్స్, కాకినాడ వారి సహకారంతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిం చబడింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ప్రో చాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం. బి. శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ డా. ఎ. రమేష్ మరియు డీన్ డా. డి. కిశోర్ లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు తరచుగా నిర్వహించడం ద్వారా సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ నిపుణుడు డా. సుధర్శన్ రెడ్డి పల్లే, పీరియోడొంటిక్స్ ఢ ఇంప్లాంటాలజీ నిపుణుడు డా. చైతన్య అనేమ్ (డెంటల్), సీనియర్ కన్సల్టెంట్ ఆప్టోమెట్రిస్ట్ పినిపే రాహుల్ బుద్ధా, సీనియర్ కన్సల్టెంట్ ఆప్టోమెట్రిస్ట్ ఢ కాంటాక్ట్ లెన్స్ స్పెషలిస్ట్ తిరుమలసెట్టి అరుణ తదితరులు వైద్య సేవలు అందించారు. అదనంగా, రే ఒప్టిక్స్ మరియు క్లోవ్ డెంటల్ సంస్థల సహకారంతో కంటి మరియు దంత వైద్య పరీక్షలు నిర్వహించబడినవి. శిబిరంలో మొత్తం 283 కంటి పరీక్షలు, 58 ఈసీజీ పరీక్షలు, 185 దంత మరియు ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించబడినవి. అలాగే సిబ్బంది సభ్యులందరికీ రక్తపోటు మరియు రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ముఖ్యంగా, అవసరమైన వారికి కంటి కళ్లజోడు ఫ్రేములు ఉచితంగా అందించబడినవి, ఇది సిబ్బందికి ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. ఐ.వి. వీరాంజనేయులు, డా. బి. రాంబాబు, ఎల్. పరినయ శ్రీ, ఎం. రఘునాథ్ మరియు చి. రాంప్రసాద్ సమన్వయం చేయగా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మండల వి అర్ ఓ సంఘం అధ్యక్షునిగా రాముడు ఎన్నిక



**కపిలేశ్వరపురం (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** కపిలేశ్వరపురం మండలం వి అర్ ఓ ల సంఘం అధ్యక్షుని గా వి. రాముడు ఏకగ్రీవంగా గా ఎన్నికయ్యారు. మండలం కేంద్రం కపిలేశ్వరపురం లో జరిగిన మండల స్థాయి విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ల సమావేశం లో జరిగిన ఈ ఎన్నికల్లో వి అర్ ఓ ల సంఘం అధ్యక్షని గా రాముడు,ఉపాధ్యక్షడి గా టి. వెంకటేశ్వరవు, కార్యదర్శి గా వై రాజారత్నం, కోశాధికారి గా పి. నాగమణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నాయకుల సూచనల మేరకు సంఘ ఐక్యత కు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమం లో మండల స్థాయి వి అర్ ఓ లు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# సోమవారం( 16 వ తేది )రెవెన్యూ క్లినిక్ లేదు..

**కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ సగిలి**

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 14 :**మహా శివరాత్రి పర్వదినం మరుసటి రోజైన 16వ తేదీ సోమవారం నాడు ఆప్షనల్ శెలవు దినం ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన దృష్ట్యా ఈ సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని ఆయన తెలిపారు.

# వెన్నుపూస వంకర్లకు

**విజయవంతంగా శస్త్ర చికిత్స-వేదా స్పైన్ సెంటర్ డాక్టర్ తేజో ఫణీంద్ర**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14:** వెన్నుముక వంకర్లు వచ్చిన 14 ఏళ్ళ బాలిక దీవెనకు శనివారం వేద ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాక గ్రామానికి చెందిన రాజశేఖరరావు, దుర్గా భవానీల కుమార్తె దీవెన 8వ తరగతి చదువుతోంది. జన్యుపరంగా వెన్నుముక వంకర్లతో ఇబ్బందులు పడుతుంది. ఆమెకు వేద ఆసుపత్రి (స్పైన్ సెంటర్)లోని వైద్యుడు తేజో ఫణీంద్ర (వెన్నుముక నిపుణుడు) పరీక్షించి ఆపరేషన్ నిర్వహించారు. ఐడియోపాథిక్ సిలియోసిస్ (వెన్నుపూస) వంకరుకు సుమారు 7 గంటల పాటు నిర్విరామంగా శ్రమించి ఆపరేషన్ చేసి వంకర్లను సరిచేశారు. ఈ శస్త్ర చికిత్సలో వేద హాస్పిటల్స్ (స్పైన్ సెంటర్) డాక్టర్ తేజో ఫణీంద్ర , డాక్టర్ రామ కిషోర్, డాక్టర్ ప్రదీప్ తో పాటు మరో ఎనిమిది మంది, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ అరుదైన ఆపరేషన్ విజయవంతం కావడంతో వైద్యులు, వైద్య సిబ్బంది, దీవెన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# పూల్వామ దాడిలో అమరవీరులకు ఘన నివాళి

**విక్టోరియా మాంటిసోరి స్కూల్ ప్రిన్సిపల్ విక్కీ సింగ్**




**ఎటపాక( మనసులో మాట) ఫిబ్రవరి 14 :**పోలవరం జిల్లా కూనవరం మండలం టేకులబోరు గ్రామంలో ఉన్న విక్టోరియా మాంటిస్సోరి హైస్కూల్ ప్రిన్సిపాల్ సార్ విక్కీ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ మేడం రూబీ సింగ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు ఫిబ్రవరి 14 బ్లాక్ డే సందర్భంగా పుల్వామా దాడిలో అమరవీరులైన మన వీర జవాన్లకు నివాళు అర్పించారు. సందర్భంగా టేకుల బోరు నుండి కూనవరం వరకు ర్యాలీ జరిపారు. తదుపరి పాఠశాల యందు వీర జవానుల యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ డాక్టర్ విక్టోరియా సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు కలిసి ఒక స్కిట్ ప్రదర్శించడం జరిగినది. తదుపరి ప్రిన్సిపాల్ విక్కీ సింగ్ వైస్ ప్రిన్సిపాల్ రూబీ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులకు వీర జవానుల యొక్క ధైర్య సాహసాల గురించి మరియు వారి యొక్క త్యాగాలను గురించి తెలియచేయడం జరిగింది. అలాగే విద్యార్థులు వీర జవాన్ల యొక్క త్యాగాల గురించి మరియు అమరవీరుల యొక్క త్యాగ ఫలితమే మన మనుగడ అని విద్యార్థులు అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విక్టోరియా మాంటిసోరి స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సూక్ష్మ కళాకారుడి అద్భుత సృష్టి....

**అతి చిన్న శివ లింగం రూపకల్పన....కంది బద్ద పరిమాణం...**



**మండపేట (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** మండపేట కు చెందిన సూక్ష్మ కళాకారుడు అద్భుత కళా ఖండాన్ని సృష్టించి అబ్బుర పరిచాడు.అతి చిన్న శివ లింగం ను అత్యంత భక్తి శ్రద్ధ లతో సిద్ధం చేశారు. శివరాత్రి సందర్భంగా ఈ ఆకృతి నీ రూపొందించినట్లు చెప్పారు.తూర్పుగోదావరి జిల్లా మండపేట పట్టణ స్వర్ణకారుడు అండలూరి వీరవెంకట సత్యనారాయణ సూక్ష్మ కళా శిల్పి. ఎన్నో కళా ఖండాలు రూపొందించి పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఈ నేపథ్యంలో శివరాత్రి పురస్కరించుకొని రామేశ్వరంలో శ్రీరాము చే ఇసుక తో తయారు చేసిన సైకత శివలింగం చూసి తాను దాన్ని రూపొందించారు. కంది బద్ద పరిమాణంలో గంగా నది ఇసుకతో గంగాజలన్నీ కలిపి సూక్ష్మ రూప శివలింగాన్ని తయారు చేశారు.గతంలో బంగారం పంచలోహాలు నవరాత్నాల్లో ఒకటైన పచ్చ బియ్యపు గింజ విద్యుత్ బల్బులో ఉండే ఫిల్మెంట్ తో

# మహాశివరాత్రి ఏర్పాట్లు

**శ్రీశ్రీశ్రీ మంగళంబికా సమేత ఆది కుంభేశ్వర స్వామి వారి ఆలయంలో ..**



**కాకినాడ( మనసులో మాట) ఫిబ్రవరి 14 :** కాకినాడ సాగర తీరంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ మంగళంబికా సమేత ఆది కుంభేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని భారత యజ్ఞ పీఠం కమిటీ సభ్యులు భక్తులు స్వయంగా జ్యోతిర్లింగాలకు అభిషేకించుకునే విధంగా ఏర్పాట్లను చేశారు. ఈ ఆది కుంభేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు స్వయంగా అభిషేకం చేసుకోవడం వల్ల వారు తృప్తి చెందే విధంగా ఉంటుందని సభ్యులు అన్నారు మహాశివరాత్రి రోజు తెల్లవారుజాము నుంచి ఈ అభిషేకాలు ప్రారంభమై లింగోద్భవ కాలం వరకు కొనసాగుతాయని అలాగే సాయంకాలం సాగర తీరాన స్వామి వారి ఆలయంలో లక్ష దీపాలంకరణ కూడా ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమాలకి భక్తులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని భారత యజ్ఞపీఠం, కుంబాభిషేకం కుంబాభిషేకం కమిటీ సభ్యులు తెలిపారు

# బాలికల విద్యకు కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ కృషి అభినందనీయం

**జిల్లా కలెక్టర్ షణ్మోహన్**




**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 14 :** కాకినాడ రూరల్ మండలం వాకలపూడి వద్ద ఉన్న కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వచ్చిన గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ ఎంపవర్మెంట్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ మండలంలోని 07 ప్రభుత్వ పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు స్కాలర్షిపులు, 60 మంది విద్యార్థినిలకు సైకిళ్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ కేవలం ఎరువుల తయారీ కంపెనీ మాత్రమే కాదని సమాజాభివృద్ధికి తోడ్పడుతున్న మంచి సంస్థ అన్నారు. ఈ సంస్థ ద్వారా చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు ఇతర కార్పొరేట్ కంపెనీలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. గాల్ చైల్డ్ ఎడ్యుకేషన్ అండ్ ఎంపవర్మెంట్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న అవకాశాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు నిరంతర చదువు పైన దృష్టి పెట్టడం ద్వారా ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు పట్టుదలతో కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. పడాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ చేపడుతున్న కార్యక్రమాలు అవసరతలో ఉన్న ప్రభుత్వ పాఠశాల బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బాలికలు కేవలం ఇంటి పనికి మాత్రమే పరిమితం కాకూడదని ఉద్దేశంతో తమ సంస్థ ద్వారా బాలికల విద్యను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈ సమాజంలో విద్య ఒక్కటే మనలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని బాలికలు ఎన్ని ఇబ్బందులు వచ్చినా చదువును మధ్యలో ఆపేయకుండా పట్టుదలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. కోరమండల్ కాకినాడ యూనిట్ హెడ్ కే జగన్నాథం మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కాకినాడ రూరల్ మండలం ప్రాంతంలోని బాలికల విద్యాభివృద్ధి కోసం "కోరో విద్య " కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున బాలికలు వివిధ ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు.

**కోరమండల్ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్..**

ఇటీవల నూతనంగా ప్రారంభమైన కోరమండల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వైద్యాధికారులతో కలిసి ఈ సందర్భంగా సందర్శించారు. ఆసుపత్రిలోని గైనకాలజీ, ఎన్ఐసియు, చిన్నపిల్లల విభాగం, డెంటల్, ఆర్థోపెడిక్, ఎంఆర్ఐ, స్కానింగ్, ఓపి, ఆపరేషన్ థియేటర్ ఇతర విభాగాలను అందులోని వసతులను పరిశీలించారు. ఓపీ కేవలం రూ.20 కే నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తెలిపారు.కాకినాడ జీజీహెచ్ కు రూ.8 లక్షల విలువైన వైద పరికరాలు కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ అందచేశారు.కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.8 లక్షల విలువైన వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి కు అందజేసారు. ఎస్.పీ.ఎన్ (ఇన్ఫ్యూజన్ పంప్, సిరంజి ఇన్ఫ్యూజన్ పంప్, బై ఫేజిక్ డిఫిబ్రిలేటర్ విత్ ఏ.ఇ.డి) వైద్య పరికరాల పనితీరును ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు వైద్యాధికారులు, కోరమండల్ సిబ్బంది వివరించారు. తొలుత కోరమాండల్ హాస్పిటల్ ప్రాంగణంలో కలెక్టర్ మొక్కను నాటారు. కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, హెచ్ఆర్ జిఎం పి.పద్మనాభం, సి.ఎం.ఓ ప్రమోద్ కుమార్,శకోరమాండల్ ఏ.జి.ఎం (సీఎస్ఆర్) వంశీకృష్ణ, సి.ఎస్.ఓ జి.సాయికృష్ణ, పీఆర్ఓ వి. రవికుమార్ ఇతర అధికారులు, మండల సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో వైసీపీ బలోపేతానికి కార్యాచరణ

- **కడియం మండల పార్టీ శ్రేణుల సమావేశంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 14 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయి నుంచీ బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం మండల పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, మండల పార్టీ అధ్యక్షుడు యాదవుల సతీష్ చంద్ర స్టాలిన్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా చెల్లుబోయిన మాట్లాడుతూ కడియం మండలంలో పార్టీని ప్రతి గ్రామం నుంచీ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామాన్ని కలయ తిరుగుతూ పార్టీని మరింత ముందుకు తీసుకు వెళ్తామని, పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ రోజున ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని, ఏ కార్యకర్త కుటుంబం కూడా ఇబ్బందులు పడకుండా వారి తరపున ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా చెల్లించే విధంగా ఒక నూతన పథకాన్ని ప్రవేశపెట్టా రన్నారు. దీని ద్వారా ప్రతి కుటుం బానికి అండగా పార్టీ ఉంటుందని భరోసా కల్పించడమే ఆయన ఉద్దేశం అన్నారు. సంస్థగతంగా పార్టీని బలోపేతం చేసి 2029 ఎన్నికల లక్ష్యంగా ఈ రోజు నుంచి ప్రతి కార్యకర్త నడుం బిగించి పనిచేయాలని చెల్లుబోయిన కోరారు. ఈ సమావేశంలో వెలుగుబంటి అచ్యుత రామయ్య, తాడాల చక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, విప్పర్తి ఫణి, ఈలి గోపాలం, ఊటుకూరి శైలజ, నామాల సరోజిని, అయినవిల్లి వెంకటేశ్వరరావు, గారపాటి బుజ్జిబాబు, సాపిరెడ్డి సూరిబాబు, గంగారావు, ఆకుల సుధాకర్, నాగిరెడ్డి మోహన్,వబుడ్డిగ పండు, చింతపర్తి చిట్టిబాబు, చింతపర్తి రాంబాబు, నరమామిడి గణేష్, టీవీ రాంబాబు, రత్నం కృష్ణ, గాదె రామకృష్ణ, టికి శ్రీను, అయినవిల్లి ప్రసాద్, మార్గాన్ని బలరాం, దాసరి శ్రీను, బైరవ నాగేశ్వరరావు, సర్కార్ భాష, పున్నమిరాజు వీర్రాజు, చిలుకూరి రామకృష్ణ, బత్తిన శ్రీధర్, కొప్పాక రమణ, బోడపాటి సత్తిబాబు, సాకా సతీష్, సాపిరెడ్డి కామేష్, పోరాటి శీను, గుత్తుల రమేష్, సాకా కిరణ్,గాద సాయి, రాణా హరీశ్చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కపిలేశ్వరపురం మండలంలో మహాశివరాత్రి కి ఏర్పాట్లు పూర్తి



**కపిలేశ్వరపురం (మనసులో మాట )ఫిబ్రవరి 14 :**మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తుల రాకకు సిద్ధమయ్యాయి. శైవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ఈ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మండలంలోని అంగర, వల్లూరు, టేకి, కోరుమిల్లి, పడమర ఖండ్రిగ లోని పురాణ ప్రాషస్త్యం గల ఉయ్యాలా జంపాల, కపిలేశ్వరపురం లోని దుర్గా మాత, పార్వతీ మాతా సమేత శ్రీ ఆగస్తేశ్వర, పాప వినాసేశ్వర స్వామి వారి ఆలయలు తదితర గ్రామాల ఆలయాల్లో శుభ్రతా కార్యక్రమాలు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులు సౌకర్యంగా స్వామివారి దర్శనం చేసుకునేలా క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. శివరాత్రి రోజు రాత్రి జాగరణ, లింగాభిషేకాలు, రుద్రాభిషేకాలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా పోలీసు సిబ్బంది సహకారంతో తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ-స్థులు, యువకులు, మహిళా సంఘాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండటం విశేషం. ఏడాది కోసారి వచ్చే ఆది దేవుడు మహాశివుని మహా శివరాత్రి ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, శివనామ స్మరణతో మండలం మొత్తం భక్తిరసంలో మునిగిపోయింది.మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, రాత్రంతా జాగరణ చేసి, "ఓం నమః శివాయ" నామస్మరణతో పరమేశ్వరుని కృపాకటాక్షాలు పొందాలని కోరుకుంటున్నారు.

# దామోదర సంజీవయ్య జీవిత విధానం స్ఫూర్తిదాయకం

**కలెక్టర్ షణ్మోహన్ సగిలి**



**కాకినాడ,(మనసులో మాట) ఫిబ్రవరి 14 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నిరాడంబరత, నిజాయితీ, విలువలతో కూడిన పరిపాలన అందించిన దామోదర సంజీవయ్య జీవిత విధానం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శనివారం కాకినాడ జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో దామోదరం సంజీవయ్య 105వ జయంతోత్సవం ఘనంగా జరిగింది. సంజీవయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఆయన చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. ఒక సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించిన దామోదర సంజీవయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా విశేషమైన సేవలు అందిం చారన్నారు. ఆయనలోని సేవా దృక్పథం, ఉన్నత వ్యక్తిత్వం, మేధా సంపత్తి, రాజనీతిజ్ఞత అనతి కాలంలోనే ఆయనను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లా యన్నారు. ప్రభుత్వ సంస్థల నిర్మాణంలో, పలు సంక్షేమ పథకాల అమలు, అనేక నూతన సంస్కరణలకు నాంది పలకడంలో దామోదరం సంజీవయ్య కీలక పాత్ర పోషించారన్నారు. నిజాయితీ, నిరాడంబరత, విలువలకు కట్టుబడి పనిచేసిన ఆయన జీవన ప్రస్థానం నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం పర్యవేక్షకులు పి.దొర, సీనియర్ అసిస్టెంట్ డి.ప్రసాద్, కుసుమ ఆనంద్, శ్రీను ప్రసాద్ సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఇంచార్జి ఎం.ప్రసాదబాబు, వసతి గృహం సంక్షేమ అధికారులు లోవరాజు, బాబుప్రసాద్, ఉషారాణి, సుదర్శన, రాజేశ్వరి, నాగమణి, కళ్యాణి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం దిశగా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్

- జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ఛార్జ్ సూర్యచంద్ర



**నర్సీపట్నం: ఫిబ్రవరి 14 (మనసులో మాట) :** ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేస్తున్నారని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ఛార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు. నర్సీపట్నంలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. పవన్ కళ్యాణ్ రెండేళ్ల పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. 10వేల మందికి పైగా పంచాయతీ ఉద్యోగులకు పదోన్నతలు కల్పించడం, గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరడటం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు ఎంతో మేలు చేస్తున్నారని అన్నారు. పల్లెల్లో మౌలిక సదుపాయల కల్పనకు, స్వచ్ఛమైన తాగునీటి। సరఫరాకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు సద్వినియోగానికి చర్యలు చేపట్టారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్వగా నిర్వీర్యం చేశారని, కానీ పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అటువంటి వ్యవస్థను బలోపేతం దిశగా చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామసభ నిర్వహణలో ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. జాతీయ ఉపాధి హామీ నిధులతో అడవి తల్లి బాట పేరుతో 625 గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ 1005 కోట్ల వ్యయంతో 1069కిలో మీటర్ల రహదారుల నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఇలా రాష్ట్రంలో గ్రామీణ రహదారులకు జీవం పోశారని కొనియాడారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని రోడ్లకు భారీగా నిధులు ఇచ్చారని, ఇటీవల నియోజకవర్గంలోని 29 రహదారులకు రూ.22కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శిలు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాలాదుల ప్రసాద్ బాబు దేవి, మాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, గోల్కొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మాఫియాను పెంచి పోషిస్తున్న కూటమి ప్రభుత్వం




## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి కామేశ్వరరావు

**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట):ఫిబ్రవరి 14:** రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిపోతున్నటువంటి డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని డ్రగ్స్ మాఫియా పేరుతో పేద ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నటువంటి ఫార్మా కంపెనీలను సీజ్ చేసి ప్రభుత్వమే డ్రగ్స్ సప్లై చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు డిమాండ్ చేసార. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం విజయనగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పి. కామేశ్వరరావు మీడియా లో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, విజయనగరం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ హాస్పటల్స్ యాజమాన్యాలు సమూహంగా ఏర్పడి పేద ప్రజలను దోచుకుంటున్నటువంటి హాస్పటలపై జిల్లా స్థాయి వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో ప్రైవేట్ హాస్పిటల్ల సమూహ దోపిడీపై డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు దాడులు నిర్వహించాలి. విచ్చలవిడిగా డ్రగ్స్ పేరుతో పేద ప్రజలను దోచుకుంటున్న ఫార్మ కంపెనీలను సీజ్ చేయాలి అనుమతులు ఒకరివి-డ్రగ్స్ అమ్మేది ఒకరు-చర్యలు శున్యం. జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నటువంటి మెడికల్ షాపులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.సిపిఐ జిల్లా విజయనగరం కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ అధిక ధరలకు డ్రగ్స్ ను అమ్ముతు పేద ప్రజలను మోసం చేస్తున్న ఫార్మ కంపెనీలను రద్దు చేసి ప్రభుత్వమే డ్రగ్స్ ను సప్లై చేయాలి. విజయనగరం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ హాస్పటల్స్ దోపిడీపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలంఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి లు బుగత అశోక, అలమండ ఆనందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. రంగరాజు, ఎన్. నాగభూషణం, ఉల్లాకుల నీలకంటేశ్వర్ యాదవ్, కె. భీముడు, పురం అప్పారావు, బుగత పావని మరియు ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు, జిల్లా ఉపాధ్యక్షుడు వెలగాడ రాజేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి. గౌరీశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.చరణ్, విజయనగరం నియోజకవర్గ పార్టీ సమితి సభ్యులు ఎ. రాములు మరియు సిపిఐ, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సిపిఐ శాఖ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ ఫ్లెక్సీ అపహరణపై మండల అధ్యక్షురాలి ఆగ్రహం

- రాజకీయ అసూయతో కుట్రపూరిత చర్యలు
- అవుగడ్డ సత్యవేణి(నాయుడమ్మ)



**దేవరాపల్లి, ఫిబ్రవరి 14, (మనసులో మాట) :** మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన పార్టీ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోవడంపై బీజేపీ మండల అధ్యక్షురాలు అవుగడ్డ సత్యవేణి (నాయుడమ్మ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పిరికి బంధ చర్య అని పేర్కొంటూ, రాజకీయంగా పార్టీ ఎదుగుదలను ఓర్వలేని కొందరు వ్యక్తులు కుట్రపూరితంగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని తెలిపారు. స్వంత నిధులతో మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, కార్యకర్తల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పని చేస్తున్నానని వివరించారు. దేశవ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని పొందిన బీజేపీ వంటి జాతీయ పార్టీ ప్రతిష్టను ఇలాంటి చర్యలతో దెబ్బతీయాలని ప్రయత్నించినా సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇటువంటి బెదిరింపులు, అడ్డంకులు తమ ధైర్యాన్ని తగ్గించలేవని, మరింత సంకల్పంతో పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఇకనైనా ఇలాంటి అసహ్యకర చర్యలకు పాల్పడకుండా సంబంధిత వ్యక్తులు మానుకోవాలని హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె హితవు పలికారు. మండలంలో పార్టీ బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమని, కార్యకర్తలతో కలిసి ప్రజాసేవలో ముందుండి పనిచేస్తానని అవగడ్డ సత్యవేణి స్పష్టం చేశారు.

# అసలుసభని వదిలేసి కోసరుసభలో గోలెందుకు జగన్!!




## జగన్మోహన్ రెడ్డి నిర్ణయాన్ని తప్పుపట్టిన భీశెట్టి


**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి:(మనసులోమాట): ఫిబ్రవరి:14::** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న కీలకమైన ప్రజాసమస్యలపై గళం విప్పి ప్రభుత్వం పై వత్తిడి తేవలసిన సమయంలో రాష్ట్ర శాసనసభకు హాజరు కాకుండా శాసన మండలిలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పార్టీ ఎమ్మెల్సీలకు ఆదేశాలు ఇవ్వడం విచిత్రంగా ఉందని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అసలు సభని వదిలేసి కోసరు సభలో గోల చేస్తే ఫలితాలు ఉండవనే విషయం జగన్మోహన్ రెడ్డి కి తెలియదా అని ఎద్దేవా చేశారు, రాష్ట్రాల్లో అసెంబ్లీ సమావేశాలు, జాతీయ స్థాయి-ంలో పార్లమెంట్ సమావేశాల పైనే ప్రజల దృష్టి ఉఒంటుందని, మండలిలో సంఖ్యాబలం ఉంది కాబట్టి గట్టిగా గొంతు విప్పండి అని చెపుతున్న జగన్ శాసనసభ లో తగిన బలం లేదని ఒప్పుకున్నట్టే కదా, మరి అటువంటప్పుడు ప్రతిపక్ష హోదా అంశంపై ఎందుకు రాద్ధాంతం చేసి అదే సాకుతో సభకి వెళ్లకుండా సమయాన్ని వృథా చేస్తున్నారని ప్రశ్నించారు,జగన్మోహన్ రెడ్డి కి ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల పూర్తిస్థాయిలో చిత్త శుద్ది ఉంటే కూటమి ప్రభుత్వం లో పరిపాలన స్కాముల మాయం అనుకుంటే తన పార్టీ నుండి గెలిచి 11 మంది ఎమ్మెల్యేలతో శాసనసభ సమావేశాల్లో పాల్గొని ప్రజల తరపున మాట్లాడాలని, రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో జరుగుతున్న పరిణామాలను ప్రజలు,ప్రజాస్వామ్య వాదులు నిత్యం పరిశీలిస్తారని అసెంబ్లీ సమావేశాల విషయం లో జగన్మోహన్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు.సభ బయట ఉండి మాట్లాడితే అసెంబ్లీ కి ఎన్నికయిన వారికీ ఎన్నిక కానివారికీ తేడా ఏమిటి ఉంటుందని జగన్మోహన్ రెడ్డి కి రాజకీయ భవిష్యత్తు కావాలంటే రాష్ట్ర శాసనసభ లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో లోక్ సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం, నగర అధ్యక్షుడు తాత్రాజు రాజారావు, సీనియర్ నాయకులు పతివాడ చంద్రరావు,బోర రమేష్ జిల్లా పౌర వేదిక వర్కింగ్ అధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు,ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు,ఉపాధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 15 న అనకాపల్లి లో పద్యపఠనం, తల్లికి లేఖ, వక్తృత్వ పోటీలు

**అనకాపల్లి, ఫిబ్రవరి 14 (మనసు లో మాట):** అనకాపల్లి రింగ్ రోడ్డు లోని డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కాలేజీ లో ఈనెల 15 న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా అనకాపల్లి రోటరీ క్లబ్, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త అధ్వర్యంలో విద్యార్దిని, విద్యార్థులకు పద్యపఠనం, తల్లి కి లేఖ, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అర్గనైజర్ కె. రామ్మోహన్ రావు, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బి. శ్రీనివాసరావు, కె. వి. పి. ఎస్ ప్రకాశరావు, రోటిరీయన్ బి. సర్వారావు ఒక ప్రకటన లో తెలిపారు. 6,7,8 తరగతుల (సబ్ జూనియర్స్) విద్యార్థులకు పద్యపఠనం, తల్లికి లేఖ పోటీలు, 9,10, ఇంటర్, ఆపై (జూనియర్స్) విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటితో పాటు ప్రోత్సహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. విజేతలైన విద్యార్థులకు ఈనెల 21 న కశింకోట శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల లో బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వారు తెలియజేశారు. అసక్తి ఉన్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనాలని వారు కోరుతున్నారు.

# నేడు వెంకుపాలెంలో బాల పేరంటాలు లక్ష్మీ తల్లి తీర్థం

**పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు**



**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):** ఆదివారం అనకాపల్లి మండలం, వెంకీ పాలెం గ్రామంలో వెలసిన బాల పేరంటాలు లక్ష్మి అమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ, గ్రామస్తులు ఏర్పాటు చేశారు. బాల పేరంటాలు శ్రీ లక్ష్మి అమ్మ తల్లి 49వ తీర్థ మహోత్సవము ఆదివారం అతి వైభోగం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. లక్ష్మి అమ్మ నీ నామం బ్రహ్మానందం- నీ నామం విన్నవారికి పరమానంద0-నీ పలుకులు ఉన్నవారికి నిత్యానందం అను మృదు మధుర నామముతో ప్రతిరోజు భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుండి శ్రీ అమ్మవారిని దర్శనం, ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదములు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగును. సాయంత్రం డాన్స్ బేబీ డాన్స్, రేలా- రే-రేలా మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు కూడా ఉంటాయని తెలియజేశారు. అలాగే సోమవారం నుండి మంగళవారం వరకు సాయంత్రం 5 గంటల నుండి గ్రామస్థాయి షటిల్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించబడును. అలాగే సాయంత్రం 7 గంటల నుంచి అమ్మవారి గుడి వద్ద దీపారాధన కార్యక్రమం జరగబడును. అదే రోజు రాత్రి 9 గంటల నుంచి భారీ ఎత్తున బాణాసంచా వెలుగులు ఉంటాయన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

**గొలుగొండ, ఫిబ్రవరి 14,(మనసులో మాట):** గొలుగొండ మండలం, సాలిక మల్లవరం పంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సుర్ల వీరలక్ష్మి ( 38)భర్త సుర్ల కొండలరావు గారితో కలిసి ఈ నెల 6వ తేదీన బైక్‌పై ఎర్రవరం రాజులుబాబు గుడి నుండి జోగంపేట వైపు ప్రయాణిస్తుండగా కొత్త జోగంపేట సమీపంలో రహదారిలో ఉన్న గోతిలో బైక్ పడిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో సుర్ల వీరలక్ష్మి బైక్‌పై నుండి రోడ్డుపై పడిపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు ఆమెను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని కేజీహెచ్ కు రిఫర్ చేశారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సుర్ల వీరలక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించబడింది. మృతదేహాన్ని కేజీహెచ్‌లో పోస్ట్‌మార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

# నర్సీపట్నంలో ఎస్ ఎం వి క్రికెట్ అకాడమీ ప్రారంభం



**నర్సీపట్నం, ఫిబ్రవరి 14, ( మనసులో మాట) :** పట్టణంలోని శారదానగర్ లో దస్తగిరి సారధ్యంలో నడపనున్న ఎస్ ఎం వి క్రికెట్ అకాడమీని వివేకానంద కాలేజీ డైరెక్టర్, 21వ వార్డ్ టీడీపీ నాయకులు అప్పన సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పన సురేష్ మాట్లాడుతూ, క్రీడాకారుల కలలను నిజం చేయడానికి, ముఖ్యంగా స్థానిక ప్రతిభను ప్రోత్సహించడానికి క్రికెట్ అకాడమీ ప్రారంభం ఒక గొప్ప అడుగు అన్నారు. నాణ్యమైన కోచింగ్, నెట్ ప్రాక్టీస్ సౌకర్యాలు మరియు క్రమశిక్షణతో కూడిన శిక్షణ ద్వారా, చిన్న స్థాయి నుండి కూడా జాతీయ స్థాయి ఆటగాళ్లను తయారు చేయవచ్చున్నారు. అకాడమీలు యువ ఆటగాళ్లకు మంచి వాతావరణాన్ని అందించాలని, అకాడమీ విజయవంతంగా నడవాలని సురేష్ ఆకాంక్షించారు.

# ధర్మవరం ఉపాధి కూలీలుకు పనికల్పించాలి-సిపిఎం



**ఎస్. రాయవరం, ఫిబ్రవరి 14,(మనసులో మాట) :** ఎస్. రాయవరంమండలం ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన వ్యవసాయకూలీలుకు చేయాడానికి వ్యవసాయ పనులు లేకపోవటంతో ఆదాయంలేక ఇబ్బందులు పడుతున్నారని, వారందరికి ఉపాధి పనులు కల్పించాలని సిపిఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పల రాజు కోరారు. వ్యవసాయకూలీల పరిస్థితిని అర్ధంచేసుకుని వారందరికీ పనీకల్పించాలని విబిజీరామ్ పథకం ఎపిఓకు వ్రాసిన లేఖలో అప్పలరాజు విజ్ఞప్తి చేసారు.

# ఘనంగా దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు



**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 మనసులో మాట :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి, నిరాడంబరతకు మారుపేరు కీ.శే. దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. కశింకోట ఎస్.హెచ్.ఓ స్వామి నాయుడు సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య సేవలను గుర్తుచేసుకున్నారు.తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, ఏపీ రెండో ముఖ్యమంత్రిగా సంజీవయ్య చిరస్మరణీయులు అన్నారు.అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిది అని తెలిపారు. 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా పెద్దపాడులో జన్మించిన ఆయన, రాజకీయాల్లోనే కాకుండా సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించారు.సమాజం కోసం అంకితభావంతో పనిచేసిన ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడవడం మనందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 306 శివలింగాలతో రుద్రాభిషేకం



**కోటవురట్ల (మనసులో మాట) ఫిబ్రవరి 14** కోటవురట్ల మండలం పాములవాక పట్టాలమ్మ తల్లి ఆలయంలో శివరాత్రి మహా పర్వదినం సందర్భంగా ఈనెల 15వ తేదీన 306 శివలింగాలతో రుద్రాభిషేకం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి రుద్రాభిషేకాలు ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.వీ. రమణ, పీఏసీఎస్ చైర్మన్ వేచలపు జనార్ధన్ తెలిపారు. రాత్రి జాగరణ చేసే భక్తుల కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఎండపల్లి,కోటవురట్ల వద్ద వరాహ నదిలో భక్తులు రేపు వేకువజామున పుణ్య స్థానాలు ఆచరించనున్నారు.ఈ నేపథ్యంలో ఎండపల్లి వరాహనది వద్ద భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రక్షణ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇది ప్రమాదకరమైన రేవుగా పలువురు పేర్కొన్నారు. గతంలో ఇక్కడ స్నానాలు చేస్తూ ఒకరిద్దరూ మృతి చెందారని తెలిపారు. దీనిపై స్థానిక ఎస్సై రమేష్ మాట్లాడుతూ ఎండపల్లి, కోటవురట్ల పాములవాక వద్ద కానిస్టేబుల్స్ ను నియమిస్తున్నామన్నారు.

# ఏపీ ఈ ఎం జె ఏ డైరీ ఆవిష్కరణ



**నర్సీపట్నం, ఫిబ్రవరి 14, (మనసులో మాట ) :** ఏపీ ఈ ఎం జే ఏ ఎలక్ట్రానిక్ మీడియా నూతన సంవత్సర డైరీ లను టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ గఫూర్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. రేవతమ్మ లు ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఏపీ యూ డబ్ల్యూ జె రాష్ట్ర కార్యదర్శి సి హెచ్ బి ఎల్ స్వామి, ఏపీ ఈ ఎం జె ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల కిషోర్, ఎలక్ట్రానిక్ మీడియా టౌన్ ప్రెసిడెంట్ ఎన్.విజయ్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బి.బాబ్జి టౌన్ పాత్రికేయులు పాల్గొన్నారు.

# కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కృష్ణ బాధ్యతలు స్వీకరణ...



**కె కోటపాడు, ఫిబ్రవరి 14( మనసులో మాట :** కె. కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కె.కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన పైడుపునాయుడు బదిలీపై వెళ్లడంతో కృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కోటపాడు సర్కిల్ పోలీస్ స్టేషన్లలో ఎలాంటి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలను తావు లేకుండా చూస్తానని అన్నారు. మీ గ్రామాల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన పోలీసులకు తెలియజేసి మీ వంతు సహకారాన్ని అందిస్తారని ఆయన కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసులు ప్రజలకు సేవలు అందిస్తారని సి ఐ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మండలం ప్రజలు ప్రజాప్రతినిధులు ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# సిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం



**పాయకరావుపేట ఫిబ్రవరి 14 మనసులో మాట :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ రోడ్ల అభివృద్ధి లో భాగంగా పాయకరావుపేట పట్టణంలో ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో సిమెంట్ రోడ్ నిర్మాణం చేపట్టారు.ఈ సందర్భంగా శనివారం పాయకరావుపేట పట్టణంలో సీసీ రోడ్ నిర్మాణానికి పనులు మొదలు పెట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాయకరావుపేట పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు ఆచంట దొరబాబు, పాయకరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రి బాబురావు,జనసేన పార్టీ మండల కార్యదర్శి శివలంక నాగమల్లి,జనసేన పార్టీ వీరమహిళ గీసాల పద్మ,జన సైనికులు సాదు శ్రీను రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ఎన్నికలకు మించి బార్ కౌన్సిల్ ఎన్నికలు

- **తాయిలాలతో ఓటర్లను ఆకట్టుకున్న పోటీదారులు పోటా పోటీగా అభ్యర్థుల ఎన్నికల ప్రచారం**



**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):** అనకాపల్లి న్యాయస్థానముల భవన సముదాయంలో జరిగిన బార్ కౌన్సిల్ ఎన్నికలు రాజకీయ నాయకులు పోటీ చేసే ఎన్నికల మాదిరిగా, తాయిలాలతో ఓటర్లను ఆకట్టుకునే పద్ధతిలో శుక్రవారం జరిగాయి. పూర్వం ఈ ఎన్నికలపై పెద్దగా ఆసక్తి ఎవరు చూపేవారు కాదు. కారణం నిధులు ఊసే ఉండేది కాదు. ఎవరికైనా కష్టం వస్తే తోటి న్యాయవాదులే చందాలు వేసుకొని, నిధులు సేకరించి సహకరించుకునేవారు.గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించింది. దీంతో ఒక్కసారిగా బార్ కౌన్సిల్ ఎన్నికల స్వరూపమే మారిపోయింది. ఎన్నికైన రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసే వెసులుబాటు కలవడంతో విలువ, హోదా పెరగడంతో పదవులకు డిమాండ్ పెరిగింది. కూటమి ప్రభుత్వం కూడా నిధులు కేటాయించడం విశేషం. ప్రతి అయిదేళ్లకు జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల బార్ కౌన్సెల్ ఎన్నికలు, 13 న ఆయా కోర్టుల పరిధిలో ఉండే బార్ అసోసియేషన్స్ లో, ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికలలో రాజకీయపార్టీలకు సంబంధం లేకుండా జరిగినప్పటికీ, వైసిపి బలపరచిన అభ్యర్థులుగా కొంతమంది చలామణి అవుతూ, ప్రచారం చేసుకుంటూ ఓట్లను అభ్యర్థించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 143మంది పోటీ చేయగా, విశాఖపట్నం ఉమ్మడి జిల్లానుండి సుమారుగా 26మంది అభ్యర్థులు భరిలో నిలిచారు. పాల్గొన్న ఓటర్లను బట్టి ఎంతమంది మెంబర్లు పాలక వర్గంలో ఉంటారు అనేది నిర్ణయిస్తారు. గరిష్టంగా 25 మంది మెంబర్లు ఈ ఎన్నిక నుండి ఎన్నిక కాబడాల్సి ఉంది. ఎన్నికయిన మెంబర్ల నుండి అధ్యక్ష కార్యదర్శులు, ఇతర పాలక వర్గంను ఎన్నుకోవడం జరుగుతుంది. ఇంతమొత్తంలో అభ్యర్థులు పోటీ చేయడం, ప్రచార ఆర్భాటాలు, ప్రలోభాలు, వంటివి గతంలో ఎన్నడూ జరగలేదని తోటి న్యాయవాదులే పెదవిరుస్తున్నారు. ఎన్నికల నిర్వహణ సుప్రీమ్ కోర్టువారి పర్యవేక్షణలో ఆయా జిల్లాల పోర్ట్-ఫోలియో హై కోర్ట్ జడ్జిల సారధ్యంలో, ఆయా కోర్టుల పరిధిలో ఉండే పాలకవర్గం ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహించడం జరుగుతుంది. అనకాపల్లి న్యాయవాదుల సంఘం ఆద్వర్యంలో కూడా నిన్న జరిగిన ఎన్నికలలో అత్యదిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానికులు ఎవరు పోటీలలో లేకపోవడం ప్రత్యేకత సంతరించుకుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల మాదిరి ఈ ఎన్నికలు కూడా మొదటి, రెండు, మూడు వగైరా ప్రాధాన్యతల ఓట్లను ఆయా అభ్యర్థులకు ఓటర్లు సూచించవచ్చు. కనిష్టంగా అయిదు ప్రాధాన్యతలు, ఘరిష్టంగా ఇరవై మూడు ప్రాధాన్యతలు ఇవ్వవచ్చును. అనకాపల్లి పరిధిలో న్యాయవాదుల సంఘ అద్యక్షులు పిళ్ళా హరశ్రినివసరావు, ఉపాధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, సహాయ ఎన్నికల అధికారులుగా బుద్ధ బలరాం, కామేశ్వర రావు తదితరులు ఎన్నికలను సక్రమంగా నిర్వహించారు. ఈ ఎన్నికలు కూడా సీసీ కెమెరాల నీడలో జరిగాయి. రాజకీయ నాయకులు పోటీ చేసే సాధారణ ఎన్నికలకు మించి ఓటర్లకు తాయిలాలు, ఇతర ఏర్పాట్లు వగైరాలు ఏర్పాటు చేసి ఓటర్లను ఆకట్టుకోవడం కొసమెరుపు. ఎలాగైతేనేమి ప్రభుత్వాల పుణ్యమా అని బార్ కౌన్సిల్ ఎన్నికలు తీరు మారిందని సీనియర్ న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అంబులెన్స్ పైలట్లకు (డ్రైవర్లు) జీతాలు పెంచిన ప్రభుత్వం

**హర్షం వ్యక్తం చేసిన పైలెట్లు (డ్రైవర్లు)**



**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):** కూటమి ప్రభుత్వం 2వేలు రూపాయలు జీతం పెంచడంతో ఆంధ్ర ప్రదేశ్ 108 అంబులెన్స్ సర్వీస్ పైలట్లు (డ్రైవర్లు) హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2 వేలు జీతం పెంచడం తోపాటు, ఐదు నుంచి పది సంవత్సరాలు సర్వీస్ ఉన్న సిబ్బందికి ఆటోమేటిక్ గా స్లాబ్ వర్తించడం నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అభినందిస్తూ ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తూ యూనియన్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. సందర్భంగా జిల్లా కోశాధికారి పీలా కోటేశ్వరావు మాట్లాడుతూ అతి తక్కువ జీతాలతో సతమతమవుతున్న అంబులెన్స్ పైలెట్స్ (డ్రైవర్లు) కు 2వేలు పెంచి మా కుటుం బాలలో ఆనందం కలిగిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేశారన్నారు. భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు తరగకపో వడంతో కుటుంబాలు ఇబ్బందులు పడేవారమన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు మరింత సమర్ధవం తంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ శ్రీనివాసరావు, ఆకుల నారాయణరావు, జాగు విష్ణు మణికుమార్, వి అప్పలరాజు, ఎస్ సీతారాం, నారపల్లి సూరిబాబు, కరణం సూరిబాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చలన చిత్ర గాయకులు ఎస్.పి బాలు మధుర గీతాల నూతన ముద్రణ పుస్తకం

**మాజీ ఎంపీ డాక్టర్ బి.వి సత్యవతి చే అవిష్కరణ**



**అనకాపల్లి, ఫిబ్రవరి 14 (మనసు లో మాట) :** అనకాపల్లి వివేకానందనగర్ లోని మాజీ ఎంపీ డాక్టర్ బి.వి సత్యవతి క్యాంపు కార్యాలయం లో శనివారం ప్రపంచ చలన చిత్ర దినోత్సవం సందర్భంగా ప్రముఖ చలన చిత్ర గాయకులు ఎస్.పి బాలసుబ్రమణ్యం గానం చేసిన అణిముత్యాల లాంటి తెలుగు సినీ మధుర గీతాల నూతన ముద్రణ పుస్తకాన్ని అమె అవిష్కరించడం జరిగింది. అనకాపల్లి కి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయులు కోట సూర్యనారాయణ శాస్త్రి అవిరళ కృషి తో ఎస్. పి బాలసుబ్రమణ్యం గానం చేసిన 48 వేల పాటలలో అణిముత్యాల లాంటి 567 తెలుగు సినీ మధుర గీతాల పుస్తకాన్ని ముద్రించడం జరిగింది. ఈ పుస్తకాన్ని మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి మాట్రాడుతూ తెలుగు సినీ గాయకులు, పద్మవిభూషణ్, ఎస్.పి బాలు అభిమాని సూర్యనారాయణ శాస్త్రి ఎంతో వ్యయ ప్రయాసలతో పుస్తకాన్ని ముద్రణ చేయించడం అభిన ఓందనీయమన్నారు. ఈ పుస్తకాన్ని గాయకులు వినియోగించు కోవాలని అమె కోరారు. అనంతరం పుస్తక పరిచయకర్త కోట సూర్యనా రాయణ శాస్త్రి మాష్టారు, మాజీ ఎంపీ.డాక్టర్ బి.వి.సత్యవతి ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు తెలుగు సినీ మధుర గాయకులు ఎస్.పి బాలు మధుర గీతాల పుస్తకాన్ని ముద్రణ చేయించిన కోట సూర్యనారాయణ శాస్రి కి పలువురు గాయకులు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో సిద్దార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, సిద్దార్ధ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రొబ్బిమల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, అయ్యగారు వెంకట రమణమూర్తి, బెన్నాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి సందర్భంగా పలు దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తీ



విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.

**ఉత్తరాంధ్ర, ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట ):ఫిబ్రవరి 14::** మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15న రామతీర్థం, పుణ్యగిరి మరియు సంగం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ శనివారం తెలిపారు. వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా పలు శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైను మెయింటేన్ చేసేందుకు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల పిఎస్ పరిధిలోని రామతీర్థం, ఎస్. కోట పిఎస్ పరిధిలోగల పుణ్యగిరి, వంగర పిఎస్ పరిధిలోగల సంగంలోగల దేవాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా దేవాలయాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు విధులు నిర్వహించేందుకు 1000 మందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. అదే విధంగా సేవాదళ్ పేరుతొ కొంతమంది సిబ్బందిని కూడా ప్రత్యేకంగా నియమించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నదులు, కాలువలు, కోనేరు, సముద్ర స్థానాలు చేసే సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, జలాశయాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జలాశయాలు వద్ద పుణ్య స్నానాలు చేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామన్నారు. ప్రధాన ఆలయాల వద్ద తాత్కాలికంగా పోలీసు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఎవరికైనా ఏదైనా సమస్య వచ్చినట్లయితే వారు వెంటనే పోలీసు కంట్రోల్ రూంను సంప్రదించి, పోలీసుల సహాయాన్ని పొందాలన్నారు. అదే విధంగా అన్ని ఆలయాలవద్ద సీసీ కెమెరాలు, లైటింగు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పుణ్య స్నానాలు చేసే సమయంలోను, కొండలు ఎక్కే సమయంలోను, దైవ దర్శనాలకు వెళ్ళే సమయంలో మహిళలు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారిని ఎట్టి పరిస్థితుల్లోను ఒంటరిగా విడిచిపెట్టవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విలువైన బంగారు నగలను వేసుకొని దర్శనాలకు రావద్దని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ విజ్ఞప్తి చేసారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని, పార్కింగు ప్రాంతాలను ఏర్పాటు చేసామని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సూచనలు చేసేందుకు అవసరమైన చోట్ల పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్ ను వినియోగించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. వీటితోపాటు జిల్లాలో పలు శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు. దొంగతనాలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

**మహా శివరాత్రి సందర్భంగా 1000 మందితో పోలీసు బందోబస్తు**

మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని పలు దేవాలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 1000 మందితో భద్రతా ఏర్పాట్లు చేసామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. విజయనగరం జిల్లా లో రామతీర్థం (నెల్లిమర్ల), పుణ్యగిరి (ఎస్.కోట), సంగం (వంగర)లో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు నలుగురు డిఎస్పీలు, 16మంది సిఐలు, 55 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు, 160 మంది ఎఎస్ఐలు, హెచ్సీలు, 500 మంది కానిస్టేబుళ్ళు, 140 మంది హోంగార్డులు, 40 మంది ఎస్టీఎఫ్ సిబ్బంది, ఎన్.సి.సి. కేడేట్లు మరియు ఎంఎస్పీలు బందోబస్తు నిర్వహణలో పాల్గొననున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# రూ. 30 లక్షల విలువైన గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

## వివరాలు వెల్లడించిన డిఎస్పి శ్రీనివాసరావు

**మాకవరపాలెం, ఫిబ్రవరి 14, ( మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి జంక్షన్ వద్ద ముందుగా అందిన సమాచారంతో మినీ వ్యాన్ లో తరలిస్తున్న 60 కిలోల గంజాయిని మాకవం-పాలెం పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. దీనికి సంబంధించి శనివారం మాకవరపాలెం పోలీస్ స్టేషన్లో నర్సీపట్నం డిఎస్పి పి శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర్ లకు ముందుగా అందిన సమాచారం మేరకు సిఐ ఆధ్వర్యంలో ఎస్సై తన సిబ్బందితో రాచపల్లి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కే ఏ 04 ఏ ఎఫ్ 0946 నెంబర్ గల అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ ను తనిఖీ చేయగా మూడు గోనె సంచుల్లో తరలిస్తున్న 60 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ ఘటనలో కర్ణాటక




రాష్ట్రం బెంగళూరుకు చెందిన రహీం షరీఫ్ (29) ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుండి గంజాయితో పాటు, మినీ వ్యాన్, ఒక మొబైల్ ఫోన్, రూ. 500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంఘటనలో మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేశామని, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు. ఒరిస్సాలోని పాడువా గ్రామంలో గంజాయిని కొనుగోలు చేసి, అరకు, నర్సీపట్నం, తాళ్లపాలెం మీదుగా బెంగళూరు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ సంఘటనలో పట్టుబడిన గంజాయి విలువ రూ. 30 లక్షలు ఉంటుందని, వాహనం విలువ రూ. 15 లక్షలతో కలిపి రూ. 45 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిని కోర్టులో హాజరు పరుస్తున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని డిఎస్పి తెలిపారు. గంజాయి రవాణాను ఉక్కుపాదంతో అనిచివేస్తామని, రవాణా దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిన బడ్జెట్

## జనసేన నాయకులు అవనాపు విక్రమ్

**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి:(మనసులోమాట): ఫిబ్రవరి:14** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సమగ్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు జనసేన పార్టీ నాయకులు అవనాపు విక్రమ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చినందున ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్ర వృద్ధిని నిర్ధారిస్తుందని ఆయన పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం నేపథ్యంలో రోడ్లు, ఓడరేవులు మరియు విమానాశ్రయాల అభివృద్ధికి రూ.13,546 కోట్లు కేటాయించడం విజయనగరం జిల్లాకు కూడా ప్రయోజనం చేకూరుస్తుం దని ఆయన అన్నారు. ఇటీవల ఎం.జి.ఎన్ ఆర్.ఇ.జి. ఏపథకం స్థానంలో ప్రవేశపెట్టిన విబి. జి.ఆరఎం.జి పథకానికి రూ.8365 కోట్లు కేటాయించడాన్ని విక్రమ్ ప్రశంసించారు. జల్ జీవన్ మిషన్ కోసం రూ.4,000 కోట్లు కేటాయించడం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రయో జనం చేకూరుస్తుందని విక్రమ్ అన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో విజయనగరం మరియు ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలు సమీప భవిష్యత్తులో గణనీయమైన వృద్ధిని సాధిస్తాయని విక్రమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు చొరవతో ప్రభుత్వం గ్రామీణ మరియు వ్యవసాయ అభివృద్ధికి నిధులను పెంచిందని ఆయన అన్నారు. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్



రాష్ట్రంలోని గ్రామాల వేగవంతమైన పురోగతి కోసం చక్కటి సూచనలు చేసి బడ్జెట్ ను జనరంజకంగా రూపొందించడానికి తోడ్పడ్డారని విక్రమ్ కొనియాడారు.

# వినూత్నమైన కొత్త వరవడితో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ సమావేశం



**అనకాపల్లి, ఫిబ్రవరి 14 (మనసు లో మాట) :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం కొత్తవరవడి కి శ్రీకారం చుట్టినట్టయ్యింది.కుటుంబ సభ్యుల నేపథ్యం తెలుసుకోవడం తోపాటు నియోజకవర్గం లోని సమస్యలపై ఒక రిపోర్టును శాసనసభ్యులకు అందజేయ డం నారా లోకేష్ కే చెల్లిందని మాజీ శాసనమ ండలి సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రధాని మోడీ పార్లమెంటు సమావేశాలు జరిగినప్పుడు పార్లమెంటు సభ్యులు తో కలిసి విందు సమావేశాల్లో పాల్గొనేవారిని, దాన్ని ఆదర్శంగా తీసుకొని లోకేష్ మొట్టమొదటిసారిగా ప్రయోగాత్మంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, శాసనసభ్యుల కుటుంబ సభ్యులకు ఏనాడూ ఇటువంటి అవకాశాలు కలగలేదని, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ఉంటూ పిల్లల భవిష్యత్తు ఆలోచన వారితో పంచుకోవడం, వారి కుటుంబంలో ఆనందంతో పాటు ఇటువంటి అవకాశాలు కూడా ఉంటాయని వారికి ఆలోచన కలిగించిన వ్యక్తి నారా లోకేష్ అని నాగ జగదీష్ అన్నారు. ప్రతి నియోజకవర్గంలో కూటమి శాసనసభ్యులు నియోజకవర్గాల్లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్న విషయాలను వారి చేయవలసిన పనులను తమ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం వారికి అందించి వారికి కర్తవ్యాన్ని బోధించారని, ఒక వ్యక్తి ఒక శాఖకు మంత్రిగా ఉంటూ 175 నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందో తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా నిబద్ధత, అంకిత భావం తో పనిచేయడం మంత్రి లోకేష్ కే సాధ్యమవుతుందని నాగ జగదీష్ అన్నారు. ఇదిలావుంటే గత వైసిపి పాలనలో జగన్ రెడ్డి గత 5 సంవత్సరాల కాలంలో ఏనాడు శాసన సభ్యులకు ముఖాముఖి కార్యక్రమంగాని, పలకరి ంపులు గాని నోచుకోలేదని, జగన్ రెడ్డి పెత్తందారి విధానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఏదేమైనా మంత్రి లోకేష్ ప్రజాస్వామ్యయుతంగా అందరితో స్నేహ భావంతో ఉ ండడం లోకేష్ భవిష్యత్తు రాజకీయలకు మార్గదర్శకమే అవుతుందని నాగ జగదీష్ ఆశాభావం వ్యక్తపరిచారు.

# ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

## జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట ):ఫిబ్రవరి 14::** భారతదేశం ప్రజాస్వామ్య చరిత్రలో అజరామరమైన స్థానాన్ని సంపాదించిన మహనీయుడు, సమానత్వ స్ఫూర్తికి ప్రతీక, ప్రజాసేవకు మారుపేరైన దామోదరం సంజీవయ్య గారి 105వ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్,... దామోదరం సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – సామాన్య కుటుంబంలో జన్మించి, తన ప్రతిభా సామర్థ్యాలతో ఉన్నత స్థానాలకు ఎదిగిన దామోదరం సంజీవయ్య, ప్రజాసేవకుడిగా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అడ్డంకులు ఆయనను వెనక్కి నెట్టలేకపోయాయని, చదువు పట్ల ఆసక్తి, సామాజిక చైతన్యం పట్ల




నిబద్ధత ఆయనలో చిన్న వయసులోనే పెంపొందాయన్నారు. విద్యాభ్యాసంలో ప్రతిభ కనబరచి ఉన్నత విద్యను అభ్యసించి, విద్యే మార్పుకు మార్గమని నమ్మిన ఆయన, యువతకు చదువు ద్వారా ఎదగాలని ఎల్లప్పుడూ ప్రేరణనిచ్చేవారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన తొలి దళిత నాయకుడిగా ఆయన చరిత్ర సృష్టించారని, నిష్కళంకత, నిజాయితీ, వినయం -- ఇవే ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే లక్షణాలని అన్నారు.అధికారం ఆయనను మార్చలేకపోయింది, ఆయన అధికారం ద్వారా సమాజాన్ని మార్చాలనే సంకల్పం తో పనిచేశారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడం ఆయన ప్రత్యేకతని, సమానత్వం, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించడంలో ఆయన చూపిన నిబద్ధత, నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని జిల్లా ఎస్పీ అన్నారు.

# అద్దె ఇంట్లో ఎంపీపీ పాఠశాల నిర్వహణ

## అర్ధాంతరంగా నిలిచిన నాడు నేడు పాఠశాల భవనం

### పాఠశాల భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు.

**హుకుంపేట, ఫిబ్రవరి 14 (మనుసులో మాట) :** హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ పాలెం గ్రామంలో ఉన్న ఎంపీపీ ప్రాథమిక పాఠశాల దుస్థితి గ్రామ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నాడు--నేడు పథకం నిధులతో ఈ పాఠశాల భవన నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ, పనులు మధ్యలోనే అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం పాఠశాల భవనం మొండి గోడలతో దర్శనమిస్తూ, పూర్తిస్థాయిలో నిర్మాణం కాకుండా అలాగే ఉంది.దీంతో పాలెం గ్రామంతో పాటు పరిసర నాలుగు గ్రామాలకు చెందిన బాలబాలికలకు సరైన పాఠశాల భవనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు దాదాపు 40 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా, పాఠశాల భవనం లేకపోవడంతో పాలెం గ్రామానికి చెందిన వెలగ భీమన్న పంచలో అద్దెకు ఆశ్రయం పొంది పాఠశాల నిర్వహిస్తున్నారు. విద్యార్థుల



సంఖ్య పెరగడంతో ఆ ఇంటి యజమాని స్థలం ఇచ్చినప్పటికీ, అక్కడ పాఠశాల నిర్వహణకు తగిన వసతులు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తాగునీరు, మరుగుదొడ్లు, సరిపడా తరగతి గదులు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ అర్ధాంతరంగా నిలిచిపోయిన పాఠశాల భవనం ఎదుట గ్రామస్తులు నినాదాలు చేశారు.ఈ విషయాన్ని గతంలో అనేకసార్లు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని గ్రామ ప్రజలు ఆరోపించారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ గ్రామ కమిటీ అధ్యక్షులు కొర్ర నర్సింగరావు, వార్డు సభ్యులు వెలగ చిన్న భీమన్న, క్లస్టర్ ఇన్‌చార్జ్ పాడి సుమన్ బాబు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ నిరసనను తెలియజేశారు.

# ఘనంగా కర్రి సాయి కృష్ణ జన్మదిన వేడుకలు

## నారా చంద్రబాబు నాయుడు ని కలిసిన కర్రి సాయికృష్ణ



**మునగపాక, ఫిబ్రవరి 14, మనసులో మాట :** అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ తన జన్మదిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆశీర్వాదం స్వీకరించి, ఆయన ఆశీస్సులు పొందారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ముఖ్యమంత్రి కి తెలియజేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తూ, ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని కర్రి సాయికృష్ణ ముఖ్యమంత్రి కి వివరించారు.

# మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

## : స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం ,ఫిబ్రవరి 14 (మనసులో మాట) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సీపట్నంనియోజకవర్గంలోని, బలిఘట్టం వద్ద గల ఉత్తరవాహిని నది తీరంలో భక్తుల కోసం ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు ఉత్తరవాహిని నది వద్ద ప్రభుత్వ పక్షాన అత్యంత వైభవంగా గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 15, 16 మరియు 17 తేదీలలో భక్తులు ఈ పుణ్యనదిలో స్నానాలు ఆచరించడానికి వీలుగా ఘాట్ల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. శివరాత్రి జాగరణ అనంతరం, 16వ తేదీ సోమవారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించి దైవ దర్శనం చేసుకున్న భక్తుల సౌకర్యార్థం పాకలపాటి గురువుగారి ఆశ్రమంలోనూ, సత్యనారాయణ మూర్తి గుడి వద్ద అల్పాహార విందు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సేవా కార్యక్రమాల్లో అన్నపూర్ణ అక్షయ పాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా భాగస్వాములు కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భక్తులందరూ ఈ పవిత్ర నదిలో స్నానాలు ఆచరించి, పరమేశ్వరుని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని, ఈ ఆధ్యాత్మిక వేడుకలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని అయ్యన్నపాత్రుడు మనస్ఫూర్తిగా కోరారు.

# చూచుకొండ స్మశాన వాటికలు సొంత నిధులతో బోరు ఏర్పాటు

**మునగపాక, ఫిబ్రవరి 14, మనసులో మాట :** మండలంలో చూచుకొండ గ్రామానికి చెందిన ప్రముఖ నాటక కళాకారుడు కాంద్రేగుల రఘురాం జ్ఞాపకార్థం చూచుకొండ స్మశాన వాటికలో సొంత నిధులతో లక్ష రూపాయలు విలువైన హ్యాండ్ బోర్న్ కాంద్రేగుల వరలక్ష్మి నగదు సమకూర్చారు. ఈ బోరు ఏర్పాటు స్మశాన వాటికకు వచ్చే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పాల సంఘం అధ్యక్షులు కాంద్రేగుల నాయుడు తెలిపారు.



# నేడు ఖండివరం శివాలయం వద్ద భారీ అన్న సమారాధన



**చీడికాడ, ఫిబ్రవరి 14, మనసులో మాట:** మండలంలో ఖండి వరం శివాలయం వద్ద మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని సర్పంచ్ శీరం రెడ్డి లక్ష్మి తెలిపారు ఆమె శనివారం మాట్లాడుతూ అన్న సమారాధన గ్రామస్తుల సహకారంతో జరుగుతుందన్నారు మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి అన్నారు భక్తులు అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించాలని ఆమె కోరారు

# రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించాలని ఆందోళన..



**దుంబ్రిగుడ, ఫిబ్రవరి 14 (మనసులో మాట ) :** మండలంలోని రంగిలిసింగి పంచాయతీ వాకపల్లి రోడ్డు జంక్షన్ నుంచి ఒరిస్సా సరిహాసద్దు వరకు రోడ్డు. నిర్మాణ పనులు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ గిరిజనులు శనివారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ వాకపల్లి జంక్షన్ నుంచి ఒరిస్సా పాడువ.మీదగా సుమారు కిలో మీటరు దూరం వరకు రోడ్డు మంజూరు చేయాన్నారు.ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లోనీ ప్రజలు నిత్యం భయాంకరమైన్న రాళ్లతో ఏర్పాడిన మట్టి రోడ్డుపై ప్రయాణం చెయ్యవలసిన పరిస్థితి నెలకొందనారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి వాకపల్లి జంక్షన్ నుంచి ఒడిస్సా సరిహద్దు వరకు రోడ్డు మంజూరు చేసి నిధుల కేటాయించి నిర్మాణ పనులు చేయాలనీ డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆందోళన ఉదృతం చేస్తామని అయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె దాసుబాబు,పి డొంబు,పిమోహన్ దాస్ ,వి కేశవ్ ,పంచాయతీ గిరిజనులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# బాధిత కుటుంబానికి యూనిటీ ఫర్ చారిటబుల్ ట్రస్ట్ సహాయం.




**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 14, (మనసులో మాట) :** మండలంలోని సాగర పంచాయతీ టెక్కిలిబిడ్డ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు కోల్పోయిన కుటుంబానికి అరకు వారపు సంతలోనీ యూనిటీ ఫర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం ఉచితంగా నిత్యావవసరాల.సరుకులు బట్టలతో పాటు కొంత ఆర్థిక సహాయన్నీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ,ట్రస్ట్ వ్యవస్థాపకులు.నీలి జోస్ప్ న్, నీలి నారాయణ చేతులు మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పాలకి.ఆనందరావుకు చెందిన నివాస గృహంలో ప్రమాద వసతు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కరెంటు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ఎగిసి గృహం లోపాల నిల్వ ఉంచిన వరి దినుసులతో పాటు ఇతర సామగ్రి బుదిదయ్యాయన్నారు.దీంతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అందుకోవడానికి యూనీటి ఫర్ చారిటబుల్ ట్రస్టు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సిహేచ్ రామూర్తి, లింగన్న, నర్సింగ్, కె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# 25 లక్షల విలువ చేసే గంజాయి లిక్విడ్ పట్టుకున్న పోలీసులు

## - ముగ్గురు వ్యక్తులు అరెస్టు



**దేవరాపల్లి, ఫిబ్రవరి 14, (మనసులో మాట) :** స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారంతో రూ. 25 లక్షల విలువైన 2 కేజీల లిక్విడ్ గంజాయిని పట్టుకున్నారు. శనివారం సబ్ ఇన్స్పెక్టర్ వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనం (ఏపీ 39 ఈజెడ్ 3211)పై అల్లూరి జిల్లా నుంచి శ్రీరాంపురం చెక్ పోస్ట్ మీదగా వస్తుండగా ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని 2 కేజీల హషీష్ ఆయిల్ ను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కె. కోటపాడు సీఐ కృష్ణ మీడియాకు శనివారం వెల్లడించారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం కు చెందిన గోల్లూరి దానిష్, పాంగి దేవదాసు(19), నాసిక్‌కు చెందిన రంజాన్ జాకీర్ మన్సూరి లు ఒడిశాలో కొనుగోలు చేసి మహారాష్ట్ర తరలిస్తుండగా శ్రీరాంపురం వై జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యం విలువ రూ.25 లక్షలు ఉంటుందని తెలిపారు. వారి వద్ద నుంచి పల్సర్ బైక్, రూ.3వేలు, 3 మొబైళ్లను సీజ్ చేసి నిందితులను చోడవరం కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్టు సీఐ తెలిపారు.

# శ్రీ శ్రీ చోడమాంబిక అమ్మవారికి పూలతో చీర అలంకరించిన శివ స్వాములు



**అచ్యుతాపురం ఫిబ్రవరి 14 మనసులో మాట.** మహాశివరాత్రి సందర్భంగా చోడపల్లి గ్రామంలో వెలసిన చోడమాంబిక అమ్మవారిని శివ స్వాములు పూలతో చీరను అలంకరించారు. ఆదివారం శివ స్వాములు ప్రత్యేకంగా మహాశివరాత్రి పర్వదినాన్ని రాత్రి తెల్లవారులు జాగారం చేసి శివ భక్తిని చాటుకోవాలని అంటున్నారు కావున చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని శివ స్వాములు కోరారు.

# అంబులెన్స్ కు పార్కింగ్ సదుపాయం కల్పించాలి



**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట ):ఫిబ్రవరి 14:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో తమకు అంబులెన్స్ పార్కింగ్ సదుపాయం కల్పించాలని విజయనగరం అంబులెన్స్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓ ఆనందకుమార్ కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ హాస్పిటల్ పిఆర్వోలు ఆసుపత్రిలో తిరుగుతూ రోగులను తమ అంబులెన్స్ లు రప్పించి ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారని, హాస్పిటల్లో పనిచేస్తున్న సిబ్బంది తన సొంత వాహనాల్లో మృతదేహాలను తరలిస్తున్నారని వాటిని అరికట్టి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరల పట్టికను నిర్ణయించి, రోగుల సేవలో తనకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం అంబులెన్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అంబులెన్స్ శివ, సెక్రటరీ బి.అంజి, సభ్యులు శరత్,గణేష్, సమేష్,ఆశీర్వాదం, ఎమ్.వాసు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు.

**అచ్చుతాపురం ఫిబ్రవరి 14 మనసులో మాట.:** మహాశివరాత్రి మహాశివరాత్రి పర్వదినాన పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు విద్యుత్ కాంతులతో ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో అలంకరణలు చేయించారు. ప్రత్యేకంగా స్వయంభువుగా వెలసిన శ్రీ శ్రీ శ్రీ ఉమా సోమేశ్వర స్వామి దేవాలయం దోసూరు, కొండకర్లలో జగదీశ్వర ఆలయం, మడుతూరు లో చోడేశ్వర ఆలయం, జగన్నాధపురం ,హరిపాలెం కొండపై శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించడానికి హరిపాలెం గ్రామ ప్రజలు నిర్వహిస్తున్నారు. అలాగే పెదపాడు, జగ్గన్నపేట అచ్యుతాపురం, దుప్పుతూరు, ఎస్సీ జెడ్ కాలనీలో గురుజాడ పాలెం కాలనీలలో మహాశివరాత్రి మహోత్సవానికి ఆలయాలన్నీ విద్యుత్ కాంతులతో నిర్వహకులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం తెల్లవారు జాము నుండి శివనామ స్వరములతో మహిళలు, పురుషులు ప్రత్యేక పూజలకు నిర్వహించడానికి అన్ని విధాల ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు

# అంగరంగ వైభవంగా మత్స్యగుండం శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల

- **మత్స్యగుండం దేవాలయ పరిసరాల్లో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు పూర్తి.**
- **మొదటి రోజు భక్తుల సందడి**



**హుకుంపేట ఫిబ్రవరి 14 మనసులో మాట :** అంగరంగ వైభవంగా శ్రీ మత్స్య లింగేశ్వర స్వామి ఉత్సవ ఏర్పాట్లు, ఏర్పాట్లు భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వహణ ఏర్పాట్లు ఉండాలని జిల్లా కలెక్టర్,ఏ ఎస్ దినేష్ కుమార్, ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజా ఆదేశాలు మేరకు జిల్లా అధికారుల సమన్వయతో స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసామని ఇంచార్జి రెవిన్యూ డివిజన్ అధికారి, స్పెషల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏం వి ఎస్ లోకేశ్వరరావు తెలిపారు. జిల్లాకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, తహసీల్దార్, హుకుంపేట సి.ఐ పోలీస్ శాఖ, ఎంపీడీఓ, ఎక్సైజ్ అధికారులు, ఆలయ కమిటీసభ్యులు,ప్రతినిధులు పాల్గొని మొదటిరోజు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.రద్దీ నియంత్రణ,ఈరోజు సాయంత్రం మరియు రేపు తెల్లవారుజామున భక్తుల రాక గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎటువంటి అసౌకర్యలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలనికి అధికారులకు అన్ని విధాలుగా ఆదేశాలు జారీ చేయడమైనది తెలియజేశారు. శాఖల వారీగా సమన్వయంతో బాధ్యతలు, నిర్వహిస్తున్నారని పోలీస్ శాఖ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, శాఖల సమయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు, రెవెన్యూ ఉ పంచాయతీ రాజ్ శాఖల పారిశుధ్యం, తాగునీరు మరియు లైటింగ్ ఏర్పాట్లు, ఎక్సైజ్ శాఖ ఉత్సవాల సమయంలో నిబంధనల అమలు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, క్యూ లైన్ల నిర్వహణ, అత్యవసర వైద్య సేవల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఆరోగ్యశాఖ సంబంధించిన స్టాల్ ఏర్పాట్లు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మరుగు దొడ్లు, స్నానగదులు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.స్వామివారి మూడు రోజుల వేడుకలలో నిర్వహణ కార్యక్రమంలో పాల్గొంటున్న గ్రామ సర్పంచ్ మఠం శాంతి కుమారి, ఎంపీపీ కూడా రాజారావు,డివిల్పిఒ పి ఎస్ కుమార్,ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, ఎంపీడీవో రమాదేవి, జిల్లా మండల స్థాయి అధికారులు, ఆలే కమిటీ నిర్వాకులు తదితరులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా మహాశివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు

**మునగపాక, ఫిబ్రవరి 14, మనసులో మాట :** మండల వ్యాప్తంగా మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు అన్ని ముస్తాబయ్యాయి. మండలంలోని ప్రసిద్ధి చెందిన వాడ్రా పల్లి శ్రీ దక్షిణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి జిల్లా నలుమూల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తలు సూరిశెట్టి పరమేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే టి శిరసపల్లి శ్రీ వీరభద్ర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మునగపాక మండలం నుండే కాకుండా సమీప గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలు వచ్చి వీరభద్ర స్వామిని దర్శించుకుంటారు. అలాగే నాగులపల్లి శ్రీ రామలింగేశ్వర ఆలయం లో స్వామివారికి ప్రత్యేకమైన పూజలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రం



మునగపాక శ్రీ పాలేశ్వర భీమేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీ వెల్లవలపల్లి కోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మీకు జాము నుండే భక్తులు త్వరలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటాను. అలాగే మునగపాక మెయిన్ రోడ్ లోపల శ్రీ కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడానికి దేవాలయమంతా విద్యుత్ లైటింగ్ తో అలంకరించారు. వెంకటాపురం నీలకంఠేశ్వర స్వామి కి ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేలాది మందికి అన్న సమాధాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ నీలకంఠ స్వామి తెలిపారు. అలాగే వీరభద్ర స్వామి గుడి దగ్గర సుమారు 8 గ్రామాల ప్రజలకు భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరు నాయుడు తెలిపారు.

# బడ్జెట్ లో షుగర్ ఫ్యాక్టరీలకు మొండి చేయి చూపడం అన్యాయం

## సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు

**అనకాపల్లి, ఫిబ్రవరి 14 (మనసు లో మాట) :** రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జిల్లాలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికరణ కై, రైతులు, కార్మికుల బకాయిలు చెల్లింపుకై బడ్జెట్ కేటాయించక పోవడం అత్యంత అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే సహకార రంగంలో నడుస్తున్న ఏకైక గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఈ ఏడాది క్రషింగ్ ను సైతం చేయకుండా ఈ ప్రాంతంలో చెరకును మరో జిల్లాకు తరలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే గత ఏడాది చెరుకును సరఫరా చేసిన రైతాంగానికి , కష్టపడి పనిచేసిన కార్మికులకు బకాయిలను చెల్లించలేదని అన్నారు. రైతులు కార్మికులకు కేవలం 30 కోట్ల రూపాయలు బకాయిల చెల్లింపు కు మరో 100 కోట్ల రూపాయల ను ఫ్యాక్టరీ ఆధునికరణకు చెల్లిస్తే ఈ ప్రాంతం అంతా సస్యశ్యామల మవుతుందని అన్నారు. ఈ నేపద్యంలో ఫ్యాక్టరీ ఆధునికరణకై రాష్ట్ర ప్రభుత్వం పూనుకొని నిధులు కేటాయించి నట్లయితే గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మళ్లీ పుర్వవైభవం వస్తుందన్నారు. తద్వారా చోడవరం, మాడుగుల నియోజవర్గాల్లో రైతాంగానికి వెన్నుదన్నుగా నిలబడేదని అన్నారు. అనకాపల్లి జిల్లా లో ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు కూడా ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నాయని వీటిని కూడా చెల్లించటానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం దుర్మార్గం అని అన్నారు. కాగా బడ్జెట్ లో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికరణకై నిధులు కేటాయించడం కోసం ఈ ప్రాంత రైతాంగం కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కాక తప్పదని




ప్రభుత్వానికి హెచ్చరించారు.

# అక్రమ మైనింగ్ దందాలను నివారించాలి -సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం



**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):** అనకాపల్లి జిల్లాలో మైనింగ్ దందాలు రానురాను పెరిగిపోతున్నాయని తక్షణమే అరికట్టాలని ప్రభుత్వాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారంఅనకాపల్లి మండలం, మార్టూరు కూడలి వద్ద ఏఎమ్ఆర్ చెక్కుపోస్టు వల్ల లారీలు నిలుపుదల చేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వల్ల యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయని, రెండు రోజులకు ముందే యాక్సిడెంట్ తో ఆర్మీ జవాన్ చనిపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. రద్దీగా ఉండే రహదారి కొంతసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడి, ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కేంద్ర కమిటి సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ ఏఎమ్ఆర్ అక్రమ చెక్ చెక్ పోస్ట్ వల్ల అక్రమంగా మాటురు జంక్షన్ లో అక్రమంగా లారీలను నిలుపుదల చేయడం వలన ఇటీవలనే ఆర్మీ జవాను యాక్సిడెంట్ లో మృతి చెందడం జరిగిందన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ గెలిచిన తర్వాత అనకాపల్లిలో అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. నల్ల పిక్క క్వారీలు, క్రసర్లు యజమానులు రెండు నుంచి ఐదు ఎకరాలకు పర్మిషన్ తీసుకొని పది పదిహేను హెక్టర్లు వరకు వరకు అక్రమంగా మైన్నింగ్ చేస్తున్నారన్నారు. మైనింగ్ అధికారులు, రెవిన్యూ, పోలీస్ అధికారులు నిర్లక్ష్యం వలన అక్రమ మైనింగ్ దందా అత్యధికంగా సాగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ఈ అక్రమ దందాను ఆరికట్టాలని, క్వారీల దగ్గరే పే బిల్లులు చెకింగ్ చేయాలని డిమాండ్ చెసారు. భారీ మందు గుండుతో బ్లాస్టింగ్ చేస్తున్నారని, దీనివలన చుట్టుపక్కల ఇల్లు, పంట పొలాలు, నిర్మాణాలు దెబ్బతింటున్నాయని, వాయు ధ్వని కాలుష్యంతో రైతులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. తక్షణమే అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఒక అనకాపల్లి మండలం రోజుకి రెండు వేలు వాహనాలు రోజు ఇక్కడ నుండి అక్రమంగా మైనింగ్ తరలించడం జరుగుతుందన్నారు. చాలా లారీలకి పేబిల్లులు లేకుండా తరలించడం జరుగుతుందన్నారు అనకాపల్లి మండలంలో 115 క్వారీల్లో చాలా క్వారీలకి అనుమతులు లేవన్నారు. అనుమతులు ఉన్నివి కూడా అక్రమంగా మైనింగ్ తో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రుత్తల శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, కాళ్ళ తలయ్యబాబు, అల్లు రాజు, కె. ఈశ్వరరావు, చలపతి, నాగిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎం.పి.పి పాఠశాలలో రబ్బీ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ

**పెదబయలు ఫిబ్రవరి 14 మనసులో మాట :** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పెదబయలు మండలం, పర్రేడ పంచాయతీ పరిధిలో ఉన్న రూడగోమంగి ఎం.పి.పి పాఠశాలలో రబ్బీ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, రబ్బర్లు, ఐడి కార్డులు, టైలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. మత్యలింగం చేతుల మీదుగా విద్యా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. రబ్బీ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు మఠం కేశవరావు పడాల్ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రధానోపాధ్యాయులు కొనియాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుంటారని ఆయన సూచించారు. విద్యతోనే




వ్యక్తి జీవితం మారుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొం దిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సి.సి.ఆర్ సభ్యులు వి. సామ్యూల్, కె. కామరాజు, చిరంజీవి, బుచ్చి బాబు, సిహెచ్. మూర్తి, పాఠశాల చైర్మన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామస్థులు రబ్బీ కంప్యూటర్ ఎడ్యుకేషన్ చేస్తున్న సేవలను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో విజయ వంతంగా ముగిసింది.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప



# ప్రజా సమస్యలపై చర్చించిన పలమనేరు పరిరక్షణ సమితి




## పి.పి. ఎస్.కార్యవర్గ సమావేశం

**పలమనేరు ఫిబ్రవరి 14( మనసులో మాట) :** స్థానిక ఎన్‌జీఓ హోమ్ నందు గల పి.పి.ఎస్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు టి. ఎల్. నరసింహులు ఆధ్వర్యంలో జరిగింది.

సమావేశంలో సభ్యులు పలు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ శాఖలను డిమాండ్ చేశారు.పలమనేరు బజారు వీధితో పాటు పాలు రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.అదేవిధంగా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు విషయంలో పలమనేరు ప్రాంత ప్రజల మనోభావాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాలని సమితి డిమాండ్ చేసింది. పలమనేరు ప్రాంతంలో స్టేషన్ ఏర్పాటు చేయాలని, దీనిపై ప్రజా మద్దతుతో నిరంతర పోరాటం కొనసాగించాలని సమావేశం తీర్మానించింది. గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుండి అక్రమంగా డెలివరీ ఛార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై కార్యదర్శి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తక్షణ విచారణ జరిపి వినియోగదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంగవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కొత్త బస్ స్టాప్ ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారుల వద్ద ప్రాతినిధ్యం వహించాలని కమిటీ సభ్యుడు వీరభద్ర గౌడ్ సూచించారు.సముద్రపల్లి ఎస్.టి కాలనీలో నివసిస్తున్న అంగవైకల్యం అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఇప్పటికే కొంత తోడ్పాటు అందించిన నేపథ్యంలోఈ దఫా కమిటీ సభ్యుడు,దాత రాఘవయ్య సహకారంతో వీల్‌చైర్ అందజేయాలని సమావేశం నిర్ణయించింది.పలమనేరు పట్టణంలో మటన్, చికెన్ ధరలు అధికంగా పెంచడం, అపరిశుభ్ర పరిస్థితుల్లో విక్రయాలు జరగడం పట్ల సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆటో వాలా లు ఛార్జీలు అసహజంగా వసూలు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఆటోలో ధరల బోర్డులు, మీటర్ల వ్యవస్థ అమలు చేయాలని రవాణా శాఖ అధికారులను విజ్ఞప్తి చేశారు.పట్టణంలో చెత్త ఎక్కడ పడితే అక్కడ పడవేయ కుండా పౌరులు తమ ఇల్లు లాగా పరిశుభ్రంగా ఉంచుకోవడానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో రామచంద్ర, పొన్ముడి, సన్నీరాజు, విజయకుమార్, సాంబయ్య, రెడ్డప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి

- **మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన - జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్ర ప్రసాద్, సందర్శించారు.**



**పలమనేరు ఫిబ్రవరి 14 ( మనసులో మాట):** బాలికల ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌ను పరిశీలించి, విద్యార్థుల అభ్యాస స్థాయిని సమీక్షించారు. ప్రార్థన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి అయిన దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే అలవాటు ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రేరణాత్మక సందేశం అందించారు. అనంతరం ఉపాధ్యాయులతో 10వ తరగతి 100 డేస్ యాక్షన్ ప్లాన్ పై సమగ్ర చర్చ నిర్వహించారు. విద్యార్థుల పరీక్ష జవాబు పత్రాలను పరిశీలించి, లోపాలను గుర్తించి మెరుగైన ఫలితాల సాధనకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. గవర్నమెంట్ హై స్కూల్, పలమనేరును సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై మంచి ఫలితాల కోసం అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి, బోధన నాణ్యతపై ఉపాధ్యాయులకు తగు సూచనలు అందించారు. అదే సమయంలో పాఠశాలలో అమలవుతున్న అటల్ తింకెరింగ్ లాబ్స్ కార్యక్రమాన్ని పరిశీలించి, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక దృక్పథం పెంపొందించేందుకు ప్రోత్సహించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలపై సూచనలు ఇచ్చారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, విద్యానగర్‌ను సందర్శించి జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి సంబంధించిన 75 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. తరగతులలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించి, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల పఠన–లేఖన నైపుణ్యాల పెంపుకు ఉపాధ్యాయులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. అలాగే భావిత సెంటర్, ఎంఈఓ కార్యాలయంలో నిర్వహణా విధానాలను పరిశీలించి, పరిపాలనలో సమర్థత పెంపు, విద్యార్థుల సమగ్ర అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓలు సీఆర్ఎంసీలు పాల్గొని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. జిల్లా విద్యాశాఖాధికారి, విద్యా నాణ్యతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఉపాధ్యాయుల సేవలను అభినందించారు.ఈ సందర్భంగా డి.ఓ తో పాటు జిల్లా సైన్స్ అధికారి మోహన్ సింగ్, మండల విద్యాశాఖ అధికారులు పి లీలారాణి, సి బాలసుందరం, ప్రధానోపాధ్యాయులు సుజాత, స్టాఫ్ ,గవర్నమెంట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంషీర్ స్టాఫ్, సిఆర్ఎంటిలు ఎంఈఓ ఆఫీస్ స్టాఫ్ పాల్గొవడం జరిగిందన్నారు.

# కీ.శే.మలిశెట్టి సీతారాం స్మారక సాహిత్య పురస్కార ప్రదానోత్సవం



**పలమనేరు ఫిబ్రవరి 14 ( మనసులో మాట) :** పలమనేరుకు చెందిన దివంగత కెమిస్ట్రీ అధ్యాపకులు శ్రీ మలిశెట్టి సీతారాం పేరిట ఏర్పాటు చేసిన మలిశెట్టి సీతారాం స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంహైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం వైభవంగా జరిగింది. ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి మలిశెట్టి శ్యాంప్రసాద్, కోశాధికారి సుజన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పలమనేరు రచయితల సంఘం తరపున ఆర్.మాధవ్ పలమనేరు బాలాజీ, జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొని రచయితలను సత్కరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రచయిత వి. రాజారామమోహనారావుకి జీవన సాఫల్య పురస్కారం, యువరచయిత్రి కుమారి శ్రీఊహకి వార్షిక సాహిత్య పురస్కారం ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా 2025వ సంవత్సరంలో నిర్వహించిన జాతీయస్థాయి కథలపోటీలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీలో మొదటి బహుమతిని వి. శాంతిప్రబోధ (న్యూరోచిప్డ్ మనిషి), ద్వితీయ బహుమతిని కిరణ్ జమ్మలమడక (నీది నీదికాదు), తృతీయ బహుమతిని పొత్తూరి సీతారామరాజు( ధన్వంతరి ) అందుకున్నారు. ఐదు ప్రోత్సాహక బహుమతులు మరో ఆరు కథలతో కథాప్రపంచం 2025 పుస్తకం ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడెమీ చైర్మన్ శరత్ చంద్ర, ప్రముఖ సాహితీవేత్తలు విహారి, వేమూరి సత్యనారాయణ, టీవీ చలనచిత్ర నటుడు కిషోర్ దాస్, నాటక– కథారచయిత తులసి బాలకృష్ణ, సాహితీవేత్తలు దాసరి అమరేంద్ర, ఘంటసాల నిర్మల, చీకోలు సుందరయ్య, రచయితలు నాగశేషు, సారథి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దాసగానిపల్లి కుళ్లాయప్ప ప్రాణాలకు ముప్పు?

**ఎస్సీ జన సంఘం జిల్లా కార్యాలయంపై దాడి**

**రాజ్యాంగ నిర్మాత చిత్రపటాన్ని చించివేత**



**అనంతపురం ఫిబ్రవరి 14 (మనసులో మాట ) :** అనంతపురం నగరంలో ఎస్సీ జన సంఘం జిల్లా కార్యాలయంపై జరిగిన దాడి తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఘటన ఈ నెల 12వ తేదీ తెల్లవారు జామున సుమారు 3:25 గంటల సమయంలో చోటుచేసుకుంది. గుర్తుతెలియని దుండగులు కార్యాలయంలోకి చొరబడి ఆస్తులను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. దుండగులు కార్యాలయంలో అమర్చిన సీసీ కటటమెరాలను ధ్వంసం చేసి, బీరువాలు మరియు డెస్కులలో ఉన్న పత్రాలను బయటకు విసిరి చిందరవందర చేశారు. ముఖ్యంగా, భారత రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ గారి చిత్రపటాన్ని చించివేయడం పట్ల ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇది కేవలం ఆస్తి ధ్వంసం మాత్రమే కాకుండా, రాజ్యాంగ విలువలను మరియు సామాజిక న్యాయాన్ని అవమానించే చర్యగా వారు అభిప్రాయపడుతున్నారు.అదేవిధంగా, ఎస్సీ జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దాసగానిపల్లి కుళ్లాయప్ప ఫ్లెక్సీలో బొమ్మ గొంతు భాగాన్ని కోసినట్లు గుర్తించారు. ఈ చర్యను బెదిరింపుగా భావిస్తూ, ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన దాడిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుళ్లాయప్ప ప్రాణాలకు ముప్పు కలిగించే ఉద్దేశంతో ఈ దాడి జరిగి ఉండవచ్చని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనపై అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయబడింది. ఎస్సీ జన సంఘం జాతీయ అధ్యక్షులు స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు సమర్పించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ఉద్యమాలు చేసే నాయకులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని సంఘ ప్రతినిధులు తెలిపారు. దుండగులను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు, వారి వెనుక ఉన్న కుట్రదారులు మరియు ప్రోత్సాహకులను కూడా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనలో హత్యాయత్నం మరియు ఎస్సీ/ఎస్టీ ( అట్రాసిటీ ) చట్టం కింద కేసులు నమోదు చేయాలని వారు కోరుతున్నారు.దాడి వెనుక ఎవరున్నా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగ విలువలను కాపాడాలని ప్రజా నాయకులు ప్రభుత్వం మరియు పోలీసులను కోరారు.

# పిఆర్సీ, ఐఆర్ ఊసే ఎత్తని బడ్జెట్

**వై ఎస్ ఆర్ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమచంద్రారెడ్డి**



**పలమనేరు ఫిబ్రవరి 14 ( మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి పే రివిజన్ కమిషన్ నియామకం అమలు మధ్యంతర భృతి గురించి ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని వైఎస్ఆర్సిపి ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్ సోమచంద్ర రెడ్డి విమర్శించారు. ఇప్పటికే పిఆర్సి గడువు కాలం పూర్తయి 2 సంవత్సరాల 8 నెలలు కావస్తుందని అయినా పిఆర్సి కమిటీ నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వం నియమించిన పే రివిజన్ కమిషన్ను రద్దుచేసి కొత్త కమిటీ వేయకపోవడంతో పిఆర్సి మరింత ఆలస్యం అవుతుందన్నారు. కనీసం ఐ ఆర్ ప్రకటిస్తారంటే ఆ ఊసే లేదన్నారు. బడ్జెట్లో ఏ ఏ రంగాలకు ఎంత కేటాయిస్తారో తెలిపిన ఆర్థిక మంత్రి ఇప్పటికే బకాయిలను విడుదల చేసిన 1100 కోట్లు ప్రస్తావించడమేంటని ప్రశ్నించారు. ఈ బకాయిలు కూడా 40 శాతం మందికి ఇంకా అందలేదన్నారు. అంతే కాకుండా వైఎస్సార్సీపీ ప్రభుత్వం నాడు నేడు పథకం కింద వేల కోట్లు కేటాయించి ప్రభుత్వ బడులలో తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించి దేశంలోనే రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. ఆ పథకానికి నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. గతంలో నిర్మాణాలు చేపట్టి ఆగిపోయిన పనులు అలానే ఉన్నాయన్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని బడ్జెట్ తుది కేటాయింపుల్లో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా చండి యాగం



**పెనుమూరు, ఫిబ్రవరి 14 (మనసులో మాట) :** మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చింత పెంట పంచాయతీ రామా పురం లో వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత శ్రీ రామ లింగేశ్వ రస్వామి ఆలయంలో శనివారం చండియాగం ఘనంగా జరిగింది. ఉదయం వేద పారాయణం, శ్రీ పార్వతి దేవికి ప్రత్యేక అభిషేకం చేపట్టారు. అనంతరం వేద పండితుల మంత్రోక్షణ మధ్య చడి యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, దీక్ష హోమం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో గో పూజ ,గంగ పూజ, మహా గణపతి పూజ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

# 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ సబ్ జూనియర్ పోటీలు

**నిర్వాహకులు లక్ష్మీనారాయణ పిఈటి.**



**ధర్మవరం ఫిబ్రవరి 14 (మనసులో మాట) :** పట్టణంలోని సంజయ్ నగర్ లో గల బిఎస్సార్ బాలికల ఉన్నత పాఠశాలలో 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ సబ్ జూనియర్ పోటీలు నిర్వహిస్తున్నామని పిఈటి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షూటింగ్ బాల్ యొక్క ప్రాముఖ్యతను వారు వివరించారు. ఈ పోటీలు ఫిబ్రవరి 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులతో హెడ్మాస్టర్ జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయుడు ప్రకాష్, అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షుడు కే ప్రసన్నలక్ష్మి స్వర్ణలత గౌరవపూర్వక పరిచయాలతో వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పోటీలను ఫిజికల్ డైరెక్టర్ బి.నాగరాజు ప్రారంభించారు.

# ఘనంగా దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు

**ఆర్డీవో మహేష్, తాసిల్దార్ సురేష్ బాబు**



**ధర్మవరం ఫిబ్రవరి 14 (మనసులో మాట)** పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డిఓ మహేష్ ఆధ్వర్యంలో, అదేవిధంగా పట్టణం లోని తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తదుపరి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య 1960లో ఉమ్మడి రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా విశేష సేవలు అందించారని తెలిపారు. ఆయన తెలుగు ఇంగ్లీషులో అనర్ధాలంగా మాట్లాడగలనా వ్యక్తి, గొప్ప వక్త అని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాసేవ వంటి విలువలను సమాజంలో నెలకొల్పిన మహనీయుల జీవితం యువతకు దిశా నిర్దేశం చేశారన్నారు. ప్రజల సమస్యల పట్ల సానుభూతి, సాధారణ జీవనం ఉన్నత ఆలోచనలు ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకలని తెలిపారు. కృషి, పట్టుదలకు మారుపేరు దామోదరం సంజీవయ్య అని వారు స్పష్టం చేశారు. ఏసీబీ, ఉపాధ్యాయులకు పెన్షన్ విధానాన్ని వారు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలని తెలిపారు.

# రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం



**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల పక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు

# అత్తాపూర్‌లో అడ్వకేట్ దారుణ హత్య



## కిరాతకంగా హత్య చేసిన బావమరుదులు

**హైదరాబాద్,ఫిబ్రవరి14:** నగరంలోని అత్తాపూర్‌లో అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు గురయ్యారు. సులేమాన్‌నగర్‌లోని తన సొంత ఆఫీసులో అడ్వకేట్‌పై కత్తులతో దాడి చేశారు. ఖదీర్‌ను మొదటి భార్య తమ్ముళ్లు అతి కిరాతకంగా చంపేశారు. పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దాడి జరిగిన వెంటనే నిందితులు పరారయ్యారు. అడ్వకేట్ ఖదీర్‌కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. రెండో పెళ్లి చేసుకోవడంతో.. ఖదీర్ మొదటి భార్య ఇంటికి రావడం మానేశాడు. ఈ కోపంతో బావ ఖదీర్‌పై.. ఇద్దరు బామ్మర్దులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఖదీర్ ఆఫీస్‌లో ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన వారు.. మొదట రాడ్‌తో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో మహహ్మద్ ఖదీర్ కుప్పకూలిపోయాడు. ఆపై కత్తులతో ఆరుసార్లు పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు.. తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాల సేకరిస్తోంది. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

# ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యం

## కుటుంబ సభ్యుల తీవ్ర ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి14:** హైదరాబాద్ బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన పల్లె అనంతమ్మ (56) గత వారం రోజుల క్రితం ఈ హాస్పిటల్ నుంచి కనిపించకుండా పోయింది. ఇప్పటి వరకు ఆమె ఆచూకీ లభించలేదు. జనవరి 29న కిష్టాపూర్ గ్రామంలో హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత చికిత్స పేరుతో జనవరి 30న కంటి ఆపరేషన్ కోసం గ్రామస్తులను బస్సులో బాచుపల్లి హాస్పిటల్‌కు తరలించారు. కిష్టాపూర్ నుంచి 10 నుండి 15 మంది వెళ్లగా.. అంతా తిరిగి వచ్చారు. కానీ అనంతమ్మ మాత్రం తిరిగి రాలేదు. హాస్పిటల్ సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనలో ఈ నెల 5వ తేదీన అనంతమ్మ హాస్పిటల్ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిసింది. హాస్పిటల్ నిర్లక్ష్యం వల్లే.. ఆమె బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే వారం రోజులు గడిచినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మా అమ్మ మాకు కావాలి' అంటూ హాస్పిటల్ ముందు కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. 'మా అమ్మను ఎలా తీసుకొచ్చారో అలాగే అప్పగించాలి' అని అనంతమ్మ కొడుకు డిమాండ్ చేస్తున్నాడు. మహిళ ఆచూకీ లభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కుటుంబ సభ్యులు హెచ్చరించారు.



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మెజారిటీ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసినప్పటికీ, స్పష్టమైన మెజారిటీ రాని 38 హంగ్ మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం సుదీర్ఘంగా సమీక్షించారు.

# హంగ్ మున్సిపాలిటీలపై 'హస్తం' నజర్

## మేయర్, ఛైర్మన్ పీఠాలే లక్ష్యంగా సీఎం వ్యూహం

- 38 హంగ్ మున్సిపాలిటీలపై ప్రత్యేక ఫోకస్
- స్వతంత్రులకు కాంగ్రెస్ గాలం
- కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు
- వడ్డేపల్లి ఫార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్లతో సీఎం భేటీ
- ఆయారామ్ గయారామ్‌ల హడావిడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మా రుతున్నాయి. హంగ్‌గా నిలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కనీసం 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేలా కసరత్తు చేయాలని మంత్రులు, పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అ ధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, సీని యర్ నేతలతో శనివారం సీఎం సమావేశమయ్యారు. రాష్ట్రవ్యా ప్తంగా హంగ్‌గా ఉన్న 38 మున్సిపాలిటీల పరిస్థితి, తదుపరి కార్యాచరణపై చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీల్లో స్వతంత్ర కౌన్సిలర్ల మద్దతు కీలకమవుతుండటంతో వారిని ఆకర్షించే దిశగా చురుగ్గా ప్రయత్నాలు సాగిస్తోంది. ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు అనుకూలమైన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట 10వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. నారాయణపేట మున్సిపాలిటీలో మొత్తం 24 స్థానాల్లో భాజపా 11 గెలుచుకోగా, స్వతంత్ర అభ్యర్థి చేరికతో బలం 12కి చేరింది. దీంతో ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్‌అఫిషియో ఓటు కీలకంగా మారనుంది.

### బెల్లంపల్లిలో బీఆర్ఎస్ బలం పెరుగుదల

బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాల్లో కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం లభించాయి. తాజా చేరికలతో బీఆర్ఎస్ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు.

### వడ్డేపల్లి కౌన్సిలర్ల భేటీ

జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాము కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు స్పష్టం చేశారు. అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం మీద హంగ్ మున్సిపాలిటీల్లో స్వతంత్రుల పాత్ర కీలకంగా మారగా, చైర్మన్ ఎన్నికల ముందు రాష్ట్ర రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

- హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం
- భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి




**రంగారెడ్డి, ఫిబ్రవరి 14:** మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు.చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

# స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం

## పోలీసుల మెరుపు దాడి

## 45మంది అరెస్ట్



**హైదరాబాద్,ఫిబ్రవరి14:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ పరిధిలో స్పా సెంటర్ల పేరుతో సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని గాయత్రి రెసిడెన్సీలో ఉన్న 'ఆసన వెల్నెస్ స్పా' సెంటర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 15 మంది యువతులను, 30 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు నిర్వాహకులు కాగా, మిగిలిన 27 మందిని విటులుగా గుర్తించి అందరిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల విచారణలో ఈ దందాకు సంబంధించిన షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇర్ఫాన్ అనే వ్యక్తి గత ఏడాది కాలంగా ఈ స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫుల్ బాడీ మసాజ్, అరోమా మసాజ్ వంటి పేర్లతో కస్టమర్లను ఆకర్షించి, లోపల నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్ , వ్యభిచార కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. ఈ ముఠాకు కూకట్‌పల్లి 9వ ఫేజ్‌లో కూడా మరో బ్రాంచ్ ఉన్నట్లు సమాచారం అందడంతో, పోలీసులు ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఈ రైడ్ సందర్భంగా నిందితుల నుంచి పోలీసులు 45 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్పా సెంటర్ల ముసుగులో ఇలాంటి అసాంఘిక పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడ్డ యువతులను రెస్క్యూ హోమ్‌కు తరలించగా, నిర్వాహకులు , విటులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. నగరంలో ఇలాంటి అక్రమ సెంటర్ల జాబితాను తయారు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు.



# కరీంనగర్‌లో బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయం

**మేయర్ పదవి కోసం కాంగ్రెస్, ఎంఐఎంతో జట్లు**

**తాజా పరిస్థితులపై ఆరా తీస్తున్న కేంద్రమంత్రి బండి**

**కరీంనగర్, ఫిబ్రవరి 14:** కరీంనగర్‌లో మేయర్ పదవి కోసం ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 'మేయర్' పదవి కోసం బీఆర్ఎస్ తన సిద్ధాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కైనట్లు ప్రచారం సాగుతోంది. భారతీ-య జనతా పార్టీని ఓడించేందుకు మూడు పార్టీలు ఒక్కటైనట్లు సమాచారం. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బీజేపీని ఓడించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండిపెండెంట్ కార్పొరేటర్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు శుక్రవారం రాత్రి సదరు కార్పొరేటర్‌తో సమావేశమయ్యారు. అదే సమయంలో బీఆర్ఎస్ నేతలు కూడా కార్పొరేటర్‌తో రహస్యంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఇండిపెండెంట్లు, ఇతర కార్పొరేటర్లు, బీజేపీ సభ్యుల మద్దతు కోసం ఆఫర్లు ఇవ్వాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. తనకు మేయర్‌గా మద్దతిస్తే ఆర్థిక సహాయం కూడా అందిస్తానని కూడా ఆ ఇండిపెండెంట్ కార్పొరేటర్ సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలను కమలం పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. తమ పార్టీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యగా బీజేపీ అభివర్ణిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య రహస్య ఒప్పందం ఉందని, ఇది ప్రజలను మోసం చేయడమేనని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్‌పై కేంద్రమంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విపక్షాల డ్రామాలను ఆధారాలతో సహా ఎండగట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం. కరీంనగర్ మేయర్ పీఠం చుట్టూ జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక నగరానికి పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసేలా ఉన్నాయి. బండి సంజయ్ మీడియా సమావేశం తర్వాత ఈ వ్యవహారం మలుపులు తిరిగే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు

**మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు: మాజీమంత్రి తలసాని**

**సిద్దిపేట, ఫిబ్రవరి 14:** మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు.



రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు.కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు.తాను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయింది ని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్

**నైతిక విజయం తమదే అన్న వేముల**

**నిజామాబాద్, ఫిబ్రవరి 14:** మామున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలకు విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని దుర్వినయోగం చేశారని అన్నారు. రాత్రింబవళ్లు నోట్ల కట్టలు పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. కొన్నిచోట్ల రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని



కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పార్టీ సాంకేతికంగా విజయం సాధించిందే తప్ప నైతికంగా గెలిచింది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రె స్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తూ, మద్యం, డబ్బులు, చీర లు పంపి ణీ చేసిందని, అన్ని అవాంతరాలను ఎదుర్కొని బీఆర్ఎస్ అభ్యర్థులు వీరోచితంగా పోటీలో నిలిచారన్నారు.ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినా, గెలిచినా తాము ఎప్పటికీ ప్రజల పక్షమేనని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులకు బీఆర్ఎస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం, మద్యం, డబ్బు పంపకాలతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని ఆరోపించారు. అయినప్పటికీ మెజార్టీ సీట్లు సాధించలేకపోయిందని తెలిపారు.

# కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం
- ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు
- కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం



సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఎంఐఎం ప్రాబల్యం ప్రతి ఎన్నికల్లో తగ్గుతుందని, భాజపా బలపడుతూ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపా అభ్యర్థుల విజయం పట్ల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

- ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
- అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.



బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# తోక పార్టీలకే తోకగా మారిన బీఆర్ఎస్

**సీపీఐకి మద్దతు ఇస్తామనడమే ఇందుకు నిదర్శనం**

**జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు



చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం**

**కొత్తగూడెం మేయర్ పీఠం సీపీఐకి.. డిప్యూటీ మేయర్ కాంగ్రెస్‌కు ఖరారు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 :** తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై ఆయన మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో నిర్వహించిన ఈ సమావేశంలో ఫలితాలపై విశ్లేషణతో పాటు భవిష్యత్ వ్యూహాలపై చర్చించారు. ముఖ్యంగా నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను దక్కించుకునే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. మంచి ఫలితాలు సాధించిన మంత్రులు, పార్టీ నేతలను సీఎం అభినందించారు. రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని సీఎం పేర్కొన్నారు. "గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం రెండేళ్లలో పూర్తి చేసింది. ప్రజల విశ్వాసమే ఈ విజయానికి పునాది" అని వ్యాఖ్యానించారు. ఎన్నికల విజయం ఆరంభం మాత్రమేనని, అసలు అభివృద్ధి ఇప్పుడే ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. హంగ్ పరిస్థితులు ఉన్న మున్సిపాలిటీల్లో వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని, అవసరమైన చోట మిత్రపక్షాలతో చర్చలు జరిపి పీఠాలను దక్కించుకోవాలని సూచించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం కోసం మజ్లిస్‌తో చర్చలు



జరపాలని పీసీసీ చీఫ్‌కు ఆదేశించారు. ఇదిలావుంటే, భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ రాష్ట్ర నేత పల్లా వెంకట్ రెడ్డి భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించిన అనంతరం కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో మేయర్ పదవిని సీపీఐకి, డిప్యూటీ మేయర్ పదవిని కాంగ్రెస్‌కు కేటాయించేలా అవగాహనకు వచ్చారు. ఈ నెల 11న జరిగిన ఎన్నికల్లో మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆరెస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో విజయం సాధించారు. స్వతంత్రుల్లో పలువురు కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించడంతో కూటమి బలం 29కు చేరింది. దీంతో మేయర్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. అయితే బీఆరెస్‌కు చెందిన 8 మంది కార్పొరేటర్లు తాము పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. తాము అమ్ముడుపోయామంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని వీడియో ద్వారా వెల్లడించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ప్రజలకు సేవలందించే కేంద్రాలుగా మార్చాలని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భవిష్యత్ ఎన్నికలకూ ఇదే స్ఫూర్తితో సిద్ధం కావాలని ఆయన సూచించారు.

# 22న విజయవాడలో బీసీ సింహగర్జన

- సభను విజయవంతం చేయాలి.. బేరి రామచంద్ర యాదవ్ పిలుపు






**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న విజయవాడలో నిర్వహించనున్న 'బీసీ సింహగర్జన' సభను భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు.

**ఘనంగా పోస్టర్ ఆవిష్కరణ**

హైదరాబాద్‌లోని బీసీవై పార్టీ కార్యాలయంలో సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బేరి రామచంద్ర యాదవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా సాగే ఈ సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ కోరారు. ఇరు రాష్ట్రాలకు చెందిన బహుజన వర్గాలు ఈ సభకు హాజరై సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి బీసీలు, యువత, మహిళలు, బహుజన రాజ్యాన్ని కాంక్షించే వారంతా ఈ సింహగర్జనలో పాల్గొనాలని బేరి రామచంద్ర యాదవ్ అభ్యర్థించారు. బోడె రామచంద్ర యాదవ్‌కు రెండు రాష్ట్రాల తరఫున తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాలుపంచుకున్నారు. బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ ఓరుగంటి వెంకటేష్ యాదవ్, ఆర్గనైజర్ సెక్రటరీ హరి కృష్ణ చారి, ఉపాధ్యక్షులు ఈశ్వరన్న, బీసీ కులాల ఐక్యవేదిక నేత ఆర్కే సాయన్న ముదిరాజ్, మేదరి మహేంద్ర సంఘం యువజన విభాగం అధ్యక్షులు సుమన్, గౌరవ సలహాదారులు పట్లూరి కృష్ణమోహన్, శేరిలింగంపల్లి మాదాపూర్ యాదవ్ సంఘం ప్రతినిధి ఎర్రగుంట్ల వెంకటేష్ యాదవ్, పల్నాడు యాదవ సంఘం నాయకులు, సినిమా డైరెక్టర్ మురళి యాదవ్, యాదవ్ కులాల జేఏసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్ యాదవ్, బీసీ నాయకులు ఈశ్వరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుల్వామా అమరవీరులకు ఘన నివాళి

- గొల్లపల్లి అంబేద్కర్ కూడలిలో కొవ్వొత్తుల ప్రదర్శన..



**గొల్లపల్లి, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలర్పించిన భారత జవాన్ల త్యాగాలను స్మరిస్తూ గొల్లపల్లి మండల కేంద్రంలో ఘన నివాళులర్పించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద సామాజిక సేవా కార్యకర్త గంగాధర మధుసూదన్ ఆధ్వర్యంలో అమర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ స్థానిక యువకులు కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త గంగాధర మధుసూదన్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన జవాన్ల త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. వారి ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. "భారత్ మాతా కీ జై", "అమరవీరులకు జోహార్" అంటూ చేసిన నినాదాలు కూడలిలో మిన్నంటాయి. ఈ నివాళి కార్యక్రమంలో చీపెల్లి పోశయ్య, ఏనుగుమట్ల సాగర్, సందుపట్ల చంద్రమౌళి, భ్రమ్మరౌతు వర్మ, తుడుం కార్తీక్, కుంటాల రిత్విక్, వర్షిత్, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జవాన్లకు తమ నివాళులు అర్పించారు.



# నల్లగండ్లలో 'ఫుట్ బాల్ ఫర్ స్కూల్స్' ప్రారంభం

- విద్యార్థులకు ఫుట్ బాల్ ల పంపిణీ.. ప్రారంభించిన ఆరెకపూడి గాంధీ
- క్రీడలతోనే మానసిక దృఢత్వం.. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపు



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు 'ఫుట్ బాల్ ఫర్ స్కూల్స్' కార్యక్రమం వేదికగా నిలుస్తోంది. గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలోని పీఎం జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఫుట్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ పాల్గుణతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**విశ్వవిజేతలుగా నిలవాలి**

ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ విద్యార్థులకు ఫుట్ బాల్ లను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటాలని కోరారు. పట్టుదలతో కృషి చేసి అంతర్జాతీయ వేదికలపై పథకాలు సాధించి విశ్వవిజేతలుగా ఎదగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. క్రీడల వల్ల శారీరక శ్రమతో పాటు మానసిక దృఢత్వం లభిస్తుందని గాంధీ తెలిపారు. ఆటలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, విద్యార్థుల మధ్య స్నేహ భావం పెంపొందుతుందని వివరించారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం గచ్చిబౌలి ప్రిన్సిపాల్ జితేంద్ర కుమార్, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, ఆఫీసు సూపరిటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మంత్రిపగడ సత్యనారాయణ, విష్ణు వర్ధన్ రెడ్డి, అనిల్, ప్రభాకర్, వేణు గోపాల్ రెడ్డి, నగేష్, శ్రీశైలం, హాజరయ్యారు.

# బీకేఎస్ దక్షిణ భారత కన్వీనర్‌గా యర్రం శ్రీరాంరెడ్డి

**రైతుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని వెల్లడి**

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

దేశంలోని ప్రముఖ ప్రజాస్వామ్య రైతు సంస్థ భారతీయ కిసాన్ సంగతన్ (బీకేఎస్) దక్షిణ భారత కన్వీనర్‌గా యర్రం శ్రీరాంరెడ్డి నియమితులయ్యారు. రైతుల సమగ్ర అభివృద్ధి, స్వావలంబన, ప్రభుత్వ పథకాల అమలును బలోపేతం చేసే దిశగా ఆయన నియామకం జరిగినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. దక్షిణ భారత రాష్ట్రాల్లో వ్యవసాయ నూతన సాంకేతికతను ప్రోత్సహించడం, ప్రభుత్వ పథకాల లబ్ధిని రైతులకు చేరేలా సమన్వయం చేయడం తన ప్రధాన లక్ష్యమని బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీరాంరెడ్డి స్పష్టం చేశారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు లాంటి ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని చివరి రైతు వరకు అందేలా విశేష కృషి చేస్తానని ఆయన తెలిపారు. పంట బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్ పీ) హామీ కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. అప్పుల బారిన పడిన రైతులకు తక్షణమే ఉపశమనం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు దేశానికి వెన్నెముక మాత్రమే కాదని, దేశ జీవనాడి అని ఆయన అభివర్ణించారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించిన బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, కన్వీనర్ యర్రం వెంకటరెడ్డికి శ్రీరాంరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్టీఆర్ నగర్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**ఘనంగా నివాళులర్పించిన ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్**



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్‌లో సంత్ సేవాలాల్ మహారాజు 287వ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. రాజు నాయక్, పల్లెపు సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులు పాల్గొని మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను కొనసాగించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేంద్ర, పల్లెపు సురేంద్ర, షేక్ బాబా తదితరులు పాలుపంచుకున్నారు.

# జగన్నాథం చిత్రపటానికి ఎర్ర శేఖర్ నివాళి

**దశదిన కర్మలో పాల్గొన్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే**



**దేవరకద్ర, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండలం యురోనిపల్లిలో శనివారం నిర్వహించిన దశదిన కర్మలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు. హన్వాడ వెంకటయ్య తండ్రి శావుకుల జగన్నాథం మృతి చెందడంతో ఆయన దశదిన కార్యక్రమానికి ఎర్ర శేఖర్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్నాథం చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

# సర్వాంగ సుందరంగా ఏడుపాయల ఆలయం

**పది లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం.. పకడ్బందీగా ఏర్పాట్లు**

**పాపన్నపేట, ఫిబ్రవరి 14:** పాపన్నపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాత ఆలయం మహా శివరాత్రికి అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహారాష్ట్ర, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం స్నానఘట్టాలు, మరుగుదొడ్ల వద్ద ప్రత్యేక పరిశుభ్రత చర్యలు తీసుకున్నామని ఆలయ ఈవో వీరేశం తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది జాతరకు సుమారు పది లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భక్తులకు ట్రాఫిక్, తాగునీరు, పార్కింగ్, దర్శన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతరను ప్రశాంతంగా ముగించాలని కలెక్టర్ ఆదేశించారు.



# బైరామాల్ గూడ ఫ్లైఓవర్‌కు జ్యోతిరావు పూలే పేరు పెట్టాలి

**త్యాగాలు చేయని వ్యక్తుల పేర్లు తగవు: వెంకటేష్ గౌడ్**

**పూలేకు భారత రత్న ఇవ్వాలని డిమాండ్**



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

ఎల్బీనగర్ పరిధిలోని బైరామాల్ గూడ ఫ్లైఓవర్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు నామకరణం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇంచార్జ్ బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. స్వార్ధ రాజకీయాల కోసం ఎలాంటి త్యాగం చేయని వ్యక్తుల పేర్లు ఫ్లైఓవర్లకు పెట్టడం ఏమాత్రం సబబు కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్తలని వెంకటేష్ గౌడ్ కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని ఆనాడే చాటిచెప్పిన మహానుభావుడు జ్యోతిబా పూలేకు భారత రత్న ప్రకటించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా భవన్‌కు జ్యోతిబా పూలే పేరు పెట్టారని ఆయన గుర్తుచేశారు. ఎల్బీనగర్ ప్రాంతంలో బీసీ సమాజం బలంగా ఉందని, అందుకే ఇక్కడ పూలే విగ్రహం కూడా ఏర్పాటు చేశారని వివరించారు. సమాజం కోసం ఎలాంటి పోరాటాలు చేయని వ్యక్తుల పేర్లను కేవలం వ్యక్తిగత స్వార్థం కోసం ఫ్లైఓవర్లకు పెట్టాలని కొందరు నాయకులు తహతహలాడుతున్నారని మండిపడ్డారు. అలాంటి ధోరణి ఏమాత్రం మంచిది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్, హైదరాబాద్ ఇంచార్జ్ బావన, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల యువజన విభాగం అధ్యక్షుడు పాకాల నరసింహ, సింగం అరుణ్, ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు సంపత్ ప్రసాద్, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు స్వామి ముదిరాజ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చుతో తాగునీటి కష్టాలు తీర్చిన మాజీ కార్పొరేటర్

**బోరు మరమ్మతుకు ఏడు వేల రూపాయల ఆర్థిక సాయం**

**పదవి ఉన్నా లేకున్నా ప్రజల పక్షానే ఉంటా: కొప్పుల నర్సింహ్మారెడ్డి**



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

ఎల్బీనగర్ లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని హయత్ నగర్ వీరన్న గుట్ట షిరిడీ సాయి నగర్ కాలనీ బస్తీ దవాఖాన వద్ద పవర్ బోరు పాడైంది. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో మరమ్మతులు నోచుకోక కాలనీవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించారు. బోరు మరమ్మతు కోసం స్వయంగా ఏడు వేల రూపాయలు వెచ్చించి నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ వీరన్న గుట్ట ప్రాంతంలో దాదాపు ఎనిమిది బోర్లు ఉండగా, ప్రతిసారీ కాలనీవాసులే సొంత డబ్బులతో మరమ్మతులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించానని, అధికారుల సమన్వయంతో నిధులు మంజూరు చేయించి ఐదు కొత్త బోర్లు వేయించినట్లు గుర్తు చేశారు. తనకు పదవి ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల పక్షానే ఉంటూ సమస్యల పరిష్కారానికి ముందుంటానని నర్సింహ్మారెడ్డి స్పష్టం చేశారు. తన పదవీ కాలంలో మంజూరైన పది కోట్ల రూపాయల అభివృద్ధి పనులు రానున్న ఆరు నెలల పాటు నిరాటంకంగా కొనసాగుతాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరసింహ యాదవ్, కార్యదర్శి కోటయ్య ముదిరాజ్, రవి, రమేష్ చారి, కడారి వెంకటేష్, యుగేంద్ర చారి, వెంకన్న, పరశురాములు, చిన్న యాదవ్, గోపి, బ్రహ్మచారి, ధనమ్మ, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాతృదేవోభవ ఆశ్రమానికి కేఎల్ఆర్ 10 లక్షల విరాళం



**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

నాదర్‌గుల్ డివిజన్‌లోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమానికి మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) అండగా నిలిచారు. ఆశ్రమాన్ని సందర్శించిన ఆయన.. మతిస్థిమితం లేని అభాగ్యులను చేరదీస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరిని అభినందించారు. ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి కేఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా పది లక్షల రూపాయల విలువైన సామగ్రిని విరాళంగా అందిస్తానని ప్రకటించారు. అనంతరం అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. బడుగు, బలహీన వర్గాలు, అభాగ్యులకు జీవితాంతం సేవ చేసేందుకే తమ ట్రస్ట్ స్థాపించినట్లు లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# గ్రామ గ్రామాన గ్రంథాలయాలు స్థాపించాలి

- విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించాలి: ఆచార్య లక్ష్మణరావు
- నల్గొండలో గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో సదస్సు



**నల్గొండ, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

తెలంగాణలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వమే గ్రంథాలయాలను స్థాపించాలని తెలంగాణ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య లక్ష్మణరావు కోరారు. గ్రామాల్లో వసూలు చేస్తున్న పన్నును విధిగా గ్రంథాలయాలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రంథాలయ సంఘం, నల్గొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక సదస్సును నిర్వహించారు.

**విద్యార్థుల్లో పఠనాసక్తి పెరగాలి**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య లక్ష్మణరావు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించవచ్చని సూచించారు. స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకొచ్చి గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తే తెలంగాణ గ్రంథాలయ సంఘం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు.

**ప్రభుత్వ సహకారం తప్పనిసరి**

సదస్సులో పాల్గొన్న గౌరవ అతిథులు మాట్లాడుతూ.. గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఉన్నతుల ఆర్థిక సాయంతో స్వచ్ఛందంగా వీధివీధినా కమ్యూనిటీ గ్రంథాలయాలు నెలకొల్పాలని సూచించారు. గ్రంథాలయాలు కలకాలం మనుగడ సాగించాలంటే పాఠశాలలు, పౌర గ్రంథాలయాల్లో తక్షణమే గ్రంథపాలకుల నియామకం చేపట్టాలని కోరారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ తరపున గ్రంథాలయాలకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతినిధులు తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ ప్రాంతంలో స్వాతంత్ర్యానికి ముందే గ్రంథాలయాలు ఉండేవని, ఆ సంస్కృతి ఇప్పుడు తిరిగి పునర్వికాసం చెందాలని వక్తలు ఆకాంక్షించారు. తెలంగాణలో గ్రంథాలయ ఉద్యమం మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోనా రెడ్డి, డాక్టర్ బెల్లి యాదయ్య, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికుమార్ చేగోని, గాద వినోద్ రెడ్డి, డాక్టర్ రాజారాం సుంకరి పాల్గొన్నారు. వీరితో పాటు కవి మూనాస వెంకట్, విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, గడ్డం సత్యనారాయణ, నాగభూషణం, సుధారాణి, బైరెడ్డి కృష్ణారెడ్డి, మేరెడ్డి యాదగిరి రెడ్డి, ఎలికట్ట శంకర్, డాక్టర్ హస్సేనా, అంబటి వెంకన్న, కస్తూరి ప్రభాకర్, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వట్టికూటి వెంకటేశ్వర్లు, పగడాల నరేందర్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ లక్పతి, మోత్కూరు శ్రీనివాస్, పడిశాల నాగరాజు, బుచ్చిరాములు, రాజగౌడ్, పల్లె సతీష్, డాక్టర్ బేబీ కుంజ, భావన రుషి, ఇతర రచయితలు, కవులు, కళాకారులు, గ్రంథపాలకులు, పరిశోధకులు హాజరయ్యారు.



# రాంపల్లిలో ఆల్ఫాబెట్జ్ ప్రీ స్కూల్ వార్షిక క్రీడోత్సవాలు

- క్రీడలతోనే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ
- చదువుతో పాటు ఆటలకూ సమాన ప్రాధాన్యత: డైరెక్టర్ దూపటి సురేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

రాంపల్లిలోని ఆల్ఫాబెట్జ్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ 2025ఉ26 వార్షిక క్రీడోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దూపటి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు స్థానిక నాయకులు, ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే ఆటల పట్ల ఆసక్తి పెంచితే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన మార్చ్ పాస్ట్, వార్మప్ వ్యాయామాలు, యోగా ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా పోటీల్లో సత్తా చాటిన చిన్నారులకు అతిథులు మెడల్స్, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం చదువుతో పాటు క్రీడలకూ తమ పాఠశాలలో సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ దూపటి సురేష్ వెల్లడించారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను, నైపుణ్యాలను వెలికితీసేందుకే ఇలాంటి క్రీడోత్సవాలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షుడు ఎలసాని నాగరాజు యాదవ్, రామారం మహేందర్ గౌడ్, రాంపల్లి ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు బందెల పరమేష్, బీఆర్ఎస్ నాయకులు కొండేటి లక్ష్మా రెడ్డి, కోట్ల సుభాష్ గౌడ్, పాఠశాల సెంటర్ హెడ్ దూపటి స్రవంతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలి

- చైతన్య టెక్నో స్కూల్ వార్షికోత్సవంలో ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ
- ఉప్పల్ శిల్పారామంలో అట్టహాసంగా వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**ఉప్పల్, ఫిబ్రవరి 14 (మనసులో మాట):**

విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని చైతన్య టెక్నో స్కూల్ నారాయణగూడ జోన్ ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ స్పష్టం చేశారు. ఉప్పల్ శిల్పారామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నారాయణగూడ జోన్ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ డాన్స్ మాస్టర్ యాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాత్రి పది గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక, సాంప్రదాయ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలోచింపజేసే సందేశాత్మక స్కిట్లు, ఉత్సాహభరితమైన ఆటపాటలు చిన్నారుల్లో దాగిన అద్భుత ప్రతిభను వెలికితీశాయి. విద్యార్థుల ప్రదర్శనలను వారి తల్లిదండ్రులు ఆసాంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ఈ వేడుకల్లో బర్కత్‌పుర, హిమాయత్‌నగర్, నల్లకుంట, నాచారం, హబ్సిగూడ, తార్నాక, మేడిపల్లి బ్రాంచీలకు



చెందిన చైతన్య టెక్నో స్కూల్ కార్డినల్స్, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సకల పాపహరుడు.. భక్త సులభుడు ఆ పరమేశ్వరుడు!



సృష్టి, స్థితి, లయ కారకుడు.. ముక్కంటి దేవుడు.. భక్త సులభుడు ఆ పరమశివుడు. హిందూ ధర్మంలో లయకారుడిగా, సర్వోన్నతమైన దేవుడిగా పూజింపబడే పరమేశ్వరుడు భక్తుల పాలిట కల్పవృక్షం. శివ అంటేనే శుభం. ఆ నిరాకార పరబ్రహ్మ సాకార రూపమే శివలింగం. మహా శివరాత్రి హిందూ మతంలో అత్యంత పవిత్రమైన పండుగలలో ఒకటి. ఈ ఏడాది మహా శివరాత్రి పండుగ ఫిబ్రవరి 15 ఆదివారం నాడు వచ్చింది. ప్రతి నెలా వచ్చే శివరాత్రిని 'మాస శివరాత్రి' అని పిలుస్తారు, అయితే మాఘ మాసంలో వచ్చే దానిని అత్యంత పవిత్రమైన 'మహా శివరాత్రి'గా జరుపుకుంటారు.



## శివరాత్రి విశిష్టత, ఆచారాలు

**శివ పార్వతుల కళ్యాణం:** ఈ రోజున శివుడు, పార్వతీ దేవిల వివాహం జరిగిందని భక్తులు విశ్వసిస్తారు. ఇది పురుష (శివ) మరియు ప్రకృతి (శక్తి) శక్తుల కలయికకు చిహ్నం.

**లింగోద్భవం:** శివుడు అనంతమైన జ్యోతిర్లింగ రూపంలో ఆవిర్భవించిన రోజుగా దీనిని పరిగణిస్తారు.

**ఉపవాసం మరియు జాగరణ:** భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, రాత్రంతా మేల్కొని (జాగరణ) శివ నామస్మరణ, అభిషేకాలు మరియు పూజలు నిర్వహిస్తారు.

**క్షీరసాగర మథనం:** లోక రక్షణ కోసం శివుడు హాలాహలాన్ని (విషాన్ని) మింగి నీలకంఠుడైన సందర్భాన్ని కూడా ఈ రోజే స్మరించుకుంటారు.

**ఆధ్యాత్మిక శక్తి:** యోగ శాస్త్రం ప్రకారం, ఈ రాత్రి భూమి యొక్క ఉత్తరార్ధగోళంలో ప్రకృతి సిద్ధంగా శక్తి ఊర్ధ్వ ముఖంగా ప్రవహిస్తుంది. అందుకే వెన్నెముక నిటారుగా ఉంచి జాగరణ చేయడం వల్ల ఆధ్యాత్మిక ఉన్నతి కలుగుతుందని భావిస్తారు.

*మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, శివతత్వం, పంచారామాలు, ప్రముఖ శైవ క్షేత్రాల విశేషాలపై ప్రత్యేక కథనం..*

## లింగోద్భవం - అహంకారాన్ని అణిచిన అగ్నిస్తంభం

పురాణాల ప్రకారం, ఒకానొక సమయంలో బ్రహ్మ, విష్ణువుల మధ్య 'ఎవరు గొప్ప' అనే వివాదం తలెత్తింది. వారి అహంకారాన్ని అణచడానికి పరమశివుడు ఆద్యంతాలు లేని ఒక మహా అగ్ని స్తంభం రూపంలో వెలిశాడు. విష్ణువు వరాహ రూపంలో అడుగు భాగాన్ని, బ్రహ్మ హంస రూపంలో పైభాగాన్ని కనుగొనలేక శివుడిని శరణు వేడారు. ఆ మహాగ్ని స్తంభం ఆవిర్భవించిన సమయమే 'లింగోద్భవ కాలం'. మాఘ బహుళ చతుర్దశి నాటి అర్ధరాత్రి వేళ జరిగే ఈ లింగోద్భవ పూజ అత్యంత ఫలప్రదమని భక్తుల నమ్మకం.





## ఆంధ్రప్రదేశ్‌లో పుణ్య క్షేత్రాలు - పంచారామాలు

*తారకాసురుని సంహరించినప్పుడు అతని గొంతులోని ఆత్మలింగం ఐదు ముక్కలై పడిన ప్రదేశాలే 'పంచారామాలు'గా ప్రసిద్ధి చెందాయి.*



1. **అమరారామం (అమరావతి):** ఇంద్రుడిచే ప్రతిష్ఠించబడిన అమరేశ్వర స్వామి క్షేత్రం.
2. **ద్రాక్షారామం (కోనసీమ):** దక్షిణ కాశీగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో భీమేశ్వర స్వామి కొలువై ఉన్నాడు. ఇక్కడ సప్త గోదావరి తీర్థం ప్రత్యేకత.
3. **కుమారారామం (సామర్లకోట):** కుమారస్వామిచే ప్రతిష్ఠించబడిన 14 అడుగుల ఎత్తైన భీమేశ్వర లింగం ఇక్కడ విశేషం.
4. **సోమారామం (భీమవరం):** చంద్రుడి పేరు మీద వెలసిన సోమేశ్వర స్వామి లింగం అమావాస్యకు, పౌర్ణమికి రంగులు మారుతుంటుంది.
5. **క్షీరారామం (పాలకొల్లు):** శ్రీరాముడిచే ప్రతిష్ఠించబడిన రామలింగేశ్వర స్వామి క్షేత్రం. ఇక్కడి రాజగోపురం అత్యంత ఎత్తైనది.







## శ్రీశైల జంట నందుల గాథ

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో ఒక ఆసక్తికరమైన కథ ఉంది. బసవాచార్యుడనే శిల్పి తన భక్తితో రెండు నందులను చెక్కి, వాటిని శ్రీశైలం చేర్చాలనుకున్నాడు. శివుడు కలలో కనిపించి వాటికి పలుపు త్రాళ్లు కట్టి వెనక్కి చూడకుండా తీసుకురమ్మన్నాడు. అయితే, పాతాళగంగ దాటే సమయంలో ఒక నంది కాలు ఇరుక్కుపోవడంతో శిల్పి వెనక్కి తిరిగి చూశాడు. దాంతో ఆ నంది అక్కడే శిలగా మారిపోయింది. అదే 'ఉబ్బలి బసవన్న'. ప్రస్తుతం ఇది శ్రీశైలం ప్రాజెక్టు నీటిలో 700 అడుగుల లోతున ఉందని చరిత్ర చెబుతోంది.

## నది మధ్యలో వెలసిన వీరభద్రుడు - పట్టిసం

అఖండ గోదావరి నది మధ్యలో, దేవకూటాద్రి పర్వతంపై స్వయంభూగా వెలిసిన క్షేత్రం 'పట్టిసం'. దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేసిన తర్వాత వీరభద్ర స్వామి ఇక్కడ ఉగ్రరూపంతో వెలిశారని పురాణాలు చెబుతున్నాయి. ప్రకృతి ఒడిలో, నది మధ్యలో వెలసిన ఈ క్షేత్రం పంచకాశీ క్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతోంది.

## శివారాధన - మోక్ష మార్గం

"నమఃశివాయ" అనే పంచాక్షరీ మంత్రం సకల శక్తివంతమైనది. ఆధ్యాత్మిక పురోగతికి శివ స్వరూపాన్ని ఆరాధించాలని పురాణాలు బోధిస్తున్నాయి. శైవమతంలోని షణ్మతాలలో శివుడే సర్వోన్నతుడు. పంచభూత లింగాలుగా (పృథ్వి, జల, అగ్ని, వాయు, ఆకాశం) ప్రకృతిలోని ప్రతి అణువులోనూ శివుడు నిండి ఉన్నాడు. నిరంతర శివ స్మరణ చేసే వారి హృదయమే కైలాసమని, వారిలోని కామక్రోధాదులు శమించి నిరంతరానందం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

"లోకాః సమస్తాః సుఖినోభవంతు"

- ఓం శాంతిః శాంతిః శాంతిః



పి. రామమూర్తి
సీనియర్ జర్నలిస్టు
రాజమహేంద్రవరం



# మహా శివరాత్రి చరిత్ర

మహా శివరాత్రి పండుగకు సంబంధించిన అనేక ఇతిహాసాలు, పురాణాలు, కథలు ఉన్నాయి. మహా శివరాత్రి పండుగ శివుడు, పార్వతి దేవి వివాహం జరిగిన పవిత్ర రాత్రిని సూచిస్తుంది. చాలా సంవత్సరాలు ధ్యానం, తపస్సు చేసిన తరువాత, మహా శివరాత్రి రోజున, శివుడు పార్వతిని తన దైవిక భార్యగా స్వీకరించాడు. మరొక కథ ప్రకారం, శివుడు తాండవ నృత్యం చేసిన రాత్రి ఇది. ఈ రాత్రి శివుడు తాండవ నృత్యాన్ని ప్రదర్శించాడని నమ్ముతారు. అందువల్ల, భక్తులు రాత్రంతా ప్రార్థనలు, పూజలు, మంత్రాలు జపిస్తూ శివుడిని పూజిస్తారు. మహా శివరాత్రికి సంబంధించిన మరొక కథ ప్రకారం, ఈ రోజున, శివుడు సముద్ర మథనం నుండి వచ్చిన హాలాహల విషాన్ని సేవించాడు. ఈ విషం మొత్తం విశ్వాన్నే నాశనం చేసే శక్తిని కలిగి ఉంది. శివుడు ఆ విషాన్ని స్వయంగా సేవించి విశ్వాన్ని రక్షించాడని 'నీలకంఠ' అని పిలుస్తారు.

# చరాచర సృష్టికి లయకారకుడు భోళాశంకరుడు

## నేడు మహా శివరాత్రి

హిందువులు ఆచరించే ఒక అతి ముఖ్యమైన పండగ మహా శివరాత్రి. శివ,పార్వతుల వివాహం రోజు కాబట్టి మహాశివుడు తాండవిస్తాడని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రికి మాత్రం ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. ప్రతీ చాంద్రమాన మాసం లోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు రోజుని శివరాత్రి అంటారు. పంచాంగ సంవత్సరం లో వచ్చే పన్నెండు శివరాత్రులలో ఫిబ్రవరి ఉ మార్చ్ నెలలో వచ్చేదానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఈ రాత్రి, భూమి ఉత్తరార్ధగోళం ఎటువంటి స్థితిలో ఉంటుందంటే, మనిషిలోని శక్తి సహజంగానే ఉప్పొంగుతుంది. ఈ రోజున ప్రకృతి మిమల్ని ఆధ్యాత్మిక శిఖరానికి నెడుతుంది. దీనిని ఉపయోగించుకోవడానికే, ఈ సంస్కృతిలో రాత్రంతా జరిపే ఈ పండుగను నెలకొల్పారు. మనం తెల్లవార్లూ జాగారం చేసి మన వెన్నెముకను నిటారుగా ఉంచడం ద్వారా ఇలా శక్తులు సహజంగా పైకి ఎగసి పడడానికి సహకరించవచ్చు. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి మహాశివరాత్రి ఎంతో ప్రముఖమైనది. కుటుంబ పరిస్థితులలో ఉన్నవారికి, ప్రపంచంలో గాఢమైన ఆకాంక్ష ఉన్నవారికి కూడా మహాశివరాత్రి ఎంతో ఆవశ్యకం. కుటుంబ పరిస్థితులలో నివసించేవారు, మహాశివరాత్రిని శివుని పెళ్లిరోజుగా చూస్తారు. ప్రాపంచిక లక్ష్యాలతో ఉన్నవారు, ఈ రోజును శివుడు తన శత్రువులందరినీ జయించిన రోజుగా చూస్తారు. కానీ సన్యాసులకు మాత్రం ఈ రోజు ఆయన కైలాష పర్వతంతో ఒకటయిన రోజు. ఆయన పరిపూర్ణ నిశ్చలత్వంతో, పర్వతంలా అయిపోయాడు. కానీ యోగ సంప్రదాయంలో శివుణ్ణి దేవుడిగా భావించరు, యోగ శాస్త్రానికి మూలకారకుడైన ఆదియోగి లేదా ఆదిగురువుగా చూస్తారు. ధ్యానంలో ఎన్నో వేల సంవత్సరాలు ఉన్న తరువాత ఒకరోజు ఆయన పూర్తిగా నిశ్చలుడయ్యాడు. ఆ రోజే మహాశివరాత్రి. ఆయనలోని అన్ని కదలికలు ఆగిపోయి సంపూర్ణంగా నిశ్చలుడయ్యాడు. అందుకనే మహాశివరాత్రిని సన్యాసులు నిశ్చలత్వానికి ప్రతీకమైన రాత్రిగా చూస్తారు.



### శివరాత్రి పర్వదినానికి ఉపవాసం, జాగారం ముఖ్యం



**కంచర్ల అచ్యుతరావు**
**ఎడిటర్, మనసులో మాట**

*మీ అందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు*

ఈ చరాచర సృష్టికి లయకారకుడు మహేశ్వరుడు. పరమేశ్వరుడు లింగోద్భవం చెందిన రోజునే మహాశివరాత్రి. ఈ జగత్తును నడిపించే శివుడు మాఘ మాసం బహుళ చతుర్ధశి రోజున శివలింగంగా ఆవిర్భవించిన రోజు కావడంతో మహాశివరాత్రి జరుపుకుంటారు. శివ అనే పదానికి శుభప్రదం, మంగళకరం అన్న అర్థాలు ఉన్నాయి. శివరాత్రి రోజున ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండడంతో పాటు జాగరణ చేయాల్సిందే. మహాశివరాత్రి, లింగోద్భవానికి సంబంధించిన ఓ పురాణ కథ ఉన్నది. లింగ పురాణం, శివ పురాణం, స్కంద పురాణం, కూర్మ పురాణం, వామన పురాణం, బ్రహ్మాండ పురాణం, వాయు పురాణం వంటి అనేక పురాణాల్లో లింగోద్భవం గురించి ప్రస్తావన ఉంటుంది. పూర్వం విష్ణువు, బ్రహ్మల మధ్య ఎవరు గొప్ప అనే వివాదం తలెత్తింది. ఈ వివాదం ఎప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ సమయలో పరమేశ్వరుడు ప్రత్యక్షమై.. లింగంగా జ్యోతిర్లింగంగా ఆవిర్భవిస్తాడు. ఆ మహా శివలింగానికి ఆది, అంతాలను కనిపెట్టిన వారే గొప్పవారని బ్రహ్మ, విష్ణువులకు చెబుతారు. ఇద్దరూ ఈ శివలింగం ఆది, అంతాలను గుర్తించలేకపోతారు. ఆ తర్వాత ఇద్దరికీ కనువిప్పు కలుగుతుంది. పరమేశ్వరుడు లింగంగా ఆవిర్భవించిన ఈ రోజునే శివరాత్రిగా పండితులు చెబుతారు. అయితే, ప్రళయ కాళరాత్రి అనంతరం.. జగన్మాత కోరిక మేరకు పరమేశ్వరుడు మళ్లీ జీవకోటిని ఉద్భవింపజేసినట్లుగా పురాణాలు పేర్కొంటున్నాయి. ఇక శివరాత్రి రోజు ఉపవాసం ఉండడం, జాగరణ చేయడం సంప్రదాయంగా వస్తున్నది. శివరాత్రికి ముందు రోజు ఒక్కపూట మాత్రమే భోజనం చేయాలి. శివరాత్రి రోజున ఉదయం స్నానం పూర్తి చేసుకొని ఆలయానికి వెళ్లి ఆ మహేశ్వరుడి దర్శనం చేసుకొవాలి. నిత్యం శివనామస్మరణ చేస్తూ ఉపవాసం చేయాలి. రాత్రి వేళలో శివలింగానికి పూజలు చేస్తూ.. జాగరణ చేయాలి. ఉపవాసం, జాగరణం, బిల్వార్చన, అభిషేకం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటే శివానుగ్రహం తప్పక లభిస్తుంది. వాస్తవానికి.. అందరు దేవతామూర్తులను వారి రూపంలో ఉండే విగ్రహాలను కొలుస్తాం. అయితే, కేవలం శివుడిని మాత్రమే లింగంగా పూజిస్తాం. నిండు మనసు, భక్తితో కొలిస్తే ఆ భోళాశంకరుడు ప్రత్యక్షమై వరాలను కురిపిస్తాడు. క్షీరసాగర మధనతో బయటకు వచ్చి.. యావత్ సృష్టిని దహించేందుకు సిద్ధమైన హాలాహలాన్ని కంఠంలోనే దాచుకొని నీలకంఠుడిగా నిలిచాడు. తన శరీరంలోనే పార్వతీదేవికి అర్ధభాగం ఇచ్చి అర్ధనారీశ్వరుడయ్యాడు. యముడి బాధ నుంచి రక్షించాలని కోరిన భక్త మార్కండేయుడిని చిరంజీవిగా దీవించాడు ఆ మహేశ్వరుడు. లింగోద్భవ సమయంలో మారేడు దళాలతో అర్చిస్తే 76 జన్మల్లో చేసిన పాపలు నశిస్తాయని సాక్షాత్తు ఆ శంకరుడే పార్వతీదేవికి చెప్పినట్లుగా పురాణాలు పేర్కొంటున్నాయి. లింగోద్భవ కాలంలో పరమేశ్వరుడిని జలంతో అభిషేకించడం, భస్మం సమర్పించడం కూడా శుభకరమని పండితులు పేర్కొంటున్నారు.




## ఉపవాసం ఎలా ఆచరించాలి ?

నీరు లేకుండా ఉపవాసం ఉండటం లేదా పండ్లు తినడం లేదా రోజంతా సాత్విక ఆహారం తీసుకోవడం ద్వారా ఉపవాసం చేయవచ్చు. అయితే, నిర్జల ఉపవాసానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. శివాలయాలను సందర్శించి రుద్రాభిషేకం, శివ మంత్రాలను పఠించండి. "ఓం నమః శివాయ" జపించండి. రాత్రి జాగరణ చేసి 4 సార్లు శివ పూజ చేయండి. మరుసటి రోజు ఉదయం ప్రార్థన చేసిన తర్వాత ఉపవాసం ముగించవచ్చు.

శివరాత్రి రోజున ఉపవాసం ఉండి, జాగారం చేస్తే పాపాలన్నీ నశిస్తాయని, పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. ఉదయానే లేచి తలస్నానం చేసి పూలూ ఫలాలతో శివునికి పూజ చేస్తారు. ఈరోజున ప్రతి దేవాలయమూ కిక్కిరిసి ఉంటుంది. ఇక శివాలయాల సంగతి చెప్పనవసరమే లేదు. ఇసుక వేస్తే రాలనట్టు భక్తుల రద్దీ కనిపిస్తుంది. అభిషేకాలు, పూజలతో పరమశివుని ఆరాధిస్తారు. భక్తుల పాలిట కల్పతరువు అయిన శివునికి ఈ విశిష్ట దినాన రోజంతా ప్రత్యేక పూజలు జరుపుతారు. రాత్రి కూడా దేవాలయాలు తెరిచే ఉంటాయి. పూజలు, భజనలతో శివనామం మారుమోగుతుంటుంది. ఈ పర్వదినాన లింగాష్టకం , శివ పంచాక్షరి జపిస్తారు. దీపారాధన చేసి, భక్తిప్రపత్తులతో రుద్రాభిషేకం చేస్తారు. శివపార్వతుల కల్యాణం చేస్తారు. రోజంతా పరమేశ్వరుని ప్రార్థనలతో, చింతనలో గడిపి, రాత్రి జాగారం చేస్తారు. శివరాత్రి పర్వదినానికి ఉపవాసం, జాగారం ముఖ్యం. భక్తులు ఈరోజున పరమేశ్వరుని ఆరాధించడమే కాకుండా ఏ తప్పులూ చేయకూడదని, అబద్ధాలు చెప్పకూడదని విశ్వసిస్తారు. ఏడాది పొడుగునా ఏ పూజలూ చేయనివారు కూడా మహా శివరాత్రి నాడు ఈశ్వరుని ప్రార్థించి శివ సన్నిధి పొందినట్లు పురాణాలలో ఎన్నో కథలు ఉన్నాయి. ఆఖరికి పాపాత్ములు కూడా శివరాత్రి రోజున అనుకోకుండా నియమాలు పాటించినా సరే ముక్తి లభిస్తుంది అంటారు. గుణనిధి కథ ఇందుకు సాక్ష్యం. శివుని ప్రసన్నం చేసుకోవడం చాలా తేలిక. అందుకే "భక్తవశంకర" అన్నారు. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన గుణనిధికి ఏ ఆచారాలూ పట్టవు. దుర్గుణాలన్నీ అలవరచు కుంటాడు. అన్ని విధాలుగా పతనమైన అతను మహా శివరాత్రి నాడు కావాలని కాకున్నా, అన్నం దొరక్క ఉపవాసం ఉంటాడు. ప్రసాదం దొరుకుతుందనే ఆశతో దేవాలయానికి వెళ్తాడు. చీకటిలో కనిపించక అవసరం కోసం దీపం వెలిగిస్తాడు. జాగారంలో తూగుతున్న భక్తుల అలికిడికి భయపడి పారిపోబోయి అనుకోకుండా శివ సన్నిధిలో ప్రాణాలు విడుస్తాడు. ఆవిధంగా ముక్తి పొందుతాడు. అదీ సంగతి. శివరాత్రి మహత్యం అంతటిది.



# స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం




టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ అద్భుత విజయం సాధించింది. 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. వెస్టిండీస్ చేతిలో ఓటమి తర్వాత డీలా పడ్డ ఇంగ్లాండ్‌కు ఈ గెలుపు టానిక్‌లా పనిచేసింది. మొదట బౌలింగ్లో అదిల్ రషీద్ మాయ చేయగా, ఛేజింగ్ లో టామ్ బాంటన్ వీరోచిత ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. స్కాట్లాండ్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే, 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ తన సూపర్-8 అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ సారథి హ్యారీ బ్రూక్ బౌలింగ్ ఎంచుకోవడంతో స్కాట్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ఇంగ్లీష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు స్కాట్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు నిర్ణీత 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్కాట్లాండ్ తరపున రిచీ బెరింగ్టన్ 49 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, టామ్ బ్రూస్ 24 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వెటరన్ స్పిన్నర్ అదిల్ రషీద్ 36 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), జాస్ బట్లర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా స్వీప్ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. దీంతో ఇంగ్లాండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన టామ్ బాంటన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు చేశాడు. ముఖ్యంగా మార్క్ వాట్ వేసిన ఒకే ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. సామ్ కరన్ (28) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో విల్ జాక్స్ విన్నింగ్ షాట్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టామ్ బాంటన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్-సి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపచుకుని తదుపరి దశకు వెళ్లే అవకాశాలను పెంచుకుంది. మరోవైపు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ స్కాట్లాండ్ కు నిరాశే మిగిలింది.




# టోర్నీలో బోణీ కొట్టిన ఐర్లాండ్

## ఒమన్‌పై 96 పరుగుల తేడాతో విక్టరీ




టీ20 వరల్డ్ కప్‌లో రెండు వరుస ఓటముల తర్వాత ఐర్లాండ్ అద్భుతమైన కమ్ బ్యాక్ ఇచ్చింది. శనివారం ఒమన్ తో జరిగిన మ్యాచ్ లో ఏకంగా 96 పరుగుల తేడాతో నెగ్గి టోర్నీలో బోణీ కొట్టింది. ఐర్లాండ్ నిర్దేశించిన 236 పరుగుల లక్ష్య ఛేదనలో ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగుకే కుప్పకూలింది. ఆమిర్ ఖలీమ్ (50 పరుగులు), హమ్మద్ మీర్జా (46 పరుగులు) ఇద్దరే రాణించారు. మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జోషువా లిటిల్ 3, బ్యారీ మెక్ , మ్యాథ్యూ హాంఫ్రీస్ చెరో 2, జార్జ్ డాక్రెల్ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. లోర్కన్ టక్కర్ (94 పరుగులు; 51 బంతుల్లో; 10ఇ4, 4ఇ6), డిలానీ (56 పరుగులు; 30 బంతుల్లో; 3ఇ4, 4ఇ6), జార్జ్ డాక్రెల్ (35 పరుగులు, 9 బంతుల్లోనే, 5 సిక్స్ లు) రాణించడంతో భారీ స్కోర్ దక్కింది. ఈ వరల్డ్ కప్ ఎడిషన్ లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3, షా ఫైసల్, ఆమిర్ ఖలీమ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఇన్నింగ్స్ తో రాణించిన లోర్కన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇక టీ20ల్లో పరుగుల పరంగా ఐర్లాండ్ కు ఇది మూడో అత్యధిక మార్జిన్ విజయం. 2023లో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్ లో ఐర్లాండ్ ఏకంగా 128 పరుగుల తేడాతో నెగ్గింది. టీ20 హిస్టరీలో ఆ జట్టుకు బిగ్గెస్ట్ మార్జిన్ తో విజయం సాధించిన మ్యాచ్ ఇదే. దీని తర్వాత 2017లో స్కాట్లాండ్ తో 98 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇది రెండో అత్యధికం. అలాగే ఈ మ్యాచ్ లో ఇంకో అరుదైన ఘతన నమోదైంది. ఇరుజట్లలోని ఎడమచేతి వాటం బౌలర్లు ఈ మ్యాచ్ లో 11 వికెట్లు పడగొట్టారు. ఒక టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ లో ఎడమచేతి వాటం బౌలర్లు అత్యధిక వికెట్లు పడగొట్టిన మ్యాచ్ ఇదే. బంగ్లాదేశ్ జం ఒమన్ మ్యాచ్ తో ఈ మ్యాచ్ నిలిచింది. అది 2021 వరల్డ్ కప్ లో జరిగింది.

**ఐర్లాండ్ తుది జట్టు : రాస్ అడైర్, టిమ్ టెక్టర్, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్ (కెప్టెన్, వికెట్ కీపర్), కర్టిస్ కాంఫర్, జార్జ్ డాక్రెల్, గారెత్ డెలానీ, మార్క్ అడైర్, బారీ మెక్కార్తీ, మాథ్యూ హంఫ్రీస్, జాషువా లిటిల్**

**ఒమన్ తుది జట్టు : అమీర్ కలీం, జతీందర్ సింగ్ (కెప్టెన్), హమ్మద్ మీర్జా, ఆశిష్ ఒడెదర, మహ్మద్ నదీమ్, జితేన్ రామానంది, వినాయక్ శుక్లా (వికెట్ కీపర్), నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మహ్మద్, షా ఫైజల్, షకీల్ అహ్మద్**



# ప్రియురాలికి హార్ధిక్ పాండ్యా మరిచిపోలేని జ్ఞాపకం

ఫిబ్రవరి 15న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ ఉన్నప్పటికీ భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు ఈ వాలెంటైన్స్ డేని మరింత ప్రత్యేకంగా మార్చారు. తన గర్ల్‌ఫ్రెండ్ పేరులోని మొదటి అక్షరం 'వీ'ని తన మెడ వెనుక భాగంలో పాండ్యా టాటూ వేయించుకున్నాడు. ఈ టాటూను సెలబ్రిటీ టాటూ ఆర్టిస్ట్ సన్నీ భానుశాలి, లీడ్ ఆర్టిస్ట్ తుషార్ మరానే రూపొందించారు. హార్దిక్ ఎం అక్షరంతో కొత్త టాటూ మహికా శర్మపై తన ప్రేమను వ్యక్తం చేస్తోంది. ఈ వాలెంటైన్స్ డే ఆమెకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఫ్యాన్స్ సైతం కామెంట్లు చేస్తున్నారు. టీమ్ సమాచారం ప్రకారం, హార్దిక్ పాండ్యా మొదట మహికా కోసం కేవలం ఒక చిన్న టాటూ వేయించుకోవాలని అనుకున్నాడు. కానీ వారు తమ రిలేషన్, ఒకరి గురించి ఒకరు మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ ఐడియా పెద్దదిగా మారింది. చివరికి వాలెంటైన్స్ డే గిఫ్ట్ గా మారింది. టాటూలో మీరు గమనిస్తే.. 2 చిరుతపులులు ఉన్నాయి. మొదటి చిరుతపులి చాలా పవర్‌ఫుల్, నేచురల్‌గా కనిపిస్తుంది. ఇది హార్దిక్ పాండ్యా బలాన్ని, శ్రమను సూచిస్తుంది. రెండో చిరుతపులి లైన్ ఆర్ట్‌లో రూపొందించారు. ఇది మొదటి చిరుత చుట్టూ తిరుగుతున్నట్లు ఉంటుంది. తన గాళ్‌ఫ్రెండ్ మహికా పేరులోని మొదటి అక్షరం 'వీ' స్పష్టంగా కనిపిస్తుంది. హార్దిక్ మొదట కేవలం మహికా పేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే టాటూ వేయించుకోవాలని భావించాడని సన్నీ భానుశాలి తెలిపారు. కానీ మాట్లాడుతున్న సమయంలో వారి బంధంలోని ఒక స్పెషల్ స్టోరీ బయటకు వచ్చింది. వారు ఒకరికొకరు బలాన్ని అందించే పార్ట్‌నర్స్ కావాలని భావించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్థవంతంగా చూపించడానికి చిరుతపులి టాటూ సరైన చిహ్నంగా మారింది. ఈ టాటూ కేవలం ఫ్యాషన్ కోసం మాత్రమే కాదు. కొన్ని టాటూలు కేవలం అడిగితే, లేక ఎవరైనా సూచిస్తే వేసుకుంటారు. కానీ కొన్ని వాటంతట అవే రూపుదిద్దుకుంటాయి. హార్దిక్ ఈ టాటూ నమ్మకంతో పాటు భావోద్వేగంతో తయారైంది. టాటూ ఏదైనా రియల్ స్టోరీని ప్రతిబింబించినప్పుడు, అది కేవలం రంగుగా మాత్రం మిగిలిపోదు. వారికి, ప్రియమైన వ్యక్తికి అది ఒక జ్ఞాపకంగా మారుతుంది. హార్దిక్ పాండ్యా గత ఏడాది 2025లో మహికా శర్మతో తన రిలేషన్ పై స్పందించాడు. ప్రస్తుతం వీరు ప్రేమలో మునిగి తేలుతున్నారు. గతంలో హార్దిక్ పాండ్యా విదేశీ మోడల్, బాలీవుడ్ నటి నటాషా స్టాంకోవిచ్‌ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ మే 2020లో ఇంట్లోనే సాధారణంగా వివాహం చేసుకోగా, ఫిబ్రవరి 2023లో రాజస్థాన్‌లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వైభవంగా పెళ్లి చేసుకున్నారు. ఏడాదిన్నరలోనే కథ ముగిసింది. అభిప్రాయభేదాలు రావడంతో జూలై 2024లో వారు విడిపోతున్నట్లు ప్రకటించారు. వీరికి కుమారుడు అగస్త్య ఉండగా.. బాలుడి బాధ్యతలను ఇద్దరూ చూసుకుంటున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఏప్రిల్ 1న మా పెళ్లి!



సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. 'ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.

## ర్యూమర్స్‌పై చమత్కరించిన మృణాల్ ఠాకూర్

# రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది




ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.



# అట్లీ-అల్లు అర్జున్ మూవీ

## సినిమా షూటింగ్ డిలేపై అల్లు అసహనం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్‌తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ప్లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జైట్మెంట్ పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ – అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

## శ్రీనివాస మంగాపురం మూవీ పోస్టర్ విడుదల

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.







# లోకేశ్ హీరోగా డీసీ

'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్‌లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861